సత్యమేవ జయతే


# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 341

శుక్రవారం 3-3-2023



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

స్వాగతం.. సుస్వాగతం
ఎడ్వాంటేజ్ ఆంధ్రప్రదేశ్
వనరులు విస్తారం.. అవకాశాలు అపారం...
గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023
మార్చి 3-4 తేదీలలో..
ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్స్, విశాఖపట్నం
www.advantageap.in
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి
శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

## స్వాగతం.. సుస్వాగతం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి
శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి

ఎడ్వాంటేజ్
# ఆంధ్రప్రదేశ్
వనరులు విస్తారం..
అవకాశాలు అపారం...





## గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023

**మార్చి 3-4 తేదీలలో..**

ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్స్, విశాఖపట్నం

**www.advantageap.in**

- 25 దేశాలు
- 46 మంది దౌత్యవేత్తలు
- 30 మంది గ్లోబల్ బిజినెస్ లీడర్స్
- 14 వేలకు పైగా ప్రతినిధులు
- ఎంఓయూలపై సంతకాలు
- 15 ఫోకస్ సెక్టార్ సెషన్స్
- 4 కంట్రీ సెషన్స్
- ఒక స్పెషల్ సెషన్
- బిజినెస్ టు బిజినెస్ ఫెసిలిటేషన్
- బిజినెస్ టు గవర్నమెంట్ ఫెసిలిటేషన్
- పెవిలియన్ ద్వారా ఏపి సామర్థ్యాల ప్రదర్శన
- 130 ఎగ్జిబిషన్ స్టాల్స్

### ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నెంబర్ వన్ ర్యాంక్

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో వరుసగా గత మూడేళ్ల దేశంలోనే మొదటి స్థానం.. స్టేక్ హోల్డర్స్ ఫీడ్ బ్యాక్ ఆధారంగా నిర్వహించిన సర్వే ద్వారా ఇది సాధించడం గమనార్హం..

### రెండంకెల వృద్ధి రేటు

రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిలో 2021-22లో దేశంలోనే అత్యధికంగా 11.43 % వృద్ధిరేటు నమోదు..

### పటిష్టమైన మారిటైమ్ మౌలిక సదుపాయాలు

974 కి.మీల తీరంతో దేశంలోనే 2వ అతిపెద్ద సముద్ర తీరం గల రాష్ట్రం.. ఇప్పటికే ఉన్న 6 పోర్టులు, రాబోయే 4 పోర్టులతో ఆగ్నేయాసియాకు ముఖ ద్వారంగా మన రాష్ట్రం..

### పారిశ్రామిక అనుకూల వాతావరణం

పరిశ్రమ అనుకూల విధానాలు.. సమర్థ నాయకత్వంతో కూడిన ప్రభుత్వం.. దేశంలో రాబోతున్న 11 ఇండస్ట్రియల్ కారిడార్లలో 3 ఆంధ్రప్రదేశ్ లోనే..

### అవార్డులు

- లీడ్స్ (లాజిస్టిక్స్) అవార్డు 2022
- ఎనర్షియా (విద్యుత్) అవార్డు 2022
- పోర్టులెడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్‌లో ఈటీ అవార్డు 2022

### ఇవీ మా బలాలు

- విస్తారంగా భూమి లభ్యత
- అపారమైన ఖనిజ సంపద
- పుష్కలంగా నీటి వనరులు
- నిరంతర విద్యుత్ సరఫరా
- నైపుణ్యం కలిగిన యువత
- ఆరు విమానాశ్రయాలు
- రాబోయే 4 పోర్టులతో కలిపి మొత్తం 10 పోర్టులు..



ఏరోస్పేస్ & డిఫెన్స్ | అగ్రి & ఫుడ్ ప్రాసెసింగ్ | ఆటోమోటివ్ & ఎలక్ట్రికల్ వాహనాలు | ఎలక్ట్రానిక్స్ & ఐటీ | ఆరోగ్య భద్రత & వైద్య పరికరాలు | పరిశ్రమలు & లాజిస్టిక్స్ మౌలిక వసతులు | MSME లు, స్టార్టప్‌లు & నూతన ఆవిష్కరణలు | పెట్రోలియం & పెట్రో కెమికల్స్ | ఫార్మాస్యూటికల్స్ & లైఫ్ సైన్సెస్ | పునరుత్పాదక శక్తి | విద్య & నైపుణ్యాభివృద్ధి | వస్త్రాలు & దుస్తులు | పర్యాటకం & ఆతిథ్యం

**శ్రీ. గుడివాడ అమర్‌నాథ్,** పరిశ్రమలు, మౌలిక వసతులు, పెట్టుబడులు, వాణిజ్యం మరియు ఐటీ శాఖా మాత్యులు

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శుక్రవారం ॥ 3-3-2023



న్యూస్‌మేకర్స్

# మహిళా ఎం.ఎల్.ఏలు చరిత్ర సృష్టించారు





**నాగాలాండ్ ఏర్పడి 60 ఏళ్లు.
60 సీట్లు ఉన్న అసెంబ్లీలో
ఇప్పటి వరకూ
ఒక్క మహిళ కూడా అడుగుపెట్టలేదు.
ఇప్పుడు ఆ ఘనతను ఇద్దరు ఎం.ఎల్.ఏలు
దక్కించుకొని చరిత్ర సృష్టించారు.
2023 అసెంబ్లీ ఎన్నికల్లో
హెకాని జకాలు, సల్‌హౌటనో క్రుసె
విజయం సాధించారు.
గురువారం ఓట్ల లెక్కింపు జరగగా
డిమాపూర్-3 నుంచి హెకాని,
పశ్చిమ అంగమె నుంచి క్రుసె
విజయం సాధించారు.
అక్కడి పాలనాధికారంలో
స్త్రీల ప్రాతినిధ్యం మొదలైంది.
ఇది ఆగదు.**

మహిళలను 'ఆకాశంలో సగం' అంటాం. వారికి అవకాశాలలో సగం దక్కాలన్న ఉద్యమాలు బయలుదేరి చాలా కాలం అయ్యింది. కాని ఇంకా కొన్నిచోట్ల వారికి అవాంతరాలు ఎదురవుతూనే ఉన్నాయి. పురుష భావజాలం స్త్రీలలో కూడా నాటుకుపోయి స్త్రీకి స్త్రీయే ప్రతికూలత సృష్టించేవరకూ వెళుతోంది. ఉదాహరణకు నాగాలాండ్‌లో పాలనాధికారంలో స్త్రీలు ఉండటాన్ని మొదటినుంచీ వ్యతిరేకించారు. అక్కడి మొత్తం ఓటర్లు 13 లక్షలు ఉంటే వారిలో దాదాపు ఆరున్నర లక్షల ఓటర్లు మహిళలే అయినా వారు ఒక్క మహిళనూ గెలిపించుకోలేదు. దానికి కారణం అక్కడ ఇంటి పెద్ద, సమూహం పెద్ద, ఊరి పెద్ద ఎవరికి ఓటెయ్యమంటే స్త్రీలు వారికే ఓటు వేయాలి. పురుషులే సంపాదనపరులు కనుక పురుషుల మాట వినాలని స్త్రీలు అనుకుంటారు. పురుషులు సహజంగానే స్త్రీల ప్రాతినిధ్యాన్ని అంగీకరించరు. కనుక 1963లో నాగాలాండ్ ఏర్పడితే... 13 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే కేవలం 20 మందికే సీట్లు దక్కాయి. కాని ఎవరూ గెలవలేదు. డిపాజిట్లు కూడా రాలేదు. 2018లో 5 మంది స్త్రీలు పోటీ చేస్తే వారిలో ఎవరూ గెలువలేదు. కాని ఈ ధోరణిలో ఇప్పుడు మార్పు వచ్చిందనే సంకేతాలు అందుతున్నాయి. 2023 ఎన్నికలలో మొత్తం 183 మంది అన్ని పార్టీల నుంచి బరిలో దిగగా వీరిలో నలుగురు స్త్రీలు ఉన్నారు. ఈ నలుగురిలో నేషనల్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్.డి.పి.పి) నుంచి ఇద్దరు మహిళలు హెకాని, క్రుసె గెలిచారు. బి.జె.పితో కలిసి ఎన్.డి.పి.పి అక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. అందువల్ల ఈ ఇరువురిలో ఎవరైనా మంత్రి అయితే అదీ మరో చరిత్ర కాగలదు.

## ఏడు ఓట్లతో గెలిచిన క్రుసె

నాగాలాండ్‌లోని పశ్చిమ అంగమి నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు ఉత్కంఠ భరితంగా సాగింది. చివరకు ఎన్.డి.పి.పి అభ్యర్థి, 56 సల్‌హౌటనో క్రుసె ఏడంటే ఏడే ఓట్లతో విజయం సాధించింది. పశ్చిమ అంగమెలో ఆమెకు ప్రత్యర్థిగా నిలిచిన నక్రో గతంలో నాగా పీపుల్స్ పార్టీలో ఉండేవాడు. ఆ తర్వాత ఎన్.డి.పి.పికి జంప్ చేశాడు. కాని ఈ ఎన్నికల్లో ఎన్.డి.పి.పి టికెట్ ఇవ్వకపోయేసరికి ఇండిపెండెంట్‌గా రంగంలో దిగాడు. అతణ్ణి ఓడించడానికి క్రుసె సర్వశక్తులు ఒడ్డి పోరాడాల్సి వచ్చింది. హోటల్స్ రంగంలో ఉన్న క్రుసె నాగాలాండ్‌లోని సామాజిక సంస్థలకు కలిసి పని చేస్తోంది. తన గిరిజన తెగ మహిళా విభాగానికి నాయకురాలిగా కూడా ఉంది. ఈమె గెలుపుతో అంగమిలో భారీ వేడుకలు మొదలయ్యాయి. జనం బారులు తీరి అభినందనలు తెలుపుతున్నారు.

## మొదటి విజేత హెకాని

నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికలకు గురువారం జరిగిన ఫలితాల లెక్కింపులో ఆ రాష్ట్రంలో గెలిచిన మొదటి మహిళా ఎం.ఎల్.ఏగా ఎన్.డి.పి.పి అభ్యర్థి హెకాని జకాలు (47) మొదట డిక్లేర్ అయ్యింది. ఆ తర్వాతే రెండో మహిళా అభ్యర్థి క్రుసె గెలుపు ప్రకటితమైంది. అందువల్ల హెకాని విజయం విశేషంగా మారింది. డిమాపూర్-3 నియోజకవర్గంలో సిట్టింగ్ ఎం.ఎల్.ఏ జిమోమిని 1536 ఓట్లతో ఓడించింది హెకాని. అయితే ఈమెకు ఈ గెలుపు ఊరికే రాలేదు. సుదీర్ఘ కృషి ఉంది. డిమాపూర్‌లో పుట్టి పెరిగిన హెకాని ఢిల్లీలో చదువుకుంది. ఆ తర్వాత అమెరికాలో శాన్‌ఫ్రాన్సిస్కోలో లా చదివింది. నాగాలాండ్‌లో 'యూత్‌నెట్ నాగాలాండ్' అనే ఎన్.జి.ఓను స్థాపించి యువతీ యువకుల చదువుకు, ఉపాధికి మార్గం చూపింది.

'మేడ్ ఇన్ నాగాలాండ్' పేరుతో వస్తు ఉత్పత్తి, ఆవిష్కరణల కోసం కోహిమాలో ఒక సెంటర్ నడుపుతోందామె. అందుకే ఆమెకు నారీశక్తి పురస్కారం లభించింది. ఈ ఎన్నికలలో ఆమె తన విజయం కోసం గట్టిగా పోరాడింది. స్త్రీల విద్య, ఉపాధికి హామీలు ఇచ్చింది. ఆమె కోసం అస్సాం ముఖ్యమంత్రి బిశ్వ శర్మ ప్రచారం చేశాడు.

బ్యూటిప్స్

## సహజ సిద్ధమైన యూత్ ప్యాక్స్

పార్టీలు, వేడుకలకు వెళ్లాలనుకొన్నప్పుడు ముఖానికి తక్షణ నిగారింపు రావడం కోసం రకరకాల ఫేస్ ప్యాక్‌లు ఉపయోగిస్తుంటారు. అయితే ఒక్కోసారి అవి అందుబాటులో ఉండవు. ఉన్నా, చర్మానికి పడవు. అలాంటప్పుడు... సహజసిద్ధమైన ఈ ఫేస్ ప్యాక్స్ ప్రయత్నించండి. ఇవి మీ చర్మానికి తగిన పోషణను ఇవ్వడంతో పాటు యవ్వన కాంతినిస్తాయి.

### చందనం, రోజ్ వాటర్

చందనం ముఖం పై ఉన్న మృతకణాలను తొలగించి చర్మం మెరిసిపోయేలా చేస్తుంది. రోజ్‌వాటర్ చర్మానికి మెరుపునందిస్తుంది. వేసవిలో ఈ ప్యాక్ వేసుకోవడం ద్వారా సూర్యరశ్మి ప్రభావానికి గురైన చర్మానికి ఉపశమనం దొరుకుతుంది. ఇందుకోసం... ● గంధపు చెక్కను రోజ్ వాటర్‌తో అరగదీసి.. ముఖానికి ఫేస్ ప్యాక్‌లా వేసుకోవాలి. ఆరిన తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకొంటే సరిపోతుంది. మీ దగ్గర గంధపు చెక్క లేకపోతే.. దానికి బదులుగా గంధపు పొడిని ఉపయోగించవచ్చు. గంధం పొడిలో సరిపడినంత రోజ్ వాటర్ కలిపి ముఖానికి మాస్క్‌లా వేసుకొంటే సరిపోతుంది.

### ఓట్ మీల్‌తో...



ఓట్‌మీల్ సహజసిద్ధమైన స్క్రబ్‌లా పనిచేస్తుంది. దీనిలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్ గుణాలు, ఇతర పోషకాలు చర్మానికి మెరుపునిస్తాయి. ఓట్ మీల్ సహజసిద్ధమైన క్లెన్సర్‌గా పనిచేసి చర్మాన్ని శుభ్రపరుస్తుంది. రెండు టేబుల్‌స్పూన్ల ఓట్ మీల్‌లో టీస్పూన్ చందనం పొడి వేసి సరిపడినంత రోజ్ వాటర్ కలిపి పేస్టులా తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి పావుగంట ఆరనివ్వాలి. ఆ తర్వాత కొన్ని నీళ్లు చల్లుకుంటూ మసాజ్ చేసుకొంటున్నట్టుగా ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మంపై ఉన్న మృత కణాలు తొలగిపోతాయి.

# వసంతాలు విరిసేవేళ

ఫ్యాషన్









పూర్తి వైట్ ఇష్టపడని వారు క్రీమ్ కలర్, ఇతర కాంబినేషన్ కలర్స్‌తో ఉన్న డ్రెస్సులనూ ఎంపిక చేసుకోవచ్చు. ఇండో-వెస్ట్రన్ స్టైల్ డ్రెస్సులు అన్ని పార్టీలలోనూ ప్రత్యేకంగా ఉంటాయి.



వసంతం విచ్చేసిందని
ప్రకృతి మనకు పంపించే
తొలి కబురు రంగుల వేడుకైన హోలి.
రాబోయే వేసవిని తట్టుకోవడానికి
మన మేనిని హాయిగొలిపేలా ఉంచడానికి
స్వచ్ఛమైన తెలుపును పరిచయం చేసేది హోలి.
ఎందుకంటే రంగుల హంగులను
అందంగా ఇముడ్చుకునేది తెలుపే!
ఇంద్రధనుస్సు ఎలాగూ వేసుకున్న దుస్తులను
అందంగా పలకరిస్తుంది
పువ్వుల నవ్వుల్ని, పచ్చదనాన్నీ అద్దుతుంది.
ఆ హంగులను అద్దుకున్న తెలుపు
మన జీవితాలను ఆనందమయం చేస్తుంది.
అందుకే, వసంతాలు విరిసేవేళా
నిన్ను నేను చూశాను...అంటూ
తెలుపు రంగు డ్రెస్‌ల ఎంపికకు
మొదటి ఓటు వేయవచ్చు.

తెలుపుతోపాటు క్రీమ్ కలర్ థీమ్ ఉన్న డ్రెస్సులు ఎంతో అందాన్నీ, హాయినీ ఇస్తాయి. వీటిలో కాటన్, లినెన్, చికన్ కారీ వర్క్, ఇతర ఎంబ్రాయిడరీ లేదా చిన్న చిన్న పెయింటింగ్స్ ఉన్న డ్రెస్సులను ఎంపిక చేసుకోవచ్చు.



# స్వీట్ హోలీ

వంటిల్లు

రంగుల పండుగ వస్తోంది.
రంగరంగ వైభవంగా వస్తోంది.
తీపి జ్ఞాపకాలను తెస్తోంది.
రుచులకు ఆహ్వానం పలుకుతోంది.
ఈ ఏటి హోలీ ఇచ్చిన
తీపి రుచిని...
రాబోయే హోలీ వరకు
మర్చిపోదు మది.

## రసగుల్లా



**కావలసినవి:** పాలు – లీటరు (వెన్న తీయనివి) ; నిమ్మరసం– 3 టేబుల్ స్పూన్‌లు ; చక్కెర – 2 కప్పులు ; నీరు – లీటరు ; పాలు – టేబుల్ స్పూన్ ; ఉప్మారవ్వ– టీ స్పూన్. పిస్తాపలుకులు : 20

**తయారీ:** ● పాలను మందపాటి పాత్రలో పోసి స్టవ్ మీద పెట్టాలి. బాగా మరిగిన తర్వాత మంట తగ్గించి నిమ్మరసం వేసి కలపాలి. ముందు సగం నిమ్మరసం వేసి కలిపి చూసి, పాలు బాగా విరిగితే మిగిలిన రసాన్ని ఆపేయాలి. పాలు సరిగ్గా విరగకపోతే మొత్తం రసాన్ని వేసి కలపాలి (పాశ్చరైజేషన్ జరగని పాలకు ఒక స్పూన్ నిమ్మరసం సరిపోతుంది). విరిగిన పాలను పలుచని వస్త్రంలో పోసి మూట కట్టి ఏదైనా కొక్కేనికి వేలాడదీయాలి. ఓ అర గంట తర్వాత నీరు పోయేలా చేత్తో గట్టిగా నొక్కాలి. ఆ తర్వాత పైన బరువు పెట్టాలి. ఇలా చేయడం వల్ల నీరంతా కారిపోతుంది. పాల విరుగు మాత్రం మూటలో మిగులుతుంది. ● పాలవిరుగులో రవ్వ వేసి వేళ్లతో నలుపుతూ కలపాలి. ఇలా చేస్తూ ఉంటే ముందుగా పాల విరుగు పొడిగా మారుతుంది. మరికొంత సేపటికి ముద్దగా అవుతుంది. ఇప్పుడు ఆ ముద్దను చిన్న చిన్న గోళీలుగా చేయాలి. ● వెడల్పుగా, లోతుగా ఉన్న కడాయిలో చక్కెర, నీరు పోసి వేడి చేయాలి. చక్కెర కరిగిన తరవాత అందులో టేబుల్ స్పూన్ పాలు వేయాలి. రెండు నిమిషాలకు చక్కెర ద్రవం శుభ్ర పడి అందులోని మలినాలు నల్లగా పైకి తేలుతాయి. స్పూన్‌తో కానీ చిల్లుల గరిటెతో తీసేయాలి లేదా పలుచని వస్త్రంలో వడపోయడం మంచిది. వడపోసిన ద్రవాన్ని మళ్లీ కడాయిలో పోసి మరిగించాలి. ● ఇప్పుడు చక్కెర ద్రవంలో పాల విరుగుతో చేసిన గోళీలను వేసి నాలుగైదు నిమిషాల సేపు మీడియం మంట మీద ఉడికించాలి (పెద్ద మంట మీద ఉడికిస్తే రసగుల్లాలు విరిగిపోతాయి). చిన్న గోళీలుగా వేసిన రసగుల్లాలు చక్కెర పాకాన్ని పీల్చుకుని పెద్దవవుతాయి. అప్పుడు స్టవ్ ఆపేయాలి. వేడి తగ్గిన తరవాత కప్పులో రసగుల్లాతోపాటు ఒక టేబుల్ స్పూన్ సిరప్, పిస్తా వేసి సర్వ్ చేయాలి. **గమనిక:** రసగుల్లాలకు చేసే చక్కెర ద్రవం పలుచగా ఉండాలి. పాకం రాకూడదు.

## ఫిర్నీ



**కావలసినవి:** బియ్యం – పావు కప్పు ; వెన్న తీయని పాలు – లీటరు ; చక్కెర – అర కప్పు ; బాదం పప్పు – 10 ; పిస్తా – 10 ; యాలకుల పొడి – అర టీ స్పూన్ ; కుంకుమ పువ్వు – 15 రేకలు ; పన్నీరు – 2 టీ స్పూన్‌లు (ఇష్టమైతేనే), కిస్‌మిస్: 20 జీడిపప్పు: 10.

**తయారీ:** ● బియ్యం కడిగి దళసరి బట్ట మీద వేసి నీడలో ఆరబెట్టి, తేమ పోయిన తర్వాత మిక్సీలో గ్రైండ్ చేయాలి (మరీ మెత్తగా అక్కరలేదు). ● ఈ లోపు ఒక చిన్న పాత్రలో నీటిని వేడి చేసి అందులో బాదం, పిస్తా వేసి మూత పెట్టాలి. అరగంట తర్వాత నీటిని వడపోసి పొట్టు వలిచి, సన్నగా తరగాలి. ● వెడల్పుగా, మందంగా ఉన్న పాత్రలో పాలు మరిగించాలి. ఒక పొంగు వచ్చిన తర్వాత ఒక గరిటెడు పాలను చిన్న పాత్రలోకి తీసుకుని కుంకుమ పువ్వు రేకలు వేసి నానబెట్టాలి. పాత్రలో పాలను మరో రెండు నిమిషాల సేపు మరిగించిన తర్వాత మంట తగ్గించి బియ్యప్పిండి, చక్కెర వేసి అడుగు పట్టకుండా, ఉండకట్టకుండా గరిటెతో కలుపుతూ ఉడికించాలి. చిక్కబడుతున్నప్పుడు యాలకుల పొడి వేయాలి. మిశ్రమం చిక్కబడిన తర్వాత కుంకుమపువ్వు కలిపిన పాలు, బాదం, పిస్తా సగం వేసి కలపాలి. ఇవన్నీ వేసిన తర్వాత మరో రెండు లేదా మూడు నిమిషాల సేపు మరగనిచ్చి పన్నీరు వేసి కలిపి స్టవ్ ఆపేయాలి. ఫిర్నీ రెడీ. ఈ ఫిర్నీని కప్పులో పోసిన తర్వాత మిగిలిన బాదం, పిస్తా, జీడిపప్పు, కిస్‌మిస్‌తో అలంకరించాలి. ఈ ఫిర్నీని గోరువెచ్చగా తినవచ్చు లేదా చల్లబరిచి తినవచ్చు. ఫ్రిజ్‌లో రెండు– మూడు రోజులు తాజాగా ఉంటుంది.

## రైస్ ఖీర్



**కావలసినవి:** బియ్యం– కప్పు ; పాలు – ఒకటిన్నర లీటరు (వెన్న తీయనివి) ; చక్కెర – కప్పు ; యాలకుల పొడి– టీ స్పూన్ ; కుంకుమ పువ్వు– చిటికెడు లేదా 15 రేకలు ; బాదం – టేబుల్ స్పూన్ ; జీడిపప్పు – టేబుల్ స్పూన్ ; పిస్తా – టేబుల్ స్పూన్ ; కిస్‌మిస్ – టేబుల్ స్పూన్.

**తయారీ:** ● బియ్యం కడిగి 15 నిమిషాల సేపు నానబెట్టాలి. ● చిన్న పాత్రలో నీటిని వేడి చేసి బాదం, పిస్తా వేసి మూతపెట్టాలి. అర గంట తర్వాత పొట్టు తీసి సన్నగా తరగాలి. కిస్‌మిస్‌ని కడిగి పక్కన పెట్టుకోవాలి. ● బియ్యం నానిన తర్వాత స్టవ్ మీద వెడల్పు పాత్ర పెట్టి పాలు పోసి మరిగించాలి. ఒక గరిటెడు పాలు విడిగా తీసుకుని కుంకుమ పువ్వు రేకలను నానబెట్టాలి. ● బియ్యంలోని నీటిని వంపేసి బియ్యాన్ని మరుగుతున్న పాలలో వేసి ఉడికించాలి. బియ్యం ఒక మోస్తరుగా ఉడికిన తర్వాత చక్కెర వేసి కలిపి సన్నమంట మీద ఉడికించాలి. ● అన్నం ఉడికిందని నిర్ధారించుకున్న తర్వాత యాలకుల పొడి, బాదం, పిస్తా తరుగు, కిస్‌మిస్, కుంకుమ పువ్వు కలిపిన పాలు పోసి బాగా కలిపి మూత పెట్టి స్టవ్ ఆపేయాలి. రైస్ ఖీర్ రెడీ. ఖీర్ దగ్గరయ్యే వరకు ఉడికించాల్సిన అవసరం లేదు. స్టవ్ ఆపేసిన తర్వాత చల్లారే కొద్దీ దగ్గరవుతుంది.

## రస్‌మలై



**కావలసినవి:** రసగుల్లాలు – 15 (ఇంట్లో చేయడం కుదరకపోతే రెడీమేడ్‌వి తీసుకోవచ్చు) ; పాలు – లీటరు ; చక్కెర – 5 టేబుల్ స్పూన్‌లు ; బాదం –10 ; పిస్తా– 10 ; యాలకుల పొడి– టీ స్పూన్ ; కుంకుమ పువ్వు – 20 రేకలు. **తయారీ:** ● అరకప్పు వేడి నీటిలో బాదం, పిస్తాలను అరగంట సేపు నానబెట్టి పొట్టు తీసి తరగాలి. ● పావు కప్పు వేడి పాలలో కుంకుమ పువ్వు వేసి పక్కన ఉంచాలి. ● మందపాటి బాణలిలో పాలు మరిగించాలి. పైకి తేలిన మీగడను స్పూన్‌తో తీసి ఒక గిన్నెలో వేసుకుంటూ పాలు అడుగు పట్టకుండా కలుపుతూ, పాలు సగమయ్యే వరకు మరిగించాలి. ఇప్పుడు చక్కెర వేసి కరిగే వరకు కలుపుతూ మరిగించాలి. యాలకుల పొడి, బాదం, పిస్తా (సగం), కుంకుమ పువ్వు పాలు కలిపి వీటి రుచి పాలకు పట్టే వరకు సన్నమంట మీద మరిగించాలి. ● ఇప్పుడు రసగుల్లాను ఒక ప్లేట్‌లోకి తీసుకుని గరిటె లేదా అట్లకాడ సాయంతో లేదా వేళ్లతో చక్కెర పాకం జారిపోయేటట్లు మెల్లగా నొక్కాలి. ఇలా రసగుల్లాలన్నింటినీ నొక్కి జాగ్రత్తగా పాలలో వేయాలి. రెండు నిమిషాలపాటు పాలలో ఉడకనిచ్చి స్టవ్ ఆపేయాలి. ● రసమలై చల్లారిన తర్వాత కప్పులో వేసి మీగడ(ఇష్టమైతే), బాదం, పిస్తాలతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి.



'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 341

శుక్రవారం 3-3-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





### 'లయన్' పంజా

8 వికెట్లతో భారత్‌ను కుప్పకూల్చిన ఆసీస్ స్పిన్నర్. ఆస్ట్రేలియా లక్ష్యం 76. -12లో



### పోస్ట్ కోవిడ్‌తో గుండెపోటు!


పోస్ట్ కోవిడ్ గుండెపోట్ల నివారణపై డీహెచ్ డాక్టర్ శ్రీనివాసరావు సలహాలు -5లో



### అదానీపై సుప్రీం నిపుణుల కమిటీ

అదానీ–హిండెన్‌బర్గ్ వ్యవహారంలో మదుపర్ల ప్రయోజనాలను కాపాడేందుకు ఆరుగురు సభ్యులతో సుప్రీంకోర్టు నిపుణుల కమిటీ

వివరాలు 6లో ▸



### ఏకాభిప్రాయం సాధిద్దాం

భౌగోళిక ఉద్రిక్తతలు జి–20లో సహకారంపై ప్రభావం చూపనీయరాదని విదేశాంగ ప్రతినిధులకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

వివరాలు 6లో ▸



### మరోసారి రాష్ట్రానికి అమిత్ షా

అసెంబ్లీ ఎన్నికలకు రాష్ట్ర పార్టీ సిద్ధమవుతున్న తీరును పరిశీలించేందుకు బీజేపీ అగ్రనేత అమిత్ షా ఈనెల 11న రాష్ట్రానికి రానున్నారు.

వివరాలు 3లో ▸

# గవర్నర్ వైఖరి రాజ్యాంగ విరుద్ధం

## తెలంగాణ అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లులను పెండింగ్‌లో పెట్టారు

- సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్.. తగిన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి
- ఎలాంటి స్పందనా తెలపకుండా పది బిల్లులను రాజ్‌భవన్‌లోనే ఆపేశారు
- సంబంధిత మంత్రులు గవర్నర్‌ను కలిసి వివరణలు కూడా ఇచ్చారు
- త్వరలో ఆమోదిస్తామని గవర్నర్ చెప్పినా ఆచరణలోకి రాలేదు
- ఆర్టికల్ 163 ప్రకారం కేబినెట్ సలహా మేరకే గవర్నర్ పనిచేయాలి
- బిల్లులపై సంతృప్తి అంటే వారి వ్యక్తిగతం కాదు
- స్వతంత్రంగా వ్యవహరించాలని భావించడం సరికాదని స్పష్టీకరణ

**సాక్షి, న్యూఢిల్లీ:** రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లులపై ఎలాంటి స్పందనా తెలపకుండా గవర్నర్ పెండింగ్‌లో పెట్టారని.. ఈ వైఖరి రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు మొత్తం పది బిల్లులపై గవర్నర్ ఎలాంటి నిర్ణయం తెలపకుండా రాజ్‌భవన్‌లో ఆపేశారని.. దీనికి సంబంధించి తగిన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. గవర్నర్ తీరు వల్ల సదరు బిల్లులకు సంబంధించిన ప్రయోజనాలు దెబ్బతింటాయని పేర్కొంది. ఈ అంశంలో గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు, పార్లమెంటులో జరిగిన చర్చలను కూడా పిటిషన్‌లో ప్రస్తావించింది. ప్రతివాదులుగా గవర్నర్ కార్యదర్శి, కేంద్ర న్యాయశాఖలను చేర్చింది.

**రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌లోని వివరాలివీ..**

''శాసనసభ ఆమోదించిన పలు బిల్లులపై తెలంగాణ గవర్నర్ ఎలాంటి నిర్ణయం చెప్పడం లేదు. దీనివల్ల ఏర్పడిన రాజ్యాంగ ప్రతిష్టంభన దృష్ట్యా ఆర్టికల్ 32 ప్రకారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తున్నాం. రాజ్యాంగం ప్రకారం అసెంబ్లీ ఉభయ సభలు బిల్లులను ఆమోదించి గవర్నర్‌కు పంపినప్పుడు.. సమ్మతిస్తున్నట్టు లేదా ఆమోదం నిలిపివేస్తున్నట్టు చెప్పాలి. లేదా రాష్ట్రపతి పరిశీలన నిమిత్తం రిజర్వు చేసినట్టు పేర్కొనాలి. బిల్లు వచ్చినపుడు వీలైనంత త్వరగా తిప్పి పంపవచ్చు. ద్రవ్య బిల్లు కానట్లయితే నిర్దిష్ట నిబంధనలు/అంశాలను పునఃపరిశీలించాలని కోరవచ్చు. అప్పుడు దానిపై ఉభయ సభలు పునః పరిశీలన జరిపి తగిన సవరణలతో తిరిగి గవర్నర్‌కు పంపుతాయి. వాస్తవానికి ఆర్టికల్ 163 ప్రకారం ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రి మండలి సహాయం, సలహాతో మాత్రమే గవర్నర్ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. గవర్నర్ స్వతంత్రంగా వ్యవహరించడానికి వీలు లేదు. షంషేర్ సింగ్ వర్సెస్ పంజాబ్ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసింది. భవిష్యత్తులో మంత్రి మండలి సలహాలకు వ్యతిరేకంగా గవర్నర్లు రాష్ట్రంలో

మిగతా 2వ పేజీలో ▶



**పెండింగ్‌లో ఉన్న బిల్లులివీ..**

- ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా (టెర్మినేషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ లీజెస్) సవరణ బిల్లు, 2022
- తెలంగాణ మున్సిపల్ చట్టాల సవరణ బిల్లు, 2022
- తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ (రెగ్యులేషన్ ఆఫ్ ఏజ్ ఆఫ్ సూపర్ యాన్యుషన్) సవరణ బిల్లు, 2022
- యూనివర్సిటీ ఆఫ్ ఫారెస్ట్రీ తెలంగాణ బిల్లు, 2022
- తెలంగాణ యూనివర్సిటీస్ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లు, 2022
- తెలంగాణ మోటార్ వెహికల్ ట్యాక్సేషన్ సవరణ బిల్లు, 2022
- తెలంగాణ స్టేట్ ప్రైవేట్ యూనివర్సిటీస్ (ఎస్టాబ్లిష్‌మెంట్, రెగ్యులేషన్) సవరణ బిల్లు, 2022
- ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ సవరణ బిల్లు, 2023
- తెలంగాణ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు, 2023
- తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్ సవరణ బిల్లు, 2023



# ఈశాన్యంలో కమల వికాసం

## మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు విడుదల

ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో బీజేపీకి నూతనోత్తేజం లభించింది. త్రిపురలో బీజేపీకి సంపూర్ణ మెజార్టీ దక్కింది. నాగాలాండ్‌లో 60 అసెంబ్లీ స్థానాలుండగా ఎన్‌డీపీపీ–బీజేపీ కూటమి 37 స్థానాల్లో పాగా వేసింది. 60 స్థానాలున్న మేఘాలయలో ఒంటరిగా పోటీకి దిగి, కేవలం 2 సీట్లే గెలుచుకున్న బీజేపీ కింగ్‌మేకర్‌గా అవతరిస్తుండడం గమనార్హం. ఈ ఎన్నికల ఫలితాలు ప్రతిపక్ష కాంగ్రెస్‌కు చేదు ఫలితాన్ని మిగిల్చాయి.

వివరాలు 6లో ▶

**ఎన్నికల ఫలితాలు**

| పార్టీ/కూటమి | సీట్లు |
|---|---|
| **మేఘాలయ** | |
| మొత్తం సీట్లు | 60 |
| ఎన్‌పీపీ | 26 |
| యూడీపీ | 11 |
| టీఎంసీ | 5 |
| కాంగ్రెస్ | 5 |
| బీజేపీ | 2 |
| ఇతరులు | 10 |
| (59 స్థానాలకే పోలింగ్ జరిగింది) | |
| **నాగాలాండ్** | |
| మొత్తం సీట్లు | 60 |
| బీజేపీ+ఎన్‌డీపీపీ | 37 |
| ఎన్‌పీఎఫ్ | 2 |
| కాంగ్రెస్ | 0 |
| ఇతరులు | 21 |
| **త్రిపుర** | |
| మొత్తం సీట్లు | 60 |
| బీజేపీ+ | 33 |
| కాంగ్రెస్+లెఫ్ట్ | 14 |
| టీఎంపీ | 13 |
| ఇతరులు | 0 |

# త్రిసభ్య కమిటీ సిఫార్సుతోనే.. ఎన్నికల కమిషనర్ల నియామకాలు

**కేంద్రం సిఫార్సు మేరకు నియమించే వ్యవస్థను రద్దు చేసిన సుప్రీంకోర్టు**



- కేంద్రం తమకు అనుకూలమైనవారిని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ (ఈసీ)లుగా నియమిస్తోందన్న ఆరోపణల నేపథ్యంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. ఇన్నాళ్లుగా కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ఎలక్షన్ కమిషనర్లను నియమిస్తున్న విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అధికారం ముందు సాగిలపడే, ఇంకొకరి ఆదేశాలను శిరసావహించే వ్యక్తి ప్రజాస్వామ్య తలరాతను మార్చే హోదాలో ఉండకూడదని పేర్కొంది. ఈ క్రమంలో ప్రధానమంత్రి, లోక్‌సభలో విపక్ష నేత, సుప్రీం సీజేలతో కూడిన త్రిసభ్య కమిటీ సిఫార్సు మేరకు ఎన్నికల సంఘంలో నియామకాలు జరపాలని తీర్పునిచ్చింది.

వివరాలు 6లో ▶

గురువారం ప్రగతిభవన్‌లో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న సీఎం కేసీఆర్, ఫాక్స్‌కాన్ సంస్థ చైర్మన్ యంగ్ లూ. చిత్రంలో పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్



# పదేళ్లలో లక్ష మందికి ఉపాధి

**రాష్ట్రంలో భారీ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ ఏర్పాటు చేయనున్న ప్రఖ్యాత సంస్థ ఫాక్స్‌కాన్**

- కొంగరకలాన్ లేదా దుండిగల్‌లో 250 ఎకరాల్లో స్థాపన
- సీఎం కేసీఆర్ సమక్షంలో ఎంవోయూ కుదుర్చుకున్న సంస్థ చైర్మన్
- ప్రముఖ బ్రాండ్ల పేరుతో మొబైల్ ఫోన్లు, అనుబంధ ఉత్పత్తుల తయారీ

**సాక్షి, హైదరాబాద్:** తైవాన్‌కు చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ సంస్థ ఫాక్స్‌కాన్ (హోన్ హై టెక్నాలజీ గ్రూప్) రాష్ట్రంలో భారీ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చింది. మొబైల్‌ఫోన్లు, ట్యాబ్‌ల అనుబంధ ఉత్పత్తుల పరిశ్రమను స్థాపించనుంది. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమీపంలోని కొంగరకలాన్ లేదా బాచుపల్లి సమీపంలోని దుండిగల్‌లో 250 ఎకరాల్లో ఇది ఏర్పాటు కానుంది. ఈ పరిశ్రమ ద్వారా రానున్న పదేళ్లలో లక్షమందికి

మిగతా 2వ పేజీలో ▶

### తెలంగాణ వేగం అబ్బురపరిచింది

- హైదరాబాద్ ప్రగతిని చూసి ఔరా అనుకున్నా!
- ఫాక్స్‌కాన్ అధ్యక్షుడు యంగ్ లూ వెల్లడి
- ఐటీ అంటే ఇండియా + తైవాన్ కావాలి: కేటీఆర్
- దేశంలోనే అతిపెద్ద ప్రొటోటైపింగ్ కేంద్రం టీ–వర్క్స్ ప్రారంభం

2లో

# విశాఖ ధగ ధగ!

**నేడు, రేపు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు**

- 14 కీలక రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం
- 45కు పైగా దేశాల నుంచి ప్రతినిధుల రాక
- ఉదయం 10.15 గంటలకు సదస్సును ప్రారంభించనున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

10లో

## క్లుప్తంగా...

### నేటి నుంచి ఎంసెట్ దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: మే 7 నుంచి జరగనున్న తెలంగాణ ఎంసెట్‌కు శుక్రవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న, ఇప్పటికే ఇంటర్ పూర్తయినవారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 10 వరకు దరఖాస్తులు పంపుకోవచ్చు. ఆలస్య రుసుముతో మే 2 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈసారి నర్సింగ్ కోర్సుల్లో చేరే విద్యార్థులు కూడా ఎంసెట్ రాయడంతప్పని సరి. అభ్యర్థులు ఎంసెట్ విధివిధానాలు, దరఖాస్తు చేసుకునే పద్ధతి, ఫీజు చెల్లింపు, లాగిన్ పాస్‌వర్డ్‌కు https:// eamcet.tsche.ac.in అనే వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వాలని కన్వీనర్ డీన్ కుమార్ సూచించారు.

### ధరలు వంద శాతం పెరిగితే, మెస్ చార్జీలు 25% పెంపా?



సాక్షి, హైదరాబాద్: మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫారసులపై సీఎం కేసీఆర్ కలగజేసుకొని పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిత్యావసరాల ధరలు 100 శాతం పెరిగితే, మెస్‌చార్జీలు 25 శాతం మాత్రమే పెంచుతామనడంలో ఎలాంటి హేతుబద్ధత లేదని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల, విద్యార్థుల మెస్ చార్జీలను 25 శాతం మేర పెంచాలని మంత్రివర్గ ఉపసంఘ సమావేశం నిర్ణయించడం హర్షణీయమైనప్పటికీ, ఈ నిర్ణయం గుడ్డిలో మెల్ల లాగా మాత్రమే ఉందని అభిప్రాయపడ్డారు. పెరిగిన

### ఆర్‌బీఐ ప్రజా భాగస్వామ్య కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: జీ– 20 సదస్సుకు భారత దేశం అధ్యక్షత వహిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో భారతీయ రిజర్వు బ్యాంకు ఆధ్వర్యంలో ప్రజా భాగస్వామ్య కార్యక్రమాలను నిర్వహించనున్నారు. జీ–20కి గత ఏడాది డిసెంబర్ 1 నుంచి వచ్చే నవంబర్ 30 వరకు భారత్ నాయకత్వం వహించనున్న నేపథ్యంలో.. భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ సమన్వయంతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఫిబ్రవరి 27 నుండి మార్చి 5 వరకు పాఠశాల విద్యార్థులకు పోటీలు, కళాశాల విద్యార్థులకు 'మాదిరి జీ–20 సమావేశం', రైతులకు సుస్థిర వ్యవసాయ పద్ధతులపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు వివరించింది. చిన్న వ్యాపారవేత్తల ప్రయోజనాల కోసం వాణిజ్య ప్రదర్శన, వినియోగదారులకు అవగాహన, 5కె. 10కె రన్ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది.

### మళ్లీ కట్టెల వంటే గతి



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్రంలోని మహిళలు కట్టెలతో వంట చేసుకునే రోజులు మళ్లీ దాపురించబోతున్నాయని మాజీ మంత్రి, రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కె.పుష్పలీల ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె గురువారం గాంధీ భవన్‌లో విలేకరులతో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు కోట నీలిమ, కల్వ సుజాతలతో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రూ.400 ఉన్న వంట గ్యాస్ సిలిండర్ ధర ఇప్పుడు రూ.1200కు చేరడం శోచనీయమన్నారు. గ్యాస్ సిలిండర్ల ధరల పెంపే బీజేపీకి మహిళలపై ఉన్న నిబద్ధత తెలియజేస్తుందని విమర్శించారు.

### ధన్యవాదాలు సీఎం గారూ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థుల మెస్ చార్జీలను పెంచుతూ మంత్రివర్గ ఉపసంఘం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు కె.కిశోర్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న లక్షలాది మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఉద్యోగులకు ఈ నిర్ణయంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఏకంగా 25 శాతం మేర మెస్ చార్జీలు పెంచినందున మరింత నాణ్యమైన భోజనం అందుతుందన్నారు.

### ఇదండీ జగత్



ఆయన వెళితే.. వెళ్లాడుకానీ.. మిమ్మల్ని కూడా లాగుతున్నాడు.. జాగ్రత్త సార్!

# తెలంగాణ వేగం అబ్బురపరిచింది

- హైదరాబాద్ ప్రగతిని చూసి ఔరా అనుకున్నా!
- ఫాక్స్‌కాన్ అధ్యక్షుడు యంగ్ లూ వెల్లడి
- ఐటీ అంటే ఇండియా + తైవాన్ కావాలి: కేటీఆర్
- దేశంలోనే అతిపెద్ద ప్రొటోటైపింగ్ కేంద్రం టీ–వర్క్స్ ప్రారంభం



హైదరాబాద్‌లో ఫాక్స్‌కాన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ సందర్శనకు ఆహ్వానం అందినప్పుడు అలా వచ్చి.. ఇలా ఓ బటన్ నొక్కేసి తిరిగి వెళ్లిపోవచ్చనుకున్నా. కానీ విమానాశ్రయంలో విమానం దిగింది మొదలుకొని భారత్‌లోనే అతిపెద్ద ప్రొటోటైపింగ్ కేంద్రం 'టీ–వర్క్స్'ను ప్రారంభించేంత వరకూ ప్రతీ క్షణం అబ్బురంగా అనిపించింది'అని ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్ లూ చెప్పారు. ఆలోచనలను ఆచరణలో పెట్టి వస్తువులుగా మార్చేందుకు అవకాశం కల్పించే టీ–వర్క్స్‌తో ఎన్నో అద్భుతాలు సాధ్యమవుతాయన్నారు. హైదరాబాద్‌లో గురువారం టీ–వర్క్స్ ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైటెక్ రంగంలో వృద్ధి సాధించాలంటే వేగం అన్నింటికంటే ముఖ్యమని, తెలంగాణ ప్రభుత్వానికి ఆ వేగం పుష్కలంగా ఉందని కొనియాడారు. విమానాశ్రయం నుంచి వస్తున్నప్పుడు ఇక్కడి అభివృద్ధిని గమనించానని.. ఇది నిజంగా భారతదేశమేనా అనిపించిందని చెప్పారు. ఫాక్స్‌కాన్ పెట్టుబడుల కోసం రెండు ప్రాంతాలను సందర్శించానని, అక్కడి కంటే చురుకుగా ఏర్పాట్లు చేసి తెలంగాణ అంటే వేగమని నిరూపించుకున్నారన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో భేటీ సందర్భంగా ఆయన ఎనిమిదేళ్లలో చేపట్టిన కార్యక్రమాలను వీడియో రూపంలో చూపారని.. అన్ని రంగాల్లోనూ గణనీయమైన అభివృద్ధి జరుగుతున్నట్లు తెలిసిందన్నారు. కేసీఆర్ స్థాయిలో తన కంపెనీలోనూ ప్రగతిని సాధించాలంటే తనకున్న నాలుగేళ్ల పదవీకాలంలో ఆదాయాన్ని ఇప్పుడున్న 205 బిలియన్ డాలర్ల నుంచి 400 బిలియన్ డాలర్లకు పెంచాల్సి ఉంటుందన్నారు. టీ–వర్క్స్ మరింత ప్రయోజనకారిగా మారేందుకు తమవంతు సాయంగా పూర్తిస్థాయి అసెంబ్లీ లైన్ ఒకదాన్ని బహూకరించనున్నట్లు చెప్పారు.

**కేసీఆర్ పునాది.. కేటీఆర్ నిర్మాణం..**

రాష్ట్రంలో అన్ని రంగాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పునాదులు వేస్తోంటే.. మంత్రి కేటీఆర్ ఆ పునాదులపై అభివృద్ధిని నిర్మిస్తున్నారని టీ–వర్క్స్ సీఈవో సుజయ్ కరమ్‌పురి కొనియాడారు. రూ.11.5 కోట్ల విలువైన 200 అత్యాధునిక పరికరాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని, 78 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న టీ–వర్క్స్‌ను 2.5 లక్షల చదరపు అడుగులకు విస్తరించనున్నట్లు తెలిపారు. అంతకుముందు.. అద్భుతమైన లేజర్ షో తరువాత దేశంలోనే మొదటిసారిగా టీ–వర్క్స్ భవనం చుట్టూ ఏర్పాటు చేసిన పరదాలను తొలగించి (కబూకీ డ్రాప్) ఈ కేంద్రాన్ని కేటీఆర్, యంగ్ లూ ప్రారంభించారు. ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్‌తోపాటు వివిధ కంపెనీల సీఈవోలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు.

### ఆ అద్భుతాలు హైదరాబాద్‌లోనూ..: కేటీఆర్

ఐటీ రంగంలో తనదైన ముద్ర వేసిన భారత్, హార్డ్‌వేర్ రంగం దిగ్గజమైన తైవాన్ చేతులు కలిపితే ప్రపంచానికి ఉపయోగపడే ఎన్నో ఉత్పత్తులను సిద్ధం చేయొచ్చని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఐటీ అంటే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మాత్రమే కాదని, తన దృష్టిలో ఇప్పుడు ఐటీ అంటే ఇండియా + తైవాన్ అని చెప్పారు. రాష్ట్రంలో లక్ష వరకూ ఉద్యోగాలు కల్పించేలా ఎలక్ట్రానిక్ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిన ఫాక్స్‌కాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఫాక్స్‌కాన్ షెన్‌జెన్‌లో సాధించిన అద్భుతాలను హైదరాబాద్‌లోనూ చేద్దామని పిలుపునిచ్చారు. హార్డ్‌వేర్ రంగంలోనూ హైదరాబాద్‌ను ఉన్నత స్థానంలో నిలిపేందుకు ఫాక్స్‌కాన్ మార్గదర్శనం చేయాలని కోరారు. కోవిడ్ సమయంలో వెంటిలేటర్ మొదలుకొని ఎన్నో అద్భుత ఆవిష్కరణలకు టీ–వర్క్స్ కేంద్రమైందన్నారు.

# పదేళ్లలో లక్ష మందికి ఉపాధి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి, ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. సంస్థ చైర్మన్ యంగ్ ల్యూ నేతృత్వంలోని ప్రతినిధి బృందం గురువారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతో సమావేశమై ఆయన సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దేశానికి వచ్చిన అతిపెద్ద ఎలక్ట్రానిక్స్‌రంగ పెట్టుబడుల్లో ఇది ముఖ్యమైనదని సమావేశం అనంతరం సీఎం కార్యాలయం ప్రకటించింది. గురువారం యంగ్ ల్యూ పుట్టినరోజు కావడంతో స్వదస్తూరితో ప్రత్యేకంగా తయారుచేసిన గ్రీటింగ్ కార్డును సీఎం కేసీఆర్ ఆయనకు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సమావేశం అనంతరం ప్రగతిభవన్‌లో యంగ్‌లూ ప్రతినిధి బృందానికి మధ్యాహ్న భోజనంతో ఆతిథ్యమిచ్చారు. ఒప్పంద కార్యక్రమంలో మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, ప్రత్యేక సీఎస్‌లు రామకృష్ణారావు, అరవింద్ కుమార్, పరిశ్రమల శాఖ అదనపు కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ ఎలక్ట్రానిక్స్ సుజయ్ కారంపురి తదితరులు పాల్గొన్నారు.

**అన్ని రకాల సాయం అందిస్తాం: సీఎం కేసీఆర్**

అంతర్జాతీయంగా అనేక దేశాల ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిరంగ ముఖచిత్రాన్ని గుణాత్మకంగా మార్చిన గొప్ప సంస్థ 'ఫాక్స్‌కాన్'తన కార్యకలాపాలకు రాష్ట్రాన్ని గమ్యస్థానంగా ఎంపిక చేసుకోవడంపై సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సంస్థ కార్యకలాపాలకు అన్ని రకాల సహాయ, సహకారాలను అందిస్తామని హామీనిచ్చారు. ఫాక్స్‌కాన్‌తో లక్షకుపైగా ఉద్యోగాల కల్పనకు అవకాశం రావడం గొప్ప విషయన్నారు. సాధ్యమైనంత వరకు స్థానిక యువతకు ఉద్యోగాలు లభించేలా చర్యలు చేపడతామని ప్రకటించారు. ఈ సమావేశ సమయంలోనే టీఎస్ఐఐసీ అధికారులు కొంగరకలాన్, దుండిగల్ ప్రాంతాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

**తైవాన్ మా సహజ భాగస్వామి..**

'రాష్ట్రాన్ని గొప్పగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణను అమలుచేస్తోంది. బంగారు తెలంగాణ సాధనకు అనేక గొప్ప ప్రాజెక్టులను చేపట్టింది. ఫాక్స్‌కాన్ రాక రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి దోహదపడుతుంది. తైవాన్‌ను తెలంగాణ సహజ భాగస్వామిగా భావిస్తున్నాం. ఫాక్స్‌కాన్ పురోగమనంలో రాష్ట్రం భాగమైనందుకు సంతోషంగా ఉంది'అని సీఎం కేసీఆర్ అన్నారు.

**పదేళ్లలో లక్ష ఉద్యోగావకాశాలు: కేటీఆర్**

ఫాక్స్‌కాన్ పరిశ్రమ స్థాపనతో వచ్చే పదేళ్లలో లక్ష మందికిపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు హర్షం వ్యక్తం చేశారు.

**ప్రముఖ బ్రాండ్ల ఉత్పత్తుల తయారీ..**

ప్రపంచవ్యాప్తంగా విక్రయించే 40 శాతం ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను ఫాక్స్‌కాన్ తయారుచేస్తోంది. యాపిల్, మైక్రోసాఫ్ట్, నోకియా, సోనీ వంటి ప్రముఖ బ్రాండ్ల ఉత్పత్తులను రూపొందిస్తోంది. ఫాక్స్‌కాన్ పరిశ్రమల్లో యాపిల్ సంస్థకు చెందిన ఐఫోన్, ఐపాడ్, ఐప్యాడ్, అమెజాన్‌కు చెందిన కిండిల్, బ్లాక్‌బెర్రీ లిమిటెడ్‌కు చెందిన స్మార్ట్‌ఫోన్లు, ఇతర పరికరాలు, గేమింగ్ సిస్టమ్స్, నోకియా, సోనీ పరికరాలు (ప్లే స్టేషన్ 3, ప్లే స్టేషన్ 4 గేమింగ్ కన్సోల్స్) గూగుల్ పిక్సల్, షావోమీ పరికరాలు, సీపీయూ సాకెట్ల తయారీ జరుగుతోంది. ఈ సంస్థ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తమిళనాడులలో కార్యకలాపాలు సాగిస్తోంది.

### విస్తృత అధ్యయనం చేశాకే వచ్చాం: ఫాక్స్‌కాన్ చైర్మన్

తెలంగాణ గురించి తమ సంస్థ విస్తృతంగా అధ్యయనం చేసిందని ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్ లూ తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉందని ప్రశంసించారు. రాష్ట్రంలో పెట్టుబడుల విషయంలో ఆశావహ దృక్పథంతో ఉన్నామన్నారు.

### సెమీకండక్టర్ చిప్‌ల తయారీ కోసం..

సాక్షి, రంగారెడ్డి జిల్లా: యాపిల్ కంపెనీ ఫాక్స్‌కాన్‌కి అతిపెద్ద కస్టమర్. ఐఫోన్లు, ఐపాడ్‌లు, మాక్‌బుక్స్ ద్వారానే ఫాక్స్‌కాన్ 50% ఆదాయం ఆర్జిస్తోంది. కరోనా తర్వాత దేశంలోనే ఎలక్ట్రానిక్ చిప్‌ల తయారీకి కేంద్రం ముందుకు రావడంతో మైనింగ్ దిగ్గజం వేదాంతతో కలిసి 20 బిలియన్ డాలర్లతో దేశంలో మొదటి సెమీ కండక్టర్ చిప్ తయారీ ఫ్యాక్టరీని నిర్మించేందుకు ఫాక్స్‌కాన్ సన్నాహాలు చేస్తోంది.

# ..రాజ్యాంగ విరుద్ధం

▶ మొదటి పేజీ తరువాయి

సమాంతర పరిపాలనకు ప్రయత్నించవచ్చని రాజ్యాంగ కర్తలు ఊహించలేదని కూడా సుప్రీంకోర్టు పేర్కొంది. పాత ఆర్టికల్ 175పై కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి టి.టి.కృష్ణమాచారి చర్చిస్తూ.. ఆర్టికల్ 200 గవర్నర్‌కు ఎలాంటి స్వతంత్ర విచక్షణాధికారాన్ని అందించలేదని స్పష్టం చేశారు. ఏదైనా అధికారం, విధిని అమలు చేయడం కోసం రాష్ట్రపతి, గవర్నర్ సంతృప్తి చెందాలని రాజ్యాంగం కోరుతుందని షంషేర్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు పేర్కొంది. కానీ ఆర్టికల్ 123, 213, 311(2), 317, 352(1), 356, 360ల ప్రకారం రాజ్యాంగం పేర్కొన్న ఈ సంతృప్తి.. రాష్ట్రపతి లేదా గవర్నర్‌ల వ్యక్తిగత సంతృప్తి కాదు. అది ప్రభుత్వంలోని మంత్రి మండలి వ్యవస్థ సంతృప్తి అనేది రాజ్యాంగం ఉద్దేశమని కూడా స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని పలు నిబంధనల ప్రకారం.. గవర్నర్ కొన్ని విధులు నిర్వర్తించడానికి అధికారమున్నా, ఆర్టికల్ 163 ప్రకారం మంత్రి మండలి సలహాలనే పాటించాల్సి ఉంటుంది..'' అని తెలంగాణ ప్రభుత్వం పిటిషన్‌లో స్పష్టం చేసింది.

**కారణమేదీ చెప్పకుండా ఆపడమేంటి?**

12–9–2022 నుంచి 13–2–2023 వరకూ పంపిన బిల్లులపై గవర్నర్ ఆమోదం, తిరస్కరణ ఏదీ చెప్పలేదని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వివరించింది. సహేతుక కారణాలు చూపకుండా బిల్లులను పెండింగ్ పెట్టడం సరికాదంది. ఆయా బిల్లులపై ఎప్పటికప్పుడు మంత్రులు నేరుగా గవర్నర్ వద్దకు వెళ్లి తగిన వివరణలు ఇచ్చారని.. ఆ సమయంలో త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని గవర్నర్ హామీ ఇచ్చారని గుర్తు చేసింది. 13–9–2022న పంపిన ఏడు బిల్లులను.. ఈ ఏడాది ఫిబ్రవరి 10, 11, 12 తేదీల్లో పంపిన ఒక్కో బిల్లు కలిపి.. మొత్తం పది బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపింది.

# సుప్రీంకు వెళ్లడం సిగ్గుచేటు

### రాష్ట్ర ప్రభుత్వంపై బండి సంజయ్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: మహిళా గవర్నర్‌ను అవమానించడమే పనిగా పెట్టుకున్న సీఎం కేసీఆర్, వివిధ బిల్లులను గవర్నర్ ఆమోదించడం లేదంటూ సుప్రీంకోర్టుకు వెళ్లడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మండిపడ్డారు. వంద ఎలుకలను తిన్న పిల్లి తీర్థయాత్రలకు పోయినట్లుగా రాష్ట్ర ప్రభుత్వ తీరు ఉందని గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవాచేశారు. యాభై వేల జీవోలను వెబ్‌సైట్‌లో పెట్టకుండా సమాచార హక్కు చట్టం స్ఫూర్తినే దెబ్బతీస్తున్న కేసీఆర్‌పై ఎన్ని కేసులు పెట్టాలని మండిపడ్డారు. కేసీఆర్ ఎనిమిదేళ్ల పాలనలో తీసుకున్న నిర్ణయాలను తప్పు పడుతూ హైకోర్టు ఎన్నిసార్లు మొట్టికాయలు వేసిందో గుర్తు చేసుకోవాలన్నారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో గవర్నర్‌తో సమన్వయంతో వ్యవహరిస్తున్నట్లు నటించిన కేసీఆర్ ఇప్పుడు సుప్రీంకోర్టు మెట్లెక్కి గవర్నర్ వ్యవస్థను అప్రదిష్టపాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. 'క్రిమినల్ కేసులున్న వ్యక్తిని ఎమ్మెల్సీగా సిఫారసు చేస్తే ఆ ప్రతిపాదన తిరస్కరించడమే గవర్నర్ చేసిన నేరమా? సీఎం ప్రజలను కలవకుండా ఫాంహౌజ్, ప్రగతిభవన్‌కే పరిమితమైతే గవర్నర్‌గా ప్రజలను కలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే ఆమె చేసిన తప్పా?' అని సంజయ్ ప్రశ్నించారు. గతంలో నరసింహన్ గవర్నర్‌గా ఉన్నప్పుడు వంగి వంగి పాదాభివందనాలు చేసిన కేసీఆర్.. తమిళిసై సౌందరరాజన్ గవర్నర్‌గా వచ్చాక జీర్ణించుకోలేకపోతున్నారన్నారు.

# పంతాలతో పాలనలో ఇబ్బందులు

- రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ మధ్య ముదురుతున్న విభేదాలు
- నెలలు గడిచినా బిల్లులను ఆమోదించని గవర్నర్ తమిళిసై
- ఎక్కడా వెనక్కి తగ్గని ప్రభుత్వం.. కీలక నిర్ణయాల అమల్లో జాప్యం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ మధ్య విభేదాలతో రాష్ట్రంలో పాలనా వ్యవహారాలు స్తంభించిపోతున్నాయి. వారి పంతాలు, పట్టింపులతో కీలక నిర్ణయాల అమల్లో జాప్యం జరుగుతోందన్న విమర్శలు వస్తున్నాయి. దీనితో అటు ప్రజలకూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంటున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 13న రాష్ట్ర శాసన సభ, శాసన మండలిలో ఆమోదించిన మొత్తం 8 బిల్లులను ప్రభుత్వం మరుసటి రోజే గవర్నర్ ఆమోదముద్ర కోసం రాజ్‌భవన్‌కు పంపించింది. అందులో ఒక్క జీఎస్టీ చట్ట సవరణ బిల్లుకు మాత్రమే గవర్నర్ ఆమోదం తెలిపారు. మిగతా ఏడు బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ములుగు అటవీ కళాశాల పేరును తెలంగాణ అటవీ యూనివర్సిటీగా మార్పు ప్రతిపాదన బిల్లు.. రాష్ట్ర వర్సిటీల్లో బోధన, బోధనేతర పోస్టుల భర్తీకి ఉమ్మడి నియామక బోర్డు ఏర్పాటు బిల్లు.. ప్రైవేటు వర్సిటీల చట్టం బిల్లు.. పురపాలికల చట్ట సవరణ బిల్లు.. అజామాబాద్ పారిశ్రామిక ప్రాంత చట్ట సవరణ బిల్లు.. పబ్లిక్ ఎంప్లాయిమెంట్ చట్ట సవరణ బిల్లు.. మోటార్ వెహికల్స్ ట్యాక్సేషన్ చట్ట సవరణ బిల్లులకు ఆమోదం లభించలేదు. గవర్నర్ తమిళిసై పిలుపు మేరకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నవంబర్ 8న రాజ్‌భవన్‌కు వెళ్లారు. యూనివర్సిటీల కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లుపై గవర్నర్‌కు ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు. అయినా ఆమోదించలేదు. దీనితో వర్సిటీల్లో కొలువుల భర్తీ జరగక విద్యార్థులు నష్టపోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

**మరిన్ని బిల్లులు, నిర్ణయాలు కూడా..**

ఫిబ్రవరి 12న రాష్ట్ర శాసనసభ, శాసనమండలిలు ఆమోదించిన ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ చట్ట సవరణ బిల్లు, తెలంగాణ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు, తెలంగాణ మున్సిపాలిటీల చట్ట సవరణ బిల్లులు కూడా రాజ్‌భవన్‌లోనే పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు గవర్నర్ నుంచి సహకారం లేకపోవడంతో ప్రభుత్వం అత్యవసర ఆదేశాల(ఆర్డినెన్స్) జారీని పూర్తిగా మానుకుంది. గత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 75 మంది జీవిత ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదిస్తూ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని గవర్నర్ ఆమోదం కోసం పంపగా.. దానికి మోక్షం లభించలేదు.

# 'ఆకాశం' నుంచి ఊడిపడ్డాయ్

స్మార్ట్‌ఫోన్‌లోని డిజిటల్ కెమెరా.. మెమరీ ఫోమ్ పరుపులు.. కారు టైర్లు.. గీతలు పడని లెన్స్.. వాటర్ ఫిల్టర్.. ఇవన్నీ 'ఆకాశం' నుంచి ఊడిపడ్డాయ్ తెలుసా? ఎందుకంటే ఇవన్నీ అంతరిక్ష ప్రయోగాల కోసం శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనల్లోంచి పుట్టినవి. మనం నిత్యం వాడే వస్తువులుగా మారిపోయాయి. మరి వీటి విశేషాలు ఏమిటో చూద్దామా..

మీకు తెలుసా?



### అంతరిక్షంలోకి పంపకున్నా.. ఇళ్లలోకి వాటర్ ఫిల్టర్..

➤ నాసా చంద్రుడిపైకి మనుషులను పంపేందుకు సిద్ధమవుతున్న సమయంలోనే.. వాళ్లకు మంచి నీళ్ల ఎలాగనే పరిశోధనలూ చేసింది. వాడిన నీటిని తిరిగి శుద్ధిచేసుకుని వినియోగించుకునేలా 'ఎలక్ట్రోలైటిక్ సిల్వర్ అయాన్ జనరేటర్'ను అభివృద్ధి చేసింది. ఈ వాటర్ ఫిల్టర్‌ను అంతరిక్ష ప్రయోగాల్లో వాడలేదు. కానీ ప్రపంచవ్యాప్తంగా ఇళ్లలోకి వచ్చేసింది. అయితే దీనికన్నా మెరుగైన, ఖరీదైన టెక్నాలజీని 'అపోలో' ప్రయోగాల్లో వాడారు.

### గ్రహాంతర ప్రయోగాలు.. ఫోన్ కెమెరా..

➤ శాటిలైట్లలో బిగించేందుకు.. నాసాకు చెందిన జెట్ ప్రొపల్షన్ లేబొరేటరీ (జేపీఎల్) ఇంజనీర్ యూజీన్ లల్లీ మొదటిసారిగా 1960 దశకంలో డిజిటల్ కెమెరాలను రూపొందించారు. అవి పెద్ద పరిమాణంలో ఉండి, ఎక్కువ విద్యుత్ అవసరం పడేవి. దీంతో తక్కువ సైజులో ఉండే డిజిటల్ కెమెరాలపై పరిశోధన చేసిన జేపీఎల్ ఇంజనీర్ ఎరిక్ ఫోసమ్.. 1990 దశకం మొదట్లో 'సీఎంఓఎస్– యాక్టివ్ పిక్సెల్ సెన్సర్ (ఏపీఎస్)'ను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఫోన్ కెమెరాలు, వెబ్‌క్యామ్‌లు వంటి మినియేచర్ కెమెరాల్లో వాడుతున్న టెక్నాలజీ ఇదే.




### స్పేస్ షటిల్‌లో సీట్లు.. మెమరీ ఫోమ్ పరుపులు



➤ స్పేస్ షటిల్స్ అంతరిక్షంలోకి వెళ్లినప్పుడు, తిరిగి వచ్చేప్పుడు అత్యంత వేగంగా ప్రయాణిస్తాయి. వాటిలో ఉండే వ్యోమగాములపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. అలా ఒత్తిడిని తట్టుకోవడంతోపాటు మృదువుగా, సౌకర్యవంతంగా ఉండేందుకు నాసా 1960వ దశకంలో 'పాలీయూరేథీన్ సిలికాన్ ప్లాస్టిక్ (మెమరీ ఫోమ్)' మెటీరియల్‌ను అభివృద్ధి చేసింది. స్పేస్ షటిల్ సీట్లలో అమర్చింది. అవే ఇప్పుడు మనం వాడుతున్న మెమరీ ఫోమ్ పరుపులు, దిండ్లు.

### అనుకోకుండా కనిపెట్టిన.. స్క్రాచ్ రెసిస్టెంట్ లెన్స్..

➤ వ్యోమగాములు హెల్మెట్ కోసం గాజును వాడితే ప్రమాదకరం కావడంతో నాసా ఫైబర్ గ్లాస్‌ను వినియోగించింది. కానీ దానిపై సులువుగా గీతలు పడి ఇబ్బంది వస్తుండటంతో పరిష్కారంపై ప్రయోగాలు మొదలుపెట్టింది. అయితే చిత్రంగా టెడ్ వైడెవెన్ అనే శాస్త్రవేత్త వాటర్ ఫిల్టర్ కోసం చేస్తున్న ప్రయోగాల సందర్భంగా.. స్క్రాచ్ రెసిస్టెంట్ కోటింగ్‌ను అభివృద్ధి చేశారు. ఇప్పుడు కళ్లద్దాల నుంచి టీవీలు, మానిటర్లు, ఫోన్ స్క్రీన్ల దాకా ఈ కోటింగ్‌ను వాడుతున్నారు.



### మార్స్‌పై దిగే ప్యారాచూట్ తాళ్లు.. కారు టైర్లు..

➤ 1976లో నాసా ప్రయోగించిన 'వైకింగ్ ల్యాండర్' అంగారకుడిపై సురక్షితంగా దిగేందుకు ప్యారాచూట్‌లను వినియోగించారు. అసలే మార్స్‌పై తేలికైన వాతావరణం, ఎక్కువ బరువున్న ప్రోబ్.. ప్యారాచూట్ తాళ్లు అత్యంత బలంగా ఉండాలి. దీనిపై నాసా విజ్ఞప్తి మేరకు.. 'గుడ్ ఇయర్ టైర్ అండ్ రబ్బర్ కంపెనీ' ఉక్కుకన్నా బలమైన రబ్బర్ మెటీరియల్‌ను రూపొందించింది. తర్వాత దీనిని వాహనాల టైర్ల తయారీలో వాడటం మొదలుపెట్టారు.



### ఇంకా ఎన్నో..

➤ స్పేస్ ఫ్లైట్లలో, విమానాల్లో వాడేందుకు నాసాతోపాటు యునైటెడ్ ఎయిర్ లైన్స్ శాస్త్రవేత్తలు కలిసి వైర్ లెస్ హెడ్‌సెట్‌ను అభివృద్ధి చేశారు.

➤ నాసా స్పేస్‌లో ఆల్గే (నాచు)ను ఉపయోగించి ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే ప్రయోగాలు చేస్తుండగా.. పిల్లలకు పాలకు బదులుగా ఇచ్చే 'బేబీ ఫార్ములా' టెక్నాలజీని అభివృద్ధి చేశారు.

➤ స్టాన్‌ఫర్డ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ శాస్త్రవేత్త డోగ్ ఎంగెల్‌బర్ట్.. నాసా చేసిన ఆర్థిక సాయం, సూచనలతోనే కంప్యూటర్ 'మౌస్'ను తయారు చేశారు.

– సాక్షి సెంట్రల్ డెస్క్



గ్యాస్ సిలిండర్ ధర పెంపును నిరసిస్తూ సూర్యాపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ మహిళా విభాగం శ్రేణులు

# రోడ్లపై బీఆర్ఎస్ వంటావార్పు

- గ్యాస్ సిలిండర్ ధరల పెంపుపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు
- అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇతర నేతల నిరసన కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: వంట గ్యాస్ సిలిండర్ ధరను రూ.50 పెంచుతూ కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రంలో అధికార బీఆర్ఎస్ భారీఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించింది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు మంత్రులు, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్‌పర్సన్లు, మేయర్లతోపాటు అన్ని స్థాయిల నాయకులు జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు జరిపారు. రోడ్లపై కట్టెల పొయ్యితో వంటావార్పు, సిలిండర్లకు మోదీ ఫొటోలు అతికించి ఊరేగించడం, హైవేలపై ధర్నాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు, మంత్రి మల్లారెడ్డితో కలిసి ఘట్‌కేసర్‌లో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు. దేశ ప్రజలను పీడించే పార్టీగా బీజేపీని అభివర్ణించారు. కరీంనగర్‌లో తెలంగాణ చౌక్ వద్ద పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో రోడ్లపై కట్టెల పొయ్యిలపై వంటావార్పు నిర్వహించి భోజనాలు చేశారు. సికింద్రాబాద్‌లోని ఎంజీ రోడ్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నేతృత్వంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. మహబూబ్‌నగర్‌లో తెలంగాణ చౌరస్తా వద్ద నిర్వహించిన ఆందోళనలో మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ నల్లదుస్తులు ధరించి పాల్గొన్నారు. హైదరాబాద్ మీర్‌పేటలో జరిగిన నిరసన ప్రదర్శనలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. నిజామాబాద్‌లో పాత కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన ధర్నాలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, మేయర్ నీతూ కిరణ్, జడ్పీ చైర్మన్ విఠల్ రావు తదితరులు పాల్గొన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. సంగారెడ్డిలో టీఎస్ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ తదితరులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



కరీంనగర్‌లో జరిగిన ఆందోళనలో సిలిండర్ పైకి ఎత్తిన మంత్రి గంగుల కమలాకర్



భారత్‌లో అతి తక్కువ ఖర్చుతో రిటైర్‌మెంట్ జీవితం

అమెరికా ఉద్యోగులపై 'ఏగాన్' సంస్థ సర్వేలో వెల్లడి


అమెరికన్ల శేష జీవితాన్ని గడిపేందుకు వివిధ దేశాల్లో వ్యయంపై అధ్యయనం

సింగపూర్‌లో రిటైర్‌మెంట్ జీవితం అత్యంత ఖరీదు.. రూ.9.21 కోట్లు కావాల్సిందే

# కోటిన్నరతో.. కృష్ణా రామా!

సాక్షి, అమరావతి: రూ.కోటిన్నర ఉంటే చాలు.. మన దేశంలో రిటైర్‌మెంట్ అనంతరం కృష్ణా రామా అని ప్రశాంతంగా జీవనం గడిపేయొచ్చట. అయితే.. ఈ లెక్క భారతీయులకు సంబంధించి కాదండోయ్. అమెరికన్ల కోసం మాత్రమే! ఎందుకంటే.. అమెరికా ఉద్యోగులు, రిటైరైన వారిలో 13 శాతం మంది పదవీ విరమణ అనంతర జీవితాన్ని విదేశాల్లో గడిపే యోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో 'ఏగాన్' అనే సంస్థ ఓ సర్వే నిర్వహించింది. అమెరికన్లు రిటైర్‌మెంట్ అనంతరం వివిధ దేశాల్లో సాఫీగా జీవితం గడిపేందుకు ఎంత ఖర్చవుతుందనే గణాంకాలను ఆ సంస్థ విడుదల చేసింది.

- రిటైర్‌మెంట్ అనంతరం జీవించేందుకు ప్రపంచంలో అత్యధికంగా సింగపూర్‌లో ఎక్కువ వ్యయం (దాదాపు రూ.9.21 కోట్లు) కానుంది. అమెరికాతో పోలిస్తే సింగపూర్‌లోనే 60% అధికంగా రిటైర్డు జీవితానికి ఖర్చవుతుంది. ఆ తరువాత స్థానంలో ఉన్న స్విట్జర్లాండ్‌లో కూడా అమెరికాతో పోలిస్తే శేష జీవిత ఖర్చులు ఎక్కువే.
- రిటైరైన అమెరికా ఉద్యోగులు తరువాత జీవితాన్ని సాఫీగా గడపాలంటే పాకిస్తాన్‌లో రూ.1.30 కోట్లు, భారత్‌లో రూ.1.53 కోట్లకుపైగా వ్యయం అవుతుంది.
- ఓ అమెరికా ఉద్యోగి రిటైరైన తరువాత స్వదేశంలో (అమెరికా) శేష జీవితం గడపాలంటే దాదాపు రూ.5.79 కోట్లు కావాలి.




## క్లుప్తంగా...

### సీబీఐ, ఈడీ కేసుల్లో బీఆర్‌ఎస్ నేతల అరెస్ట్‌కు అవకాశం

మీడియాతో మంత్రి ఎర్రబెల్లి



సాక్షి, హైదరాబాద్: సీబీఐ, ఈడీ, ఐటీ కేసుల్లో బీఆర్‌ఎస్ నేతలను అరెస్టు చేసే అవకాశముందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కేంద్రం తెలంగాణ ప్రజలకు చేస్తున్న అన్యాయంపై జాతీయస్థాయిలో ఉద్యమిస్తామని పేర్కొన్నారు. గురువారం పంచాయతీరాజ్ శాఖ సమీక్ష సందర్భంగా మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. మహిళా దినోత్సవం కానుకగా కేంద్రం సిలిండర్ ధరలు పెంచిందని ఎద్దేవా చేశారు. యాసంగిలో రైతులు పండించిన బాయిల్డ్ రైస్‌ను కేంద్రం కొనుగోలు చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ ఒక పెద్ద బ్లాక్ మెయిలర్ అని ధ్వజమెత్తారు. 'రేవంత్ అన్నట్టు నేను పెద్దగా చదువుకోకపోవచ్చు. కానీ, నేను, మా నాన్న ప్రజల మనసులను చదువుకున్నాం' అని పేర్కొన్నారు. రేవంత్ కాంట్రాక్టర్ల దగ్గర ఎంత డబ్బు డిమాండ్ చేశారో తెలుసు' అని అన్నారు. బీజేపీ అధ్యక్షుడు సంజయ్ ఎప్పుడేం మాట్లాడతారో అర్థంకాదన్నారు.

### అరెస్ట్ భయంతోనే మోదీపై కవిత ఆరోపణలు

బీజేపీ నేత డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: మద్యం కుంభకోణంలో అరెస్ట్ చేస్తారనే భయంతోనే ప్రధాని నరేంద్ర మోదీపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పనికిమాలిన ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ప్రధానిపై ఆరోపణలు చేసినందుకే తనను అరెస్ట్ చేశారని చెప్పుకోవడానికి ఆమె ప్రయత్నిస్తున్నారని, అందులో భాగంగానే ధర్నాలు, ఆరోపణలు అని పేర్కొన్నారు. కవితకు అకస్మాత్తుగా మహిళలపై ప్రేమ ఎందుకు పుట్టుకు వచ్చిందో రాష్ట్ర ప్రజలకు తెలుసని ఎద్దేవా చేశారు. గ్యాస్ సిలిండర్ ధర పెరిగిందని ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు, ముందుగా కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రగతిభవన్ వద్ద ధర్నా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పన్నులపై బీఆర్‌ఎస్ సమాధానం చెప్పాలని, పెంచిన విద్యుత్, ఆర్టీసీ, లాండ్ రిజిస్ట్రేషన్, చార్జీలను తగ్గించాలని, లేదంటే రానున్న రోజుల్లో ప్రజలు ఈ ప్రభుత్వాన్ని బొంద పెట్టడం ఖాయమని అరుణ హెచ్చరించారు.

### చంద్రబాబుతో టీటీడీపీ నేతల భేటీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో విస్తరించేందుకు టీటీడీపీ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్ రావు తదితరులు గురువారం చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రారంభించిన ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం గురించి జ్ఞానేశ్వర్ ఆయనకు వివరించారు.

### స్త్రీలు శక్తిస్వరూపులు: సబిత

సాక్షి, హైదరాబాద్: స్త్రీలు శక్తి స్వరూపులని, తలపెట్టిన అన్ని కార్యక్రమాలను వారు దిగ్విజయంగా పూర్తి చేయగలరని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ ఉమెన్స్ డే ప్రత్యేక కార్యక్రమంలో ప్రతి మహిళ, విద్యార్థిని పాల్గొనేలా తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. గురువారం 'గ్రీన్ ఇండియా చాలెంజ్ ఉమెన్స్ డే' పోస్టర్ ఆవిష్కరణలో సబిత, సీఎస్ శాంతికుమారి, సీఎం కార్యదర్శి స్మితా సభర్వాల్, సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్‌లతో కలిసి గ్రీన్ ఇండియా చాలెంజ్ నిర్వాహకులు, ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్ పాల్గొన్నారు. మార్చి 8న 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' పురస్కరించుకొని గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సంతోష్ కోరారు. పిల్లల్ని పెంచిన చేతులు మొక్కల్ని పెంచితే.. ప్రకృతి పరవశించిపోతుందన్నారు. సృష్టికి మూలం స్త్రీ అని, మహిళలంతా ప్రకృతి పరిరక్షణ కోసం ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటాలని సీఎస్ ఆకాంక్షించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూనే పుడమి బాగుకోసం అలుపెరగక కృషి చేస్తున్నారన్నారని స్మితా సభర్వాల్ అన్నారు. ప్రతి మహిళ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మొక్కను నాటి గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను విజయవంతం చేయాలని కోరారు.

# మరోసారి రాష్ట్రానికి అమిత్ షా

- 11న రాత్రి హైదరాబాద్‌కు.. కోర్ కమిటీతో భేటీ!
- 12న హకీంపేటలో అధికారిక కార్యక్రమం
- ఆ తర్వాత సంగారెడ్డిలో మేధావులతో సమావేశం..
- ఆపై బీదర్‌కు పయనం... కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు ముగిసేదాకా పలు ప్రాంతాల్లో పర్యటన
- అక్కడి నుంచే తెలంగాణలో పార్టీ వ్యవహారాలపై దృష్టి
- ఈ నెలలోనే రాష్ట్రానికి రానున్న జేపీ నడ్డా, పలువురు కేంద్ర మంత్రులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ సిద్ధమవుతున్న తీరును పరిశీలించేందుకు బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మరోసారి రాష్ట్రానికి వస్తున్నారు. ఇప్పటికే గత నెల 10న నేషనల్ పోలీస్ అకాడమీ పాసింగ్ అవుట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలతో ప్రత్యేకంగా భేటీ అయిన షా.. ఈ నెల 11న రాత్రి మళ్లీ రాష్ట్రానికి రానున్నారు. అదేరోజు మరోసారి హైదరాబాద్‌లో కోర్‌కమిటీతో ఆయన భేటీ కానున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. 12న ఉదయం హకీంపేటలో జరిగే అధికారిక కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన హైదరాబాద్ వస్తున్నారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలో మేధావులతోనూ ప్రత్యేకంగా సమావేశమై రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్న వివిధ అంశాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకోనున్నారు. త్వరలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడ మళ్లీ అధికారాన్ని నిలబెట్టుకునేందుకు అమిత్ షా దృష్టిసారిస్తున్నారు. 12న రాష్ట్రంలో సమావేశాలు ముగించుకున్నాక కర్ణాటకలోని బీదర్‌కు పయనమవుతారు. ఆ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు ముగిసే దాకా నెలకు రెండు, మూడుసార్లు కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో అమిత్ షా పర్యటించనున్నారు. ఈ పర్యటనలకు వచ్చినప్పుడల్లా తెలంగాణపైనా దృష్టిపెట్టి పార్టీని ఎన్నికలకు సిద్ధం చేయనున్నారు. ఈ నెలలోనే బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు, ముఖ్య నేతలు రాష్ట్రానికి రానున్నట్లు సమాచారం. వచ్చే నెలలో పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే భారీ బహిరంగసభలో ప్రధాని మోదీ పాల్గొంటారని తెలుస్తోంది.

**ముఖ్యనేతల మధ్య సమన్వయమే ప్రధానం**

మార్చి, ఏప్రిల్‌లలో రాష్ట్ర పార్టీ నాయకులు, జాతీయ పార్టీ ముఖ్యనేతలు ముమ్మరంగా ప్రజల్లోకి వెళ్లేలా కార్యాచరణ సిద్ధమైంది. అయితే రాష్ట్ర పార్టీ ముఖ్యనేతల మధ్య చోటుచేసుకుంటున్న సమన్వయలోపంపై జాతీయ నాయకత్వం దృష్టిపెట్టింది. మంగళవారం ఢిల్లీలో రాష్ట్ర పార్టీ మినీ కోర్‌కమిటీ భేటీలోనూ దీనిపైనే అమిత్ షా, నడ్డా ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు సానుకూల పరిస్థితులున్నా, ప్రజల్లో కేసీఆర్ సర్కార్‌పై వ్యతిరేకత ఉన్నా రాష్ట్ర నేతలు దాన్ని పూర్తిగా ఉపయోగించుకోలేకపోతున్నారనే అభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిసింది. రాష్ట్ర కోర్‌కమిటీ నేతలు కనీసం వారం, పది రోజులకోసారి కలుసుకొని పార్టీ కార్యక్రమాలపై చర్చించాలని, సమష్టిగా ముందుకెళ్లాలని ఆదేశించినట్లు సమాచారం. నేతల మధ్య సమన్వయ బాధ్యతలను రాష్ట్ర పార్టీ సంస్థాగత ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్‌కు అప్పగించినట్లు తెలిసింది.

**చేరికలు ఆగడంపై జాతీయ నాయకత్వం ఆరా**

ఇతర పార్టీల నుంచి చేరికల ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇది ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడానికి కారణాలేమిటని బీజేపీ జాతీయ నాయకత్వం ఆరాతీసినట్లు తెలిసింది. దీనికి సంబంధించి కూడా ముఖ్యనేతల నుంచి జిల్లాల వారీగా జాబితాలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

### బీఆర్‌ఎస్‌లోకి మహారాష్ట్ర నేతలు

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలోని వివిధ పార్టీల నేతలు గురువారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ప్రగతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జాతీయ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి దేశవ్యాప్తంగా విస్తరించాలని ఆకాంక్షించారు. బీఆర్‌ఎస్‌లో మహారాష్ట్ర మాజీ ఎమ్మెల్యే వసంత్ రావ్ బోండె తదితర నేతలు చేరారు. కార్యక్రమంలో నాందేడ్ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

### అత్యాచారాలపై నేడు బీజేపీ ఆందోళనలు

కొవ్వొత్తులతో నిరసన ర్యాలీలు: బండి సంజయ్ పిలుపు



సాక్షి, హైదరాబాద్: మెడికల్ విద్యార్థి ప్రీతి హత్య సహా రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న అత్యాచారాలకు నిరసనగా బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించింది. జిల్లా కేంద్రాల్లో సాయంత్రం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ నుంచి ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. గురువారం రాత్రి పార్టీ జిల్లా అధ్యక్షులు, ఇన్‌చార్జులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. లిక్కర్ దందాలో అడ్డంగా బుక్కైన తన బిడ్డను కాపాడుకునేందుకు తంటాలు పడుతున్న కేసీఆర్.. రాష్ట్రంలోని అమాయక విద్యార్థినులు, మహిళలపై జరిగే అత్యాచారాలపై ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు.

### రాష్ట్రపతి పాలనకు ఉమ్మడి పోరాటం

కలిసి రావాలని రాష్ట్రంలోని ప్రతిపక్షాలకు షర్మిల ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: అధికారపక్ష దాష్టీకాలకు ముగింపు చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల అభిప్రాయపడ్డారు. ఇందుకు విపక్షాలు ఒక్కటై ముందుకు అడుగు వేయాల్సిన పరిస్థితి వచ్చిందని స్పష్టం చేశారు. గురువారం ఈ మేరకు బండి సంజయ్, రేవంత్ రెడ్డి, కోదండరాం, కాసాని జ్ఞానేశ్వర్, ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, అసదుద్దీన్ ఓవైసీ, తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు, ఎస్ శంకర్ గౌడ్, మందక్రిష్ణ మాదిగలకు ఆమె లేఖలు రాశారు. ఈ ప్రత్యేక ఆహ్వానాన్ని విపక్ష నేతలకు వినమ్రంగా విన్నవించుకుంటున్నానని షర్మిల పేర్కొన్నారు. తెలంగాణ సమాజం ఈ రోజున దారుణ పరిస్థితుల్ని ఎదుర్కొంటోందనీ, నోరు విప్పితే పాలకులు కేసులు పెట్టి అరెస్టులు చేస్తూ దారుణ హింసకు దిగుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఈ రోజున నోరు తెరవటానికి వీల్లేని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో జెండాలను పక్కన పెట్టి, ఒక్కటై పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆమె స్పష్టం చేశారు రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను విధించాల్సిన అవసరం ఉందనీ. ఈ పరిస్థితుల్లో మనమంతా ఏకమై, ఒక గళంగా మారాలని పిలుపునిచ్చారు.

# కేసీఆర్‌కు బైబై చెప్పండి

- కాంగ్రెస్‌కు స్వాగతం పలకండి
- హాథ్ సే హాథ్ జోడో యాత్రలో రేవంత్

సాక్షి, సిద్దిపేట/హుస్నాబాద్: బాన్సువాడ పర్యటనలో 'నేను ముసలోణ్ణి అయ్యా. వయస్సు మీద పడింది..' అని చెప్పిన సీఎం కేసీఆర్ వెంటనే రాజకీయాల నుంచి విరమించుకుని ఫాంహౌస్‌లో ప్రశాంతంగా శేష జీవితం గడపాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రజలు కూడా కేసీఆర్‌కు బైబై చెప్పి కాంగ్రెస్‌కు స్వాగతం పలకాలని అన్నారు. రేవంత్ హాథ్ సే హాథ్ జోడో యాత్ర గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో కొనసాగింది. తొలుత గండిపెల్లి రిజర్వాయర్‌ను సందర్శించారు. అనంతరం గౌరవెల్లి రిజర్వాయర్‌లో పరిహారం దక్కని ఆడబిడ్డలతో సమావేశం అయ్యారు. అనంతరం పాదయాత్రగా హుస్నాబాద్ చేరుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు సర్వారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్నర్ సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నేరవేర్చలేదని విమర్శించారు. ప్రజలకు పూర్వ వైభవం రావాలంటే, పేదల బతుకులు మారాలంటే కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని అన్నారు. పార్టీ నేతలు జీవన్‌రెడ్డి, జానారెడ్డి, బలరాం నాయక్, సుదర్శన్‌రెడ్డి, రాజయ్య, ప్రవీణ్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



హుస్నాబాద్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రేవంత్. చిత్రంలో బలరాం, పొన్నం, జీవన్‌రెడ్డి

### మీకు కష్టం వస్తేనే మహిళలు కనిపిస్తారా..?


కల్వకుంట్ల కవితపై ఇందిరాశోభన్ ఫైర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పడి తొమ్మిదేళ్లు కావస్తున్నా మహిళల హక్కుల కోసం కల్వకుంట్ల కవిత ఏనాడూ గళమెత్తిన దాఖలాలు లేవని తెలంగాణ ఉద్యమకారిణి ఇందిరా శోభన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్నేళ్ల తర్వాత మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు కోరుతూ జంతర్ మంతర్‌లో దీక్షకు చేపడతానని కవిత చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో జైలుకు వెళ్లే అవకాశం ఉండడంతో అకస్మాత్తుగా మహిళలు గుర్తుకు రావడం విచిత్రంగా ఉందని ఇందిరా శోభన్ గురువారం ఇక్కడ ఓ ప్రకటనలో విమర్శించారు. మహిళలను అడ్డం పెట్టుకొని రాజకీయ డ్రామా, అధికార యావ తప్ప వేరే ఏమీ లేదని నిందించారు. జనాభాలో సగభాగమున్న మహిళలకు 33 శాతం కాకుండా 50 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడాలని సూచించారు.

# ఏం చర్యలు తీసుకున్నారో చెప్పండి


- ప్రభుత్వ కాలేజీల్లో వసతులపై హైకోర్టు
- అఫిడవిట్ దాఖలు చేయాలని అధికారులకు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో వసతులు లేకపోవడంపై దాఖలైన పిటిషన్‌లో ఏం చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ఇంటర్‌మీడియెట్ విద్యా కమిషనర్‌తో పాటు పలువురికి నోటీసులు జారీ చేసింది. సరూర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో వసతుల లేమిపై ఓ పత్రికలో వచ్చిన వార్త ఆధారంగా కొత్తగూడెం భద్రాద్రి జిల్లాకు చెందిన ఎల్‌ఎల్‌బీ విద్యార్థి నల్లపు మణిదీప్ పిటిషన్ దాఖలు చేశారు. 'సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 700 మంది బాలికల కోసం ఒకే ఒక్క టాయిలెట్ ఉండటం అమానవీయం. క్యాంపస్‌లో ఇతర మౌలిక సదుపాయాలు చాలా అధ్వాన్నంగా ఉన్నాయని విద్యార్థులు మూడు నెలలుగా ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోలేదు. వాష్‌రూమ్‌లు కూడా చాలా అపరిశుభ్రంగా ఉంటున్నాయి. రోజులో విద్యార్థులకు అరగంట మాత్రమే విరామం ఉంటుంది. ఈ సమయంలోనే మధ్యాహ్న భోజనంతో పాటు అవసరం ఉన్న వారు టాయిలెట్‌ను వినియోగించుకోవాలి. ఇది సాధ్యమయ్యేదేనా? తాగునీరు కూడా అందుబాటులో లేదు. కుళాయిల్లో నీళ్లు రాక విద్యార్థినులు రుతుక్రమం సమయంలో కాలేజీకి వెళ్లడమే మానేశారు. కొంద రైతే రుతుక్రమాలను ఆపడానికి టాబ్లెట్లను ఉపయోగిస్తున్నారు. ఒక్కోసారి విధిలేక మూత్ర విసర్జన కోసం బయటకు వెళ్తున్నారు' అని పిటిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆందోళన చేస్తూ సరూర్‌నగర్ హైదరాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 300 మందికి పైగా విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. దీనిపై మానవ హక్కుల కమిషన్‌కు కూడా లేఖ ద్వారా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అయితే ఆ కమిషన్ చైర్‌పర్సన్, సభ్యుల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. దీంతో ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చింది. వెంటనే టాయిలెట్లతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలి' అని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ, విచారణను ఏప్రిల్ 25కు వాయిదా వేసింది.

# బీజేపీకి లాభం కలిగేలా బీఆర్‌ఎస్ వైఖరి

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే



సాక్షి ప్రతినిధి, వరంగల్: కేంద్రంలోని అధికార బీజేపీకి లాభం కలిగేలా బీఆర్‌ఎస్ వ్యవహరిస్తోందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావ్ ఠాక్రే అన్నారు. టీఆర్‌ఎస్ పేరు బీఆర్‌ఎస్‌గా మారిందే తప్ప, ఆ పార్టీ నేతల్లో మార్పు లేదని ఎద్దేవా చేశారు. ఇటీవల టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సభపై దాడి ఘటనలో గాయపడిన కాంగ్రెస్ నేత తోట పవన్‌కుమార్‌ను ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌహాన్‌తో కలిసి ఠాక్రే గురువారం అడ్వకేట్స్ కాలనీలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నేతలు దాడులను నమ్ముకున్నారని, కాంగ్రెస్‌కు లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ఈ దిగజారుడు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ క్రమంలోనే హనుమకొండలో పవన్‌ను చంపాలని చూశారని, ఆ దాడిలో ఆయన చనిపోయాడని అనుకొని వెళ్లిపోయారని మాణిక్‌రావ్ పేర్కొన్నారు. ఈ ఘటనలో దోషులెవరో తెలిసినా పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులను, అక్రమాలను ప్రశ్నించొద్దనే బీఆర్‌ఎస్ దాడులకు పాల్పడుతోందని, కాంగ్రెస్ పార్టీ ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. పేదలకు న్యాయం అందాలని, రాష్ట్రం అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో కేంద్రంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందని, కానీ, ఇప్పుడు ఇంతటి దుర్మార్గ పాలన నడుస్తుందని అనుకోలేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. తెలంగాణలో అన్యాయాలు, అత్యాచారాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, నేతలు కూచన రవళిరెడ్డి, హర్కర వేణుగోపాల్, పోరిక బలరాంనాయక్, ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొన్నారు.

# మహిళా బిల్లు కోసం ఢిల్లీలో కవిత దీక్ష

- 10న జంతర్ మంతర్ వద్ద ఒకరోజు నిరాహార దీక్ష
- భారత్ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహణ... వచ్చే విడత పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల కోసం ఈ నెల 10న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 'భారత్ జాగృతి' ఆధ్వర్యంలో ఒకరోజు నిరాహార దీక్ష చేపడుతున్నట్లు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు. 2014, 2019 ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ మహిళా బిల్లుపై ఇచ్చిన హామీని నెరవేర్చాలనే డిమాండ్‌తో దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారమిక్కడ తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడా రు. మార్చి 13 నుంచి రెండో విడత బడ్జెట్ స మావేశాలు ప్రారంభమవుతున్నందున ఈ స మావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించా లని డిమాండ్ చేశారు. 'తెలంగాణ జాగృతి' కృషి మాదిరిగానే జాతీయస్థాయిలో కార్యక్రమాల నిర్వహణ కోసం 'భారత్ జాగృతి'ని రూపొందించినట్లు గుర్తుచేశారు.

**కోటాలో కోటా ఉండాల్సిందే**

2010లో మహిళా బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందినప్పుడు కొన్ని పార్టీలు కోటాలో కోటా (ఉపకోటా) ఉండాలని డిమాండ్ చేశాయని, ప్రతి ఒక్కరికి వారి జనాభా ప్రకారం రాజ్యాంగబద్ధంగా ఉపకోటా ఉండాలని చెప్పారు. మహిళాబిల్లుకు బీఆర్‌ఎస్ మద్దతిస్తుందని గతంలోనే సీఎం కేసీఆర్ ప్రకటించడంతోపాటు, పార్లమెంట్ ఎంపీల సంఖ్యను 33 శాతం పెంచి మహిళలకు కేటాయించాలని సూచించారన్నా రు. 1952లో మొదటి లోక్‌సభలో 24 మంది మహిళాఎంపీలుండగా, తాజాగా 78 మంది మహిళా ఎంపీలున్నారని, 75 ఏళ్లలో మహిళల ప్రాతినిధ్యం అనుకున్నంతగా పెరగలేదన్నారు.

**బీజేపీ చెబితే అరెస్టు చేస్తారా?**

బీజేపీవారు చెబితే అరెస్టులు చేసేట్టయితే. దర్యాప్తు సంస్థలు ఎందుకని కవిత నిలదీశారు. మోదీ వైఫల్యాలను ఎత్తిచూపితే కేంద్ర దర్యాప్తు సంస్థలను పంపి భయపెట్టడం బీజేపీకి అలవాటేనని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీల నేతలపై విచారణ చేయిస్తున్న బీజేపీ ప్రభుత్వం,అదానీ కుంభకోణంపై ఎందుకు విచారణకు ఆదేశించలేదని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతోనే అదానీపై విచారణ మొదలైందన్నారు.

## శాంతిభద్రతల కోసం బీజేపీని తిరస్కరించాలి

- ఏఐఎంఐఎం ఆవిర్భావ దినోత్సవ సభలో అసదుద్దీన్ ఒవైసీ
- అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కండి.. మిగతా రాష్ట్రాల్లో సైతం పోటీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో మతవిద్వేషాల వ్యాప్తికి బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తోందని, శాంతిభద్రతలు వెల్లివిరియాలంటే కమలనాథులను తిరస్కరించాలని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రజలకు పిలుపునిచ్చారు. కేవలం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి అధికారంలో రావాలని పగటికలలు కంటోందని దుయ్యబట్టారు. గురువారం హైదరాబాద్ దారుస్సలాం మైదానంలో జరిగిన ఏఐఎంఐఎం ఆవిర్భావ దినోత్సవాల్లో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, అనంతరం బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని, బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే ఇక్కడే జీడీపీ ఎక్కువని పేర్కొన్నారు. రాష్ట్రంలో మతకల్లోలాలు లేవని, శాంతి, అభివృద్ధి రెండూ ఉన్నాయని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతి, రాజ్యాంగం కావాలో లేక బుల్డోజర్ కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు గంట మోగినట్లేనని, పార్టీ బాధ్యులు ఎన్నికలకు సంసిద్ధం కావాలని అసదుద్దీన్ పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో రాజస్తాన్, కర్ణాటకలో ఏఐఎంఐఎం పోటీ చేస్తుందని ప్రకటించారు.

**గ్యాస్ సిలిండర్‌కు నమస్కారం పెట్టండి**

వచ్చే ఎన్నికల్లో ఓటు వేసే ముందు మహిళలు తమ ఇళ్లలోని గ్యాస్ సిలిండర్లకు నమస్కారం పెట్టి వెళ్లాలని ఒవైసీ విజ్ఞప్తి చేశారు. వంటగ్యాస్ సిలిండర్ల ధరలను మరోసారి పెంచిన మోదీ ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. ఖదీర్‌ఖాన్ కుటుంబాన్ని తమ పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఒవైసీ ప్రకటించారు. భారతదేశానికి చాయ్‌వాలా, చౌకీదార్ అవసరం లేదని, దేశ సరిహద్దులను రక్షించగల బలమైన ప్రధాని అవసరమని ఏఐఎంఐఎం శాసనపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అహ్మద్ పాషా ఖాద్రీ, అహ్మద్ పాషా ఖాద్రీ, జాఫర్ హుస్సేన్ మేరాజ్, కౌసర్ మోహియుద్దీన్, అహ్మద్ బలాలా, మోజంఖాన్, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆయన ఒకదానిపై ఒకటి ఏడు ఆకాశాలు సృష్టించాడు. అందులో చంద్రుణ్ణి (చల్లటికాంతి వెదజల్లే) జ్యోతిలా చేశాడు. సూర్యుణ్ణి (దేదీప్యమానమైన) దీపంగా సృజించాడు. ఇదంతా మీకు కన్పించడం లేదా?'

– ఇస్లాం ధర్మం



సాక్షి

శుక్రవారం, మార్చి, 3

# కొండల్లో కాషాయ రాగం

'ఎవడన్నా కోపంగా కొడతాడు, లేకపోతే బలంగా కొడతాడు... వీడేంట్రా చాలా శ్రద్ధగా కొట్టాడు!' ఇది ఓ హిట్ సినిమాలో ఫైట్ చేసిన హీరోను ఉద్దేశించి ఓ ఛోటా విలన్ పాపులర్ డైలాగ్. సమయం, సందర్భం వేరైనా... గురువారం నాడు వెలువడ్డ మూడు ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయాలకు ఇదే డైలాగ్ సరిగ్గా సరిపోతుంది. త్రిపుర అసెంబ్లీ స్థానాల్లో సగానికి పైగా గెలిచి, బీజేపీ ఆ రాష్ట్రాన్ని స్వీప్ చేసింది. నాగాలాండ్‌లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీపీపీ కూటమి అధిక స్థానాలు సాధించి, సర్కారు ఏర్పాటు దిశగా అడుగులు వేస్తోంది. మిగిలిన మేఘాలయలో ఎన్‌పీపీ అధిక స్థానాలు దక్కించుకున్నా, అక్కడా ప్రస్తుత సీఎం కన్రాడ్ సంగ్మా చూపు నిన్నటి దాకా తమ ప్రభుత్వంలో భాగమైన బీజేపీని మళ్ళీ కలుపుకోవడం మీదే ఉంది. వెరసి, ముచ్చటగా మూడు రాష్ట్రాలూ బీజేపీ జేబులోనే! అదీకాక అటు సీపీఎం, ఇటు కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) తదితరుల్ని కనుమరుగు చేసి, కాషాయం రెపరెపలాడడం విశేషం.

కొన్నేళ్ళ క్రితం ఈశాన్యంలో సీట్ల బలమే కాదు... ఓటర్ల బలగం కూడా లేని కాషాయ పార్టీ ఇప్పుడు అక్కడి రాష్ట్రాలన్నిటిలో కాంగ్రెస్‌ను తోసిపుచ్చి, తిరుగులేని శక్తిగా నిలవడం ఆషామాషీ కాదు. అందుకు ఆ పార్టీ దీర్ఘకాలిక వ్యూహం, ఎన్నికల లెక్కల్లో స్థానిక పొత్తులు వగైరా అనేకం ఉన్నాయి. గిరిజన జనాభా, క్రైస్తవులు ఎక్కువగా ఉండే ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ స్వరం మార్చింది. మతపరమైన అంశాలు, గొడ్డుమాంసంపై నిషేధం లాంటి ప్రస్తావనలే తేకుండా తెలివిగా వ్యవహరించింది. మైనారిటీల అభద్రతనూ, సెంటిమెంట్లనూ రెచ్చగొట్టే తెలివితక్కువ పనికి దిగలేదు. పైగా, కేంద్రంలోని అధికారపక్షంతో స్నేహంగా సాగాలని భావించే అభివృద్ధి ఆధారిత ప్రజాస్వామ్యాన్ని ఈ సుదూర పర్వతప్రాంత రాష్ట్రాలు నమ్మడం సాధారణం. అందుకు తగ్గట్టే పొరుగునే బీజేపీ పాలిత అస్సామ్‌లోని అభివృద్ధి నమూనాను చూపి, ఓటర్లను బీజేపీ తన వైపు తిప్పుకొంది.

త్రిపురలో కాంగ్రెస్, టీఎంసీ, కొత్తగా వచ్చిన 'టిప్రా మోటా పార్టీ'లతో త్రిముఖ పోటీని ఎదుర్కొన్న కమలనాథులు వరుసగా రెండోసారీ గద్దెనెక్కడం విశేషం. వ్యతిరేకతను ఎదుర్కొంటున్న విప్లవ్‌దేవ్‌ను సరైన సమయంలో సీఎంగా పక్కకు తప్పించి, మాణిక్ సాహాకు కిరీటం పెట్టడమూ బీజేపీకి వ్యూహాత్మకంగా ఫలించింది. గతంలో వరుసగా 7 సార్లు త్రిపురను పాలించి, శాసించిన సీపీఎంకు ఆ రాష్ట్రంలో ఇది వరుసగా రెండో పరాజయం. పైగా ఓట్లు 42 శాతం నుంచి 24 శాతానికి పడిపోవడం ఆ పార్టీకి ప్రమాదఘంటిక. 'టిప్రా' కింగ్‌మేకర్‌గా ఆవిర్భవించకున్నా, కలసి బరిలోకి దిగిన సీపీఎం – కాంగ్రెస్ అవకాశాలను దెబ్బ తీసింది. బెంగాలీ ఓటర్లపై టీఎంసీ పెట్టుకొన్న ఆశ అడియాసైంది. 2018తో పోలిస్తే బీజేపీ కూటమికి 11 శాతం ఓట్లు తగ్గినా, కమలనాథులే సొంతంగా సర్కారు ఏర్పాటు చేసే స్థితికి చేరుకోవడం ప్రతిపక్షాల అనైక్యతకు ప్రతిఫలం!

శుభవార్త ఏమంటే, అరవై ఏళ్ళ నాగాలాండ్ చరిత్రలో తొలిసారిగా మహిళలు ఎమ్మెల్యే లుగా ఎన్నిక కావడం! పితృస్వామ్య భావజాలం ప్రబలంగా ఉండే ఈ గడ్డపై గతంలో పట్టణ మునిసిపల్ ఎన్నికల్లో స్త్రీల రంగప్రవేశానికి ప్రయత్నం జరిగినా, హింస రేగి పోటీ నుంచి తప్పుకోవాల్సొచ్చింది. కానీ ఈసారి ఏకంగా ఇద్దరు మహిళలు గెలవడం గమనార్హం. ఇది మార్పు పవనాలకు ప్రతీక. ఇక, వివిధ రాష్ట్రాల పార్టీలు (జేడీ-యూ, లోక్‌జనశక్తి, శరద్ పవార్ ఎన్సీపీ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా) నాగాలాండ్ బరిలో దిగడం చిత్రం. ఆరు సీట్లలో ఎన్సీపీ గెలవడం, పశ్చిమాన మహారాష్ట్ర నుంచి వచ్చి తూర్పున నాగాలాండ్‌లో సత్తా చాటి, పెద్ద ప్రతిపక్షంగా అవతరించడం విచిత్రం.

ఈశాన్య రాష్ట్రాల్లో అంచనాలకు అల్లంత దూరంలో ఆగిన కాంగ్రెస్ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరిగిన 6 ఉప ఎన్నికల్లో మాత్రం 3 చోట్ల విజయాలు సాధించింది. తమిళనాట ఈరోడ్ (ఈస్ట్), మహారాష్ట్రలోని కస్బాపేఠ్, బెంగాల్‌లో టీఎంసీ నుంచి చేజిక్కించుకున్న సాగర్‌దిఘీ స్థానాలు హస్తానికి కొంత ఊరట. ఈరోడ్ గెలుపు వెనుక అధికార డీఎంకెతో పొత్తు, కస్బాలో విజయానికి మహా వికాస్ ఆఘాడీ కూటమి మద్దతు, 2021 ఎన్నికల్లో ఖాతా తెరవలేకపోయిన బెంగాల్‌లో ఈసారి సీపీఎం అండ కాంగ్రెయులకు కలిసొచ్చింది నిజమే. అయితే, 32 ఏళ్ళుగా కంచుకోటైన పుణేలోని కస్బాపేఠ్‌లో బీజేపీ ఓటమి ఆలోచన రేపుతోంది. అదే సమయంలో మిగతా 3 ఉప ఎన్నికల్లో బీజేపీ గెలవడం, అందులోనూ రామ్‌గఢ్‌ను కైవసం చేసుకోవడం విస్మరించలేం.

ఒకరకంగా ఈ ఫలితాలు ప్రతిపక్షాలకు ఆత్మశోధన అవకాశం. ఏ మాటకా మాట – ఈశాన్య రాష్ట్రాల ఎన్నికలను బీజేపీతో పోలిస్తే కాంగ్రెస్ తదితర ప్రతిపక్షాలు ఏ మేరకు సీరియస్‌గా తీసుకున్నాయన్నది అనుమానమే. ప్రధాని, కేంద్ర హోమ్‌మంత్రి సహా పలువురు పదేపదే ఈశాన్యంలో పర్యటించారు. ప్రతిపక్షాలపై ప్రచారదాడి చేశారు. స్థానిక స్థితిగతులకు అనుగుణంగా వ్యాఖ్యలు, వ్యూహాలు మార్చుకున్నారు. ప్రతిపక్షాల్లో గెలిచితీరాలనే ఆ పట్టుదల, ఎన్నికల చాణక్యం కొరవడ్డాయి. మరి రెండు నెలల్లో కర్ణాటక, ఆ వెంటనే మధ్యప్రదేశ్, రాజస్థాన్ – ఇలా అనేక రాష్ట్రాల్లో ఎన్నికలు రానున్న వేళ ప్రతిపక్షాలకు ఈ ఫలితాలు ఓ మేలుకొలుపు. ఐక్యత, ఐడియాలజీ ఏదీ లేకుండా ఒక్క మోదీ వ్యతిరేక మంత్రమే ఫలిస్తుందనుకుంటే పొరపాటు. ప్రత్యర్థి బలవంతుడైనప్పుడు ప్రత్యామ్నాయ వ్యూహాలు, అజెండాలు లేకుండా సవాలు చేస్తే శృంగభంగం తప్పదు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు మేలుకుంటే... కోలుకుంటాయి. లేదంటే, ఎన్నికలు ఏవైనా ఫలితాలు కాస్త అటూ ఇటుగా ఇలాగే ఉంటాయి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.ఏకాదశి ఉ.8.53 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** పునర్వసు సా.4.27 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** రా.1.21 నుండి 3.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.42 నుండి 9.29 వరకు, తదుపరి ప.12.34 నుండి 1.23 వరకు, **అమృతఘడియలు:** ప.1.47 నుండి 2.45 వరకు

**సూర్యోదయం :** 6.22
**సూర్యాస్తమయం:** 6.02
**రాహుకాలం :** ఉ.10.30 నుండి 12.00 వరకు
**యమగండం :** ప.3.00 నుండి 4.30 వరకు

# నియంత్రణ సంస్థల సేవలు ప్రశ్నార్థకం

**ఆర్థికపరమైన అవకతవకలపై తిరుగులేని అధికారాలు చలాయిస్తున్న నియంత్రణా సంస్థగా 'సెబీ'కి పేరుంది. కానీ వివిధ ప్రభుత్వాల పాలనా కాలాల్లో అది మౌనం పాటించడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ప్రభుత్వ నిర్ణయాలపై పారదర్శకతను నెలకొల్పడమే స్వతంత్ర రెగ్యులేటరీ కమిషన్ల ఏర్పాటు ఉద్దేశం. అలాంటిది స్వయం నియంత్రణా సంస్థలే తమ విధులను సంతృప్తికరంగా నిర్వహించడం లేదనే అభిప్రాయం ఎందుకు ఏర్పడుతోంది? ఈ రెగ్యులేటరీ కమిషన్లను స్వతంత్రంగా కాకుండా ప్రభుత్వం తరపున పనిచేసేలా మార్చేశారు. ఎంపిక కమిటీలు సంబంధిత మంత్రిత్వ శాఖలకు చెందిన పదవీ విరమణ చేసిన పాలనాధికారులతో కూడి ఉంటున్నాయి. ఇలాంటి ఆచరణ చట్టబద్ధమైన స్వతంత్ర రెగ్యులేటరీల అసలు ఉద్దేశానికి వ్యతిరేకం.**

విశ్లేషణ



నీలూ వ్యాస్

ప్రపంచంలోనే అత్యున్నత అధికారం చలాయిస్తున్న నియంత్రణా సంస్థల్లో మన 'సెబీ' (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) ఒకటి. ఆర్థిక పరమైన అవకతవకలపై శోధన, స్వాధీనం, దాడులు, అరెస్టు లకు సంబంధించి తిరుగులేని అధికారాలను సెబీ కలిగి ఉంటోంది. అనుమానాస్పదమైన ట్రేడింగ్ కార్యకలాపాలను, రియల్ టైమ్ ప్రాతిపదికన షేర్ల విలువను తారుమారు చేయడాన్ని పసిగట్టడంలో సెబీకి విస్తృతమైన నిఘా వ్యవస్థ తోడుగా ఉంటోంది. అయినప్పటికీ విభిన్న రాజకీయ పాలనా కాలాల్లో ఈ రెగ్యులేటరీ సంస్థ మౌనం పాటిస్తూ వచ్చింది.



గత రెండు దశాబ్దాలుగా, సెబీ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశానుసారం పనిచేస్తూ వచ్చింది. ప్రత్యేకించి యూపీఏ (యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయెన్స్) రెండో పాలనా కాలంలో ఇది కొట్టొచ్చినట్లు కనబడుతుంది. లేదా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్(ఎన్ఎస్ఈ)లో కో- లొకేషన్ (కోలో) స్కామ్ విషయంలో కానీ, సత్యం కుంభకోణంలో కానీ సెబీ కార్యకలాపాలు ఎలాంటి పబ్లిక్ లేదా రాజకీయ తనిఖీ రాడార్‌లో లేకుండా కొనసాగుతూ వచ్చాయి. ఇటీవలే ఇలాంటి ప్రశ్నలను పార్లమెంట్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా ప్రతిభావంతంగా లేవనెత్తారు. గత రెండేళ్లలో స్టాక్ మార్కెట్లో కొన్ని కంపెనీల విలువ అమాంతంగా పెరిగిపోవడంపై ఆమె ప్రశ్నలు సంధించారు. కానీ సెబీ మాత్రం ఈ విషయంలో కనీస అధ్యయనం కూడా చేయనట్లు కనిపిస్తోంది.

దర్యాప్తు జరుగుతున్నప్పటికీ రూ. 20,000 కోట్ల విలువైన అత్యంత భారీ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీఓ)ని ఒక కంపెనీ ప్రతిపాదించడాన్ని సెబీ ఎలా అనుమతించిందంటూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సరిగ్గానే ప్రశ్నించారు (అయితే ఆ ప్రతిపాదనను తర్వాత ఉపసంహ రించుకున్నారు.) ఆర్థిక అవకతవకలపై అత్యంత క్రియాశీలకంగా ఉండే రెగ్యులేటరీ సంస్థ సెబీ తన విశ్వసనీయత ప్రశ్నార్థకమైన సమయంలో, తన గమనింపునకు వచ్చినప్పుడు ఈ విషయమై పరిశీలిస్తానంటూ ముభావంగా స్పందించిందే తప్ప అంతకుమించిన విచారణ జరపలేదు. ఎందుకు విచారించలేదనే కీలక ప్రశ్నకు కూడా ఇప్పటికీ అది సమాధానమివ్వడం లేదు.

### చర్యలు తీసుకున్న దాఖలా లేదు

సెబీ నిద్రపోతోందంటూ సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతుండటంతో, భారతదేశంలో రెగ్యులేటరీ వ్యవస్థ ఎందుకు విఫలమవుతోందన్న అంశంపై దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రభుత్వ నిర్ణయాలపై పారదర్శకతను నెలకొల్పడమే స్వతంత్ర రెగ్యులేటరీ కమిషన్ల ఏర్పాటు ఉద్దేశం. సరళీకరణ తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నందున బొగ్గు, భూమి, విద్యుత్, టెలికమ్యూనికేషన్లు, స్పెక్ట్రమ్, పెట్రోలియం, సహజ వాయువు, స్టాక్ మార్కెట్లు, పెన్షన్ నిధులు- వీటి నిర్వహణ, విమానాశ్రయాలు వగైరా ఎన్నో అంశాలు రెగ్యురేటరీ పరిశీలనా చట్రం పరిధిలోకి వచ్చాయి. అయితే ట్రాయ్(టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) లాంటిది కేవలం సిఫార్సులు మాత్రమే చేయగలిగే అధికారం కలిగివుంటోంది. మరోవైపు విద్యుత్ కమిషన్లు తమ సేవల మార్కెట్లపై అధికారం చలాయించడానికి ఇప్పటికీ ప్రయత్నిస్తూనే ఉన్నాయి. సెబీ, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా వంటి కొన్ని కేసులలో తప్పితే నిబంధనలు పాటించకపోవడంపై చర్యలు తీసుకునే శిక్షాత్మక అధికారాలు ఇప్పటికీ బలహీనంగానే ఉంటున్నాయి.

స్వయం నియంత్రణా సంస్థలు తమ విధులను సంతృప్తికరంగా నిర్వహించడం లేదనే అభిప్రాయం ఎందుకు ఏర్పడుతోంది? చాలావరకు ఈ రెగ్యులేటరీ సంస్థలే అక్రమాలకు పాల్పడుతున్నాయనే ఆరోపణలు ఉంటున్నాయి. నిబంధనలను అతిక్రమించే సభ్యులకు వ్యతిరేకంగా ఐసీఏఐ (ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా) లేదా ఎమ్‌సీఐ (మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) వంటి ప్రొఫెషనల్ సంస్థలు కఠిన చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. ఇక క్రీడా సంస్థల విషయానికి వస్తే అవి జీవితకాలం పదవుల్లో ఉండే వ్యక్తులతో కూడుకుని ఉంటున్నాయి. పైగా వీటి ఆర్థిక సమగ్రతపై సందేహాలు చోటు చేసుకుంటున్నాయి. మరోవైపున ప్రభుత్వం నియమించిన చట్టబద్ధమైన నియంత్రణాధికార సంస్థలు కూడా లోపరహితమైన స్థాయికి చేరలేకపోతున్నాయి. విద్యుత్, టెలీ కమ్యూనికేషన్లు, కాంపిటీషన్, సెక్యూరిటీల విషయంలో సంబంధిత కమిషన్ల ఆదేశాలకు వ్యతిరేకంగా అప్పీల్స్ వంటివి అప్పీలేట్ ట్రిబ్యునల్స్‌కి వెళుతున్నాయి తప్ప నేరుగా హైకోర్టుల ముందుకు వెళ్లడం లేదు. దీని వల్ల జాప్యం జరగడమే కాకుండా కమిషన్ అసలు ఉద్దేశాన్ని పలుచన చేస్తున్నాయి.

### డిప్యుటేషన్ మరో సమస్య

ప్రభుత్వ విభాగాలు ప్రత్యేకించి రాష్ట్ర ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన అనేక ఉదంతాల్లో రెగ్యులేటరీ కమిషన్లను స్వతంత్రంగా కాకుండా ప్రభుత్వం తరపున పనిచేసేలా మార్చేశారు. రెగ్యులేటరీ సంస్థల ఛైర్మన్, సభ్యుల ఎంపిక ప్రక్రియ దీనికి ఒక కారణం కావచ్చు. ఎంపిక కమిటీలు సంబంధిత మంత్రిత్వ శాఖలకు చెందిన పదవీ విరమణ చేసిన పాలనాధికారులతో కూడి ఉంటున్నాయి. ఇలాంటి ఆచరణ చట్టబద్ధమైన స్వతంత్ర రెగ్యులేటరీల అసలు ఉద్దేశానికి వ్యతిరేకంగా ఉంటోంది. ఇలాంటి విభాగాల్లో నియమితులైన వారిని నాటుకుపోయిన ప్రభుత్వ విధేయ సంస్కృతి నుంచి బయటపడవేయలేరా?

చాలావరకు రెగ్యులేటరీ విభాగాల్లో పని చేస్తున్న సిబ్బంది ప్రభుత్వ ఇతర విభాగాల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చినవారు. వీరు రెగ్యులేషన్‌లో తమకు కెరీర్ ఉందని భావించడం లేదు. అలా భావించే కొద్దిమందే ఈ విభాగాల సభ్యులుగానూ లేదా ఛైర్మన్లుగానూ ఎదుగుతున్నారు. ఈ తరహా రెగ్యులేటరీ విభాగాలు మరొక ప్రభుత్వ సంస్థలానే తరచుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నాయి. ఎందుకంటే ఈ విభాగాలలోని కీలక స్థానాలు పదవీ విరమణ చేసిన బ్యూరోక్రాట్లకు, ప్రభుత్వ అధి కారులకు పదవీ విరమణ అనంతరం దక్కించుకునే హోదాలుగా మారిపోయాయి. దీని ఫలితంగా పెద్దగా స్వాతంత్ర్యం లేకపోవడం, సంబంధిత రంగాల నియంత్రణాధికారుల్లో సాహసం లేక విజ్ఞానం లేకపోవడం జరుగుతోంది. ప్రభుత్వ ప్రతిష్ఠ పైన మాత్రమే కాకుండా, భారత వృద్ధి గాథపై కూడా ఇది ప్రభావం చూపుతున్నందు వలన, దేశంలోని రెగ్యులేటరీ సంస్థల విశ్వసనీయతను పునరుద్ధరించాల్సిన సమయం ఆసన్నమైంది.

వ్యాసకర్త సీనియర్ టీవీ యాంకర్, కన్సల్టింగ్ ఎడిటర్
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)



సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

## సోషల్ మీడియా

### జీవన లీల



మన మానవ జాతి ఉనికిలోకి వచ్చిన ఈ రెండు లక్షల సంవత్సరాల్లోనే 110 బిలియన్ల(11,000 కోట్ల) మంది చనిపోయారు. ఉఫ్! అయినప్పటికీ ఇంకా ఈ వాస్తవం వెనుక ఉన్న పరమార్థం ఏమిటో మనకు ఏమాత్రం తెలీదు. బతికి ఉన్నవాళ్లలో కూడా కొందరు మాత్రమే దీన్ని పట్టించుకుంటారు.

– జోసెఫ్ టి. నూనీ, రచయిత

### ఆసక్తికరం



హిందుత్వ తొలి ప్రాధాన్యమైన బీజేపీ, ఈశాన్య భారత రాష్ట్రాల్లో ఎలా ప్రజాదరణ పొందుతోంది అనేదాని మీద వివరణాత్మక విశ్లేషణలు రావాలి, ఏదో ఎన్నికల రోజు నాలుగు హడావిడి మాటలు కాకుండా.

– దీప్ హల్దార్, సంపాదకుడు

### ఎలా ఎదుర్కొంటుంది?



న్యాయవ్యవస్థ భారత ప్రజాస్వామ్యంతో పోరాడుతోంది. దీనిగురించి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం ఏం చేస్తుందన్నది ప్రశ్న.

– నూపుర్ జె. శర్మ, సంపాదకురాలు

### మనమే పెద్దలం



తల్లిదండ్రులతో ప్రయాణం అంటే, వాళ్లకు సంబంధించిన ప్రతిదీ చూసుకోవడం, వాళ్లు నిద్రిస్తున్నప్పుడు కూడా. మనం పిల్లలుగా ఉన్నప్పుడు వాళ్లు మనల్ని చూసుకున్నట్టే.

– దీప్‌శిఖా ఘోష్, వైద్యురాలు

### వన్‌సైడ్ మ్యాచ్



ఇండియా–ఆస్ట్రేలియా మ్యాచ్ స్కోర్లను మరిచిపోండి. దానికంటే రసవత్తరమైన మ్యాచ్ పాకిస్తాన్‌లో జరుగుతోంది. అందరికళ్లూ పాకిస్తాన్ రూపాయి విలువ (డాలర్‌తో పోల్చితే) 300కు పడిపోతుందా అనేదానిమీదే ఉన్నాయి. ఒక్కరోజులోనే 10 శాతం తగ్గింది. ఇది పతనానికి ప్రారంభం.

– సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

### చారిత్రక సంస్కరణ



ఎన్నికల కమిషన్‌ను సంస్కరించేలా కీలక మార్గదర్శకం ఇస్తూ చారిత్రక తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టుకు అభినందనలు. ఎన్నికల కమిషనర్లు ఇకనుంచీ కేవలం ప్రభుత్వం వల్ల మాత్రమే నియమితులు కాకుండా – ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ వారిని నియమిస్తుంది. ప్రభుత్వానికి ఏజెంటుగా పనిచేస్తున్న ఎన్నికల కమిషన్ పనితీరు మీద దీనివల్ల మంచి ప్రభావం పడగలదు.

– ప్రశాంత్ భూషణ్, యాక్టివిస్టు- న్యాయవాది

### అద్దె మేలు



కలల నగరం ముంబయిలో నేను నివసిస్తాను. నా ఫ్లాట్ విలువ 7 కోట్లు. కానీ నేను చెల్లించే అద్దె 1.5 లక్షలు. దాన్నే నేను కొనివుంటే నెల కిస్తీ కింద 5 లక్షలు కట్టాల్సి వచ్చేది. అది కూడా డౌన్ పేమెంట్ 1.4 కోట్లు చెల్లించిన తర్వాత. అందుకే నేను ఇల్లు కొనను.

– శరణ్ హెగ్డే, ఫైనాన్స్ క్రియేటర్

# ఇంటర్ పిల్లలు చితికి పోవాల్సిందేనా?

చదువు అంటే ఏమిటి? అది ర్యాంకులు, మార్కుల కోసమేనా లేక జ్ఞానం, దాని ద్వారా వచ్చే చైతన్యం కోసమా? ర్యాంకులు, మార్కుల పోటీలో పడి పిల్లలు తనువు చాలించాలా? చదువంటేనే ర్యాంకులు అనే నిర్వచనాన్ని ఇవ్వడం సమంజసమేనా? 'దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మాణం అవుతుంది' అని చెప్పిన కొఠారీ కూడా చదువు ఇలా కార్పొరేట్ చేతుల్లో బందీ అయ్యి దేశ భవిష్యత్తు నిర్మించే వారిని బలి తీసుకుంటుందని ఊహించలేదు. ఇప్పుడు ఎంత డబ్బు పెడితే అంత చదువు అనే సిద్ధాంతం పుట్టుకొచ్చింది. చదువుకు పెట్టే పెట్టుబడి తిరిగి ఉద్యోగ రూపంలో సంపాదించడం తప్ప... సమాజం, సమాజ అవసరాల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదనే భావన పిల్లలూ, తల్లి దండ్రుల్లో కలిగేలా చేసింది కార్పొరేట్ విద్యా వ్యవస్థ. బాగా సంపాదించాలంటే మంచి మార్కులు రావాలి. మంచి మార్కులు కోసం కార్పొరేట్ విద్యా సంస్థల్లో చదవాలి, మంచి మార్కులు రాకపోతే జీవితం వ్యర్థం అనే భావనను కార్పొరేట్ విద్యాసంస్థలు కల్పించాయి.

అందుకే విద్యార్థులకు మంచి మార్కులు, ర్యాంకులు రాకపోతే పిల్లలను తల్లిదండ్రులూ దండిస్తున్నారు. 2016–2019 మధ్య దేశ వ్యాప్తంగా 23,671 మంది విద్యార్థులు చనిపోయారని కేంద్రమంత్రి పార్లమెంట్‌లో ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్ విద్యలో ఈ రకమైన ర్యాంకుల, మార్కుల దాహంతో కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులను వారి వ్యాపార కాంక్ష కోసం బలితీసుకుంటున్నాయి. అందుకే...

'అసలు అవి ఇంటర్ కాలేజీలు కాదు, కాన్సన్ట్రేషన్ క్యాంపులు' అంటూ వ్యాఖ్యానించారు ప్రొఫెసర్ నీరదా రెడ్డి. 2001లో విద్యార్థి ఆత్మహత్యలపై అప్పటి ప్రభుత్వం నీరదా రెడ్డి కమిటీని నియమించింది. ఇంటర్ విద్యను కార్పొరేట్ రంగం ఎలా శాసిస్తుందో ప్రొఫెసర్ నీరదా రెడ్డి నివేదిక వివరించింది. రోజుకు 16 గంటలు పాఠాలు చెప్తున్నారనీ, మార్కుల ప్రకటన రోజు ఆత్మహత్యలు మామూలు అయిపోయాయనీ, హాస్టళ్లు సరిగా లేవనీ, ఒత్తిడిలో ఉన్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చే వ్యవస్థ లేదనీ... ఇలా ఎన్నో లోపాలు ఎత్తి చూపారామె. ఆటలు, వినోదం అసలు లేవు. అసలు సైన్స్ ల్యాబ్ అనే ప్రశ్నే లేదు. మార్కులు తగ్గితే తక్కువ సెక్షన్లకు మార్చే పనిష్మెంట్ విధానం పిల్లలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. కానీ ఆ కమిటీ నివేదిక వచ్చిన 22 ఏళ్ల తరువాత కూడా పరిస్థితి ఏమీ మారలేదు. నార్సింగిలో ఈ వారంలో సాత్విక్, అంతకంటే ముందు ఫిర్జాదిగూడలో రమాదేవి 20 రోజుల వ్యవధిలోనే ఒకే కార్పొరేట్ విద్యా సంస్థకు చెందిన కాలేజీల్లో మరణించారు. ప్రతిరోజూ 16 గంటల పాటు చదువులోనే గడపడం వల్ల నిద్ర కరువై, మానసిక ప్రశాంతత లేక అత్యధిక ఒత్తిడితో పెద్ద ఎత్తున విద్యార్థులు చనిపోతున్నారు. ఒకప్పుడు విద్యార్థి ఆత్మహత్య అంటే కాలేజీలు అట్టుడికిపోయేవి. ఇప్పుడు ప్రతి ఏటా కార్పొరేట్ కాలేజీల్లో ఆత్మహత్యలు మామూలే అనే పరిస్థితి వచ్చింది.

చివరగా సాత్విక్ రాసిన సూసైడ్ నోట్ చదివైనా తల్లిదండ్రులు మారాలి. ర్యాంకులు, మార్కులు మాత్రమే జీవితాలను నిలబెట్టవు. ఎంత డబ్బు పెడితే అంత చదువు అనే భ్రమలో నుండి తల్లిదండ్రులు బయటకు రావాలి. ఆత్మహత్యలు ఆగిపోవాలంటే ప్రభుత్వాలు విద్యారంగంలో తగిన మార్పులు తేవాలి. ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేసి నమ్మకం కల్పించాలి. అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన విద్యను అందించాలి.

– టి. నాగరాజు, ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి | 94900 98292

# వెనుకటి గుణమేల మాను...

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. గది మా అడ్డ. మా దోస్తులంత గాడ జమైతరు. గీ దాని మీద గా దాని మీద అనకుంట అన్నిటి మీద మాట్లాడుతుంటరు. రాజకీయాల మీద మాట్లాడుకుంట మాటల్లోనే కొట్లాడ్తుంటరు. గా దినం నేను బోక ముందు ఏం మాట్లాడుకుండ్రో నాకెర్క లేదు. గని నేను బోయినంక గీ తీర్గ మాట్లాడుకున్నరు.

''గియ్యాల్రేపు కుక్క కాట్లు ఎక్వ అయినయి గదా! కుక్కలను పట్టుకునే తండ్కు జీహెచ్ఎంసీ ఏం జేస్తున్నది'' అని సత్నారి అడిగిండు.

''ఏం జేస్తున్నదో నాకెర్క లేదు గని కుక్కలు కర్వకుండ ఉండాలంటె ఏం జెయ్యాలని జెప్పిందో నాకెర్క'' అని ఇస్తారి అన్నడు.

''ఏం జెప్పిందో జెర జెప్పరాదు''

''కుక్క అంటె ఎవరు. కాలభైరవుడు. కాలభైరవుడు అంటె ఎవరు? దేవుడు. గా దేవునికి గుడి గట్టాలె. దినాం పూజలు జెయ్యాలె. కాలభైరవ అస్టకం సద్వాలె. భౌ భౌ మనుకుంట బజనలు జెయ్యాలె. గట్ల జేస్తిరా అంటె కుక్కలు మీ తెరువు రావు అని జీహెచ్ఎంసీ జెప్పింది.''

''ఇంకేమన్న జెప్పిందా?''

''బిస్కిట్ పుడ దగ్గర ఉంచుకోండ్రి. తొవ్వ పొంటి బోతుంటె కుక్కలు గిన గండ్లబడ్తె బిస్కిట్లు ఎయ్యుండ్రి. బిస్కిట్లు దినుకుంట గవ్వి మీ దగ్గరకు రావు.గిట్ల రొండు మూడు దినాలు బిస్కిట్లు ఏస్తిరా అంటె మిమ్ములను సూడంగనే గవి తోక ఊపుతయి. కుక్కలను నువ్వు ప్రేమిస్తె కుక్కలు నిన్ను ప్రేమిస్తయి. కుక్కలు ప్రేమతోని దగ్గరకొస్తె జల్దిజల్ది నడ్వొద్దు. గట్ల జేస్తిరా అంటె కుక్కలకు తిక్క లేస్తది. కుక్క మీ దిక్కు గిన జూస్తె మీరు ఇంకొక దిక్కు సూడుండ్రి. కుక్క కండ్లల్ల కండ్లు బెట్టి జూస్తిరా అంటె గా దాన్కి కోపమొస్తది. ఒక కుక్కను ఇంకొక కుక్క సూటిగ జూస్తె నడుస్తది. గని నీ అసుంటోడు నా అసుంటోడు జూస్తె నడ్వదు. కుక్కకు కుక్కనే సమానం. మన్సి గాదు. కుక్క గిన మొర్గుకుంట దగ్గరకొస్తె అటిటు మెస్లకుండ్రి. బొమ్మ లెక్క నిలబడుండ్రి. గట్ల నిలబడ్తిరా అంటె మిమ్ములను ఆసన జూస్తది. ఆసన జూసినా బొమ్మ లెక్కనే ఉండుండ్రి. గది కాలు మీదికి లేపి జెర సేసైనంక బోతది అని జీహెచ్ఎంసీ జెప్పింది.''



''వాడ కట్టుల గుడ్క కుక్కలున్నయి జాగ్రత్త అనేటి బోర్డులు బెడ్తం. గా బోర్డులు జూసినోల్లు అటిటు జూస్కుంట మెల్లగ నడ్వాలె. జూ జూ అని బిలిస్తె కుక్కలు మీతోని దోస్తి జేస్తయి. కటే కటే అని కోప్పడ్తిరా అంటె అవి కరుస్తయి. ఎండ కాలమొస్తున్నది. మనకు దూపైన తీర్గనే కుక్కలకు గూడ దూపైతది. గవ్విటికి నీల్లు తాపియ్యాలె. నెలకు రొండుపార్లు మాంసం బెట్టాలె. గట్ల జేస్తిరా అంటె కుక్క కాటు బాద ఉండదు అని మేయర్ అన్నది'' అని యాద్గిరి జెప్పిండు.

''ఒగాల్ల కుక్కలన్ని మీటింగ్ బెట్టు కుంటె గా మీటింగ్ల మన గురించి ఏమ నుకుంటయి'' అని ఇస్తారి అడిగిండు.

''రాష్ట్రంల ఉన్న కుక్కలన్ని మీటింగ్ బెడ్తె లష్కర్ల ఉన్న పరేడ్ మైదాన్ల మీటింగ్ బెడ్తయి. గా మీటింగ్‌కు అన్ని తీర్ల గల్లి కుక్కలు వొస్తయి. భౌ భౌ మనుకుంట విష్ చేసుకుంటాయి. తోకలూపుకుంట కౌగిలిచ్చుకుంటయి'' అని సత్నారి ఇంకేమొ జెప్పబోతుంటె ఇస్తారి అడ్డం దల్గి – ''గవి ఏం మాట్లాడుకుంటయో జెప్పు'' అని అన్నడు.

''ముందుగాల కుక్కలన్నిటిని కూసోమని కుక్కల లీడర్ జెప్పింది. కుక్కలన్ని గూసున్నంక కుక్కల లీడర్ స్పీచ్ షురువు జేసిండు. ఐదు పది కుక్కలు మన్సులను గర్సె తల్కె పుజూల్ల అన్ని కుక్కలను బద్నాం జేస్తున్నరు. యానిమల్ బర్త్ కంట్రోల్ జేస్తమంటున్నరు. గిదేమన్న బాగున్నదా'' అని ఇంకేమొ మాట్లాడబోతుంటే –

''మన కుక్కలు కర్వ బట్కె పట్నంల ఒక పిల్లగాడు సచ్చిపోయిండు గదా'' అని ఒక కుక్క అన్నది.

''కుక్క కాటుకు పిల్లగాడు సచ్చిపోయినందుకు మీ అందరి దిక్కు కెల్లి సంతాపం తెలియజేస్తున్న. మన్సుల కన్న మనమే మంచోల్లం. ఎవలన్న మనలను పెంచుకుంటె దినాం నాత్రి గాల్ల ఇల్లు కావలి గాస్తం. పోలీ సోల్లకు శాతగాని పనులు గూడ మనం జేస్తం. కుక్క కాటు కుక్క కాటు అనుకుంట మనలను పుజూల్గ బద్నాం జేస్తున్నరు. లీడర్ల కాటు గురించి ఎవలు మాట్లాడ్త లేరు. లీడర్ల కాటుకు ఎంతమంది సస్తున్నరో జెప్త లేరు. కుక్కలు మొరుగుతున్నయంటున్నరు. గని పార్టీల లీడర్లు ఒకల్లను జూసి ఒకలు ఏ తీర్గ మొర్గు తున్నరో ఎవ్వలకు ఎర్క లేదనుకుంటున్నరు. కుక్క తోక వొంకర అంటున్నరు. మన తోకనే వొంకర. గని మన్సుల బుద్దులే వొంకర. కనకపు సింహాసనమున శునకము గూర్చుండ బెట్టి అనుకుంట వెనుకటి గుణమేల మాను అని మనమీద పద్దెం రాసింండ్రు. గని కుర్సిల మీద గూసున్న లీడర్లు గాల్ల వెనకటి గుణం మానిండ్రా అని కుక్క లీడర్ అడిగింది'' అని సత్నారి అన్నడు.

తొమ్మిది గొట్టెదాంక గీ తీర్గ మా దోస్తులు ముచ్చట బెట్టింండ్రు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ | 99591 50491

## యాదాద్రిలో వైభవంగా శ్రీచక్ర తీర్థం



విష్ణు పుష్కరిణిలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ విగ్రహానికి స్నాన ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలో నిత్య పూజలను నిర్వహించిన ఆచార్యులు ప్రథమ ప్రాకారంలోని ఉత్తర దిశలో ఏర్పాటు చేసిన యాగశాలలో మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం శ్రీచక్ర ఆళ్వారుడికి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి, ఆలయ మాడ వీధుల్లో ఊరేగించాక విష్ణు పుష్కరిణిలో శ్రీచక్ర తీర్థ స్నానం చేపట్టారు. రాత్రి ఆలయంలో శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవాలను ఆగమశాస్త్ర ప్రకారం జరిపించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో ఉదయం అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రి శృంగార డోలోత్సవం నిర్వహిస్తారు.

## మంగళవారం.. మహిళల కోసమే!

- ఆ రోజు 1,200 ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలు
- వ్యాధుల గుర్తింపు, చికిత్స, మందుల పంపిణీ
- ముందుగా ఈ నెల 8న వంద ఆసుపత్రుల్లో ప్రారంభం

**సాక్షి, హైదరాబాద్:** ఆమె ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ప్రతి మంగళవారం 1,200 ఆసుపత్రుల్లో సమగ్ర మహిళా ఆరోగ్య క్లినిక్‌లు తెరవాలని వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయించింది. మహిళా దినోత్సవం పురస్కరించుకొని ముందుగా ఈ నెల 8న హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లోని వంద ఆసుపత్రుల్లో ప్రారంభిస్తారు. తదుపరి వాటిని ఇతర జిల్లాలకు పూర్తిస్థాయిలో విస్తరిస్తారు. పరీక్షించిన మహిళలకు అక్కడికక్కడే మందులు పంపిణీ చేస్తారు. చికిత్సలు అవసరమైన వారికి హైస్థాయి ఆసుపత్రులకు పంపిస్తారు. ఆయా రిఫరల్ ఆసుపత్రుల వద్ద హెల్ప్ డెస్క్ పని చేస్తుందని వైద్య, ఆరోగ్యశాఖ వెల్లడించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) మొదలు బోధనాస్పత్రుల వరకు అన్ని చోట్లా ప్రత్యేకంగా మంగళవారం మహిళలకు వైద్యం అందిస్తారు. వ్యాధులను ముందుగానే గుర్తించి, సరైన చికిత్స అందించడం ద్వారా అనారోగ్యం బారి నుంచి కాపాడవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఆరోగ్య సమస్యలపై పెద్దఎత్తున అవగాహన కల్పించడం, చికిత్స అందించడం వంటివి చేపడతారు.

## 'గండ్ర'ల నిర్బంధం

- ఇద్దరూ హౌస్ అరెస్ట్
- పోలీసుల అదుపులో 217 మంది నాయకులు
- భూపాలపల్లి జిల్లాలో కొనసాగుతున్న ఉద్రిక్తత

**భూపాలపల్లి:** బీఆర్‌ఎస్ నేత, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు గండ్ర సత్యనారాయణరావు సవాళ్లతో భూపాలపల్లి రణరంగంగా మారింది. గురువారం ఉదయం 11 గంటలకు బహిరంగ చర్చకు ఇరు పార్టీలూ సవాళ్లు విసురుకోవడంతో జిల్లా కేంద్రంలో 144 సెక్షన్ విధించారు. తెల్లవారుజామునే ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో, కాంగ్రెస్ నేత సత్యనారాయణరావును హనుమకొండలోని ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. ఇరువురు నేతలూ బయటకు వచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ పోలీసులు అంగీకరించలేదు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని పోలీసులకు తోడుగా స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ బలగాలను భూపాలపల్లికి రప్పించారు. ఇక ఇరు పార్టీలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. అయినప్పటికీ పోలీసుల కన్నుగప్పి ఇరు పార్టీల అభిమానులు అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకుని పోటా పోటీగా నినాదాలు చేయడం ప్రారంభించారు. అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. ఇక నియోజకవర్గంలోని మండల కేంద్రాలు, గ్రామాల్లోని కార్యకర్తలూ తమ ప్రత్యర్థి పార్టీలకు చెందిన నేతల దిష్టిబొమ్మలను దహనం చేశారు. పోలీసులు ఎక్కడికక్కడ ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 140 మంది బీఆర్ఎస్, 77మంది కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేశారు.

## ప్రీతి ఘటనలో హెచ్‌ఓడీ నాగార్జునరెడ్డిపై వేటు

- భూపాలపల్లి మెడికల్ కళాశాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు

**సాక్షి, వరంగల్/ఎంజీఎం:** పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి మృతి నేపథ్యంలో హెచ్‌ఓడీ డాక్టర్ నాగార్జునరెడ్డిపై చర్యలు తీసుకోవాలన్న ఆమె కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల డిమాండ్ మేరకు ప్రభుత్వం గురువారం శాఖాపరమైన చర్యలు చేపట్టింది. ఈ మేరకు ప్రభుత్వం ప్రస్తుతం ఎంజీఎం ఆస్పత్రిలో అనస్తీషియా హెచ్‌ఓడీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ నాగార్జునరెడ్డిని భూపాలపల్లి మెడికల్ కళాశాలకు అనస్తీషియా ప్రొఫెసర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

### పోలీసు కస్టడీలోకి సైఫ్

ప్రీతి మృతి కేసులో నిందితుడైన ఎంఏ.సైఫ్‌ను మట్టెవాడ పోలీసులు గురువారం కస్టడీలోకి తీసుకున్నారు. ఖమ్మం జైలులో ఉన్న నిందితుడిని వరంగల్‌లోని మట్టెవాడ ఠాణాకు తీసుకొచ్చారు. ప్రీతి ఘటనకు దారి తీసిన పరిస్థితులపై ఆరా తీశారు. కౌన్సెలింగ్ తర్వాత మళ్లీ ప్రీతిని ఏమైనా కలవడం జరిగిందా.. బెదిరించారా.. అన్న కోణంలోనూ వివరాలు రాబట్టే ప్రయత్నం చేశారు. ప్రీతిని వేధించడంలో సైఫ్‌కు ఇంకా ఎవరైనా సహకరించారా.. అన్న కోణంలోనూ అడిగి తెలుసుకున్నారు. ఆదివారం వరకు కస్టడీ ఉండడంతో కూలంకుషంగా అన్ని విషయాలు రాబట్టడంపై పోలీసులు దృష్టి సారించి విచారణ చేస్తున్నారు. గత నెల 22న ఎంజీఎంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న ప్రీతి నిమ్స్‌లో చికిత్సపొందుతూ గత ఆదివారం మృతి చెందిన సంగతి తెలిసిందే.

## మా అక్కది హత్యే.. నాగార్జునరెడ్డిని సస్పెండ్ చేయాలి

- ప్రీతి సోదరుడు ధరావత్ వంశీ



**కొడకండ్ల:** తన సోదరి ధరావత్ ప్రీతి మృతిపై పారదర్శకంగా విచారణ జరిపి తమ కుటుంబానికి న్యాయం చేయాలని ప్రీతి సోదరుడు ధరావత్ వంశీ(పృథ్వీ) డిమాండ్ చేశారు. ప్రీతి మృతిపై జరుగుతున్న విచారణ పట్ల అనుమానాలు వ్యక్తం చేశాడు. జనగామ జిల్లా కొడకండ్ల మండలం గిర్నితండాలో గురువారం ఆయన మాట్లాడుతూ మా అక్కది హత్య అనడానికి తమ వద్ద ఆధారాలున్నాయని, గూగుల్‌లో డ్రగ్స్ గురించి సెర్చ్ చేసిందనడానికి ఏం ఆధారాలున్నాయో చెప్పాలని ప్రశ్నించారు. ముగ్గురు డాక్టర్లను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చామని చెబుతున్నారని ఇది అవాస్తవమని, కౌన్సెలింగ్ చేసినట్లయితే మా అక్క తమతో చెప్పేదని, ఫోన్ ఆధారాలున్నాయని చెప్పారు సైఫ్ మా అక్కకు రెస్ట్ లెస్ డ్యూటీలు వేయాలని తోటి డాక్టర్లకు చెప్పాడని పేర్కొన్నారు. నాగార్జునరెడ్డిని సస్పెండ్ చేసి ప్రీతి ఘటనపై పారదర్శకంగా విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## పోస్ట్ కోవిడ్‌తో యువతలో గుండెపోటు!

### ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని వైద్య ఆరోగ్యశాఖ సూచనలు

- బీపీ, షుగర్ నిరంతరం చెక్ చేయించుకోవాలి
- కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి
- పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి
- జంక్, ఫాస్ట్‌పుడ్‌కు దూరంగా ఉండాలి
- రోజుకు 30 నిమిషాల నుంచి గంటపాటు వ్యాయామం చేయాలి
- తగినంత నిద్ర, ఒత్తిడి నియంత్రణ తప్పనిసరి
- ప్రత్యేక అడ్వైజరీని విడుదల చేసిన డీహెచ్ శ్రీనివాసరావు



**సాక్షి, హైదరాబాద్:** ఇటీవల యువత, మధ్య వయస్సు వారిలో గుండెపోటు సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. జిమ్ చేస్తూ కొందరు, సాధారణ పనుల్లో ఉంటూనే మరికొందరు గుండెపోటుతో కుప్పకూలిపోయి అకాల మరణాల పాలవుతున్నారు. కొందరిలో కోవిడ్ సోకి తగ్గిన తర్వాత (పోస్ట్ కోవిడ్) ఏర్పడుతున్న ఆరోగ్య సమస్యలు ఇలా గుండెపోటు మరణాలకు కారణం అవుతున్నాయని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. ఈ నేపథ్యంలో యువకుల్లో గుండెపోట్లను నివారించడానికి ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు గురువారం ఒక అడ్వైజరీ (సలహాలు, సూచనల నివేదిక)ను విడుదల చేశారు. కొందరు కోవిడ్ సోకి కోలుకున్నా కూడా.. వైరస్ ప్రభావం వల్ల ఎండోథెలియం (గుండె రక్తనాళాల్లోని లోపలి పొర)లో మార్పులు జరుగుతున్నాయని తెలిపారు. యువతీ యువకుల ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా దీన్ని వెంటనే గుర్తించలేకపోతారని.. దీనితో ఒక్కోసారి అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మరణాలు సంభవిస్తున్నాయని విశ్లేషించారు.

### పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ విడుదల చేసిన అడ్వైజరీ ఇదీ..

- యువతీ యువకులు కూడా నిర్ణీత కాలంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. 18 ఏళ్లు దాటినవారు కనీసం రెండేళ్లకోసారి బీపీ పరీక్షలు చేయించుకోవాలి. 18–39 మధ్య వయసు వారు ఏడాదికోసారి, 40 ఏళ్లు దాటినవారు తరచూ బీపీ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి.
- 20 ఏళ్ల వయసు నుంచే రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలను చెక్ చేసుకుంటూ ఉండాలి. దీని వల్ల గుండె జబ్బుల సమస్యను ముందుగా గుర్తించడానికి వీలవుతుంది. పెద్దలు కనీసం నాలుగు నుంచి ఆరు నెలలకోసారి కొలెస్ట్రాల్ పరీక్ష చేయించుకోవాలి.
- గుండె జబ్బులకు ప్రధాన కారణాల్లో మధుమేహం (షుగర్) ఒకటి. కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా షుగర్ ఉంటే, ముందస్తుగానే షుగర్ పరీక్షలు చేయించుకోవడం మంచిది.
- గుండె ఆరోగ్యంగా ఉండాలంటే.. పండ్లు, బీన్స్, ఇతర చిక్కుళ్ల వంటి కూరగాయలు, చేపలు, తక్కువ కొవ్వు లేదా కొవ్వు రహిత పాల ఉత్పత్తులు, తృణధాన్యాలు, ఒమేగా ఫ్యాటీ యాసిడ్లు కలిగిన పదార్థాలు తీసుకోవాలి.
- ఎక్కువ ఉప్పు, చక్కెర ఉండేవి, ప్రాసెస్ చేసిన కార్బోహైడ్రేట్ ఆహారాలు, ఆల్కహాల్, మాంసం, కొవ్వు, పాల ఉత్పత్తులు, వేయించిన ఫాస్ట్ ఫుడ్, చిప్స్, కాల్చిన ఆహారం వంటివాటికి దూరంగా ఉండాలి.
- రోజూ కనీసం 30 నిమిషాల నుంచి 60 నిమిషాల వరకు వ్యాయామం చేయాలి. మొత్తంగా వారానికి కనీసం 150 నిమిషాలు మితమైన ఏరోబిక్ వ్యాయామం చేయాలి. లేదా వారానికి 75 నిమిషాలు రన్నింగ్ వంటి శ్రమతోకూడిన ఏరోబిక్ వ్యాయామాలు చేయాలి.
- ఎత్తుకు తగ్గ శారీరక బరువు ఉండేలా చూసుకోవాలి. 3% నుండి 5% వరకు బరువు తగ్గడం వల్ల రక్తంలో కొన్ని కొవ్వులు (ట్రైగ్లిజరైడ్స్), రక్తంలో చక్కెర (గ్లూకోజ్) తగ్గడం, టైప్–2 డయాబెటీస్ ప్రమాదాన్ని తగ్గించడానికి తోడ్పడుతుంది.
- ఏ వయసు వారైనా కంటి నిండా నిద్రపోవాలి. పెద్దలకు రాత్రిపూట కనీసం ఏడు గంటల నిద్ర అవసరం. ప్రతిరోజూ ఒకే సమయాల్లో పడుకోవడం, మేల్కోవడం చేయాలి. పడకగది చీకటిగా, నిశ్శబ్దంగా ఉండేలా చూసుకోవాలి. తద్వారా తగినంత నిద్రపోవడం సాధ్యమవుతుంది.
- మానసిక ఒత్తిడిని నియంత్రణలో ఉంచుకోవాలి. శారీరక శ్రమ, ధ్యానం వంటివి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంలో సాయపడతాయి.
- ధూమపానం లేదా పొగాకు వాడకాన్ని నిలిపివేయాలి. ఏళ్లుగా వీటి అలవాటు ఉన్నవారు కూడా.. ఇప్పుడు మానేసినా గుండె జబ్బు ప్రమాదం సగం తగ్గుతుంది.

### జిల్లాల్లో సీపీఆర్‌పై శిక్షణ

- గుండె మరణాల నియంత్రణకు సర్కారు నిర్ణయం
- ప్రతీ జిల్లాకు 4 నుంచి ఏడుగురు మాస్టర్ ట్రైనర్లు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యాచరణ

**సాక్షి, హైదరాబాద్:** ఆకస్మిక గుండెపోటు సంఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో బాధితుల ప్రాణాలు కాపాడటంపై వైద్య ఆరోగ్యశాఖ దృష్టి సారించింది. అన్ని జిల్లాల్లోనూ కార్డియో–పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్), ఆటోమేటిక్ ఎక్స్‌టర్నల్ డీఫిబ్రిలేటర్ (ఏఈడీ)లపై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. అందుకోసం ప్రతీ జిల్లాకు 4 నుంచి ఏడుగురు మాస్టర్ ట్రైనర్లను పంపించనుంది. ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలు, మున్సిపల్ ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, కమ్యూనిటీ వాలంటీర్లు, షాపింగ్ మాల్స్ ఉద్యోగులు, పెద్ద కాంప్లెక్స్‌ల్లో ఉండేవారికి సీపీఆర్, ఏఈడీలపై శిక్షణ ఇస్తారు. అదేవిధంగా 108 సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు అందరికీ సీపీఆర్‌లో శిక్షణ ఇస్తామని వైద్యారోగ్య శాఖ తెలిపింది. ఇప్పటికే 160 మంది మాస్టర్ ట్రైనర్లు హైదరాబాద్‌లో సీపీఆర్‌లో శిక్షణ పొందారు. ప్రతి మాస్టర్ ట్రైనర్ ఒక్కో బ్యాచ్‌కు 20 మంది లేదా రోజుకు 60 మంది లేదా వారానికి 300 మందికి శిక్షణ ఇస్తారు. మనిషిని పోలిన బొమ్మలపై శిక్షణ ఇస్తారు. శిక్షణ పొందిన వాలంటీర్లకు సర్టిఫికెట్ ఇస్తారు. అందుకోసం శిక్షణ కార్యాచరణ ప్రణాళికను వైద్య ఆరోగ్యశాఖ సిద్ధం చేసింది.కలెక్టర్ల కార్యాలయాల్లో ప్రజా ప్రతినిధుల సమక్షంలో అన్ని జిల్లాల్లో సీపీఆర్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు. ఎవరైనా ఆకస్మిక గుండెపోటుకు గురైనప్పుడు సమీపంలో ఉన్న వారు వెంటనే సీపీఆర్ చేస్తే గుండె తిరిగి కొట్టుకునేందుకు, తద్వారా ప్రాణాలు కాపాడేందుకు అవకాశం ఉంటుంది.











## సాక్షి ఉద్యోగ అవకాశాలు



కార్యకర్తలు అందించిన నిమ్మకాయల దండతో త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా

# ఈశాన్యంలో కమల వికాసం

## మూడు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు విడుదల

బీజేపీ 'మిషన్ నార్త్‌ఈస్ట్'కు బూస్ట్

త్రిపురలో సొంతంగానే స్పష్టమైన మెజార్టీ

నాగాలాండ్‌లో ఎన్‌డీపీపీ–బీజేపీ కూటమికే మళ్లీ అధికారం

మేఘాలయలో 2 సీట్లతో కింగ్‌మేకర్‌గా కమలం పార్టీ

ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం

అగర్తలా/షిల్లాంగ్/కోహిమా: 'మిషన్ నార్త్‌ఈస్ట్' పేరిట ఈశాన్య రాష్ట్రాల్లో జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పెట్టుకున్న భారతీయ జనతా పార్టీకి నూతనోత్తేజం లభించింది. ఈశాన్య భారతంలో కమలం వికసించింది. త్రిపుర, నాగాలాండ్, మేఘాలయా శాసనసభ ఎన్నికల ఫలితాలు గురువారం వెలువడ్డాయి. త్రిపురలో బీజేపీకి సంపూర్ణ మెజార్టీ దక్కింది. 60 స్థానాలకు గాను సొంతంగా 32 స్థానాలు గెలుకొని, ఒక్కే ఒక్క స్థానంలో నెగ్గిన మిత్రపక్షం ఐపీఎఫ్‌టీతో కలిసి వరుసగా రెండోసారి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతోంది. నాగాలాండ్‌లో 60 అసెంబ్లీ స్థానాలుండగా, నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ(ఎన్‌డీపీపీ)–బీజేపీ కూటమి 37 స్థానాల్లో పాగా వేసింది. ఎన్‌డీపీపీకి 25, బీజేపీకి 12 సీట్లు లభించాయి. రెండు పార్టీలు కలిసి మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నాయి. 60 స్థానాలున్న మేఘాలయాలో ఒంటరిగా పోటీకి దిగి, కేవలం 2 సీట్లే గెలుచుకున్న బీజేపీ కింగ్‌మేకర్‌గా అవతరిస్తుండడం గమనార్హం. 26 సీట్లలో నెగ్గిన అధికార నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) బీజేపీ మద్దతుతో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. ప్రభుత్వంలో బీజేపీ మళ్లీ జూనియర్ భాగస్వామిగా చేరినా ఆశ్చర్యం లేదని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. మరోవైపు ఈ ఎన్నికల ఫలితాలు ప్రతిపక్ష కాంగ్రెస్‌కు చేదు అనుభవాన్నే మిగిల్చాయి. నాగాలాండ్‌లో 5, త్రిపురలో 3 సీట్లు గెలుచుకున్న ఆ పార్టీ మేఘాలయాలో సున్నా చుట్టేసింది. త్రిపురలో కొత్త పార్టీ తిప్రా మోథా ఏకంగా 13 సీట్లు తన ఖాతాలో వేసుకుంది.



మేఘాలయ సీఎం కాన్రాడ్ సంగ్మా విజయోత్సాహం

### త్రివేణికే ఈ మొత్తం క్రెడిట్: మోదీ

ఎన్నికల్లో బీజేపీ స్థిరంగా విజయాలు సాధిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. మేఘాలయా, నాగాలాండ్, త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఆయన స్పందించారు. గురువారం పార్టీ ప్రధాన కార్యాలయంలో నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. మూడు రాష్ట్రాల్లో పార్టీ పనితీరు పట్ల కార్యకర్తలకు అభినందనలు తెలియజేశారు. బీజేపీ గెలుపునకు గాను క్రెడిట్ మొత్తం 'త్రివేణి'కే ఇవ్వాలన్నారు. బీజేపీ ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి పనులు, ఆయా ప్రభుత్వాల పని సంస్కృతి, పార్టీ కార్యకర్తల అంకితభావం వల్లే విజయాలు లభిస్తున్నాయని స్పష్టం చేశారు. ఈశాన్య ప్రాంతం ఢిల్లీకి, దిల్(హృదయం)కి ఎక్కువ దూరంలో లేదన్న సంగతి ఈ ఫలితాలను బట్టి తెలుస్తోందన్నారు. త్రిపుర, నాగాలాండ్‌లో బీజేపీ కూటమి మళ్లీ అధికారం దక్కించుకోవడం పార్టీ కార్యకర్తలందరికీ గర్వకారణమని మోదీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. మర్ జా మోదీ(చనిపో మోదీ) అని ప్రతిపక్షాలు కోరుకుంటున్నాయని, ప్రజలు మాత్రం మత్ జా మోదీ(వెళ్లొద్దు మోదీ) అని నినదిస్తున్నారని ప్రధాని స్పష్టం చేశారు.

**ఫలితాలు నిరుత్సాహకరం:కాంగ్రెస్**


త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ అసెంబ్లీల ఎన్నికల ఫలితాలు నిరుత్సాహం కలిగించాయని కాంగ్రెస్ పేర్కొంది. అయితే, ఉప ఎన్నికల్లో మూడు అసెంబ్లీ సీట్లలో సాధించిన విజయం ప్రోత్సాహం నింపిందని తెలిపింది. ఈ ఫలితాలపై సమీక్ష జరిపి, పార్టీ సంస్థాగత బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు.

## త్రిపురలో కాషాయం రెపరెపలు

త్రిపురలో బీజేపీ–స్థానిక పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర(ఐపీఎఫ్‌టీ) కూటమి రెండోసారి అధికారం దక్కించుకుంది. మొత్తం 60 సీట్లకు గాను ఎన్నికల్లో 33 సీట్లు గెలుచుకుంది. ప్రద్యోత్ కిశోర్ దేబ్‌వర్మ నేతృత్వంలోని తిప్రా మోథా పార్టీ 13 స్థానాలు గెలుచుకుంది. ఇక వామపక్షాలు–కాంగ్రెస్ కూటమికి 14 స్థానాలు లభించాయి. 28 స్థానాల్లో పోటీ చేసిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కనీసం ఖాతా తెరవలేక చతికిలపడింది. ఆ పార్టీకి కేవలం 0.88 శాతం ఓట్లు లభించాయి. 'నోటా' కంటే తక్కువ ఓట్లు పడడం గమనార్హం. బీజేపీ, ఐపీఎఫ్‌టీకి 2018తో పోలిస్తే ఈసారి సీట్ల సంఖ్య తగ్గింది. తిప్రా మోథా పార్టీ గణనీయంగా పుంజుకోవడమే ఇందుకు కారణం. ఈసారి 55 స్థానాల్లో పోటీకి దిగిన బీజేపీకి 32 స్థానాలు గెలుచుకుంది. ఐపీఎఫ్‌టీకి కేవలం ఒక స్థానం లభించింది. 47 సీట్లలో పోటీ చేసిన సీపీఎం కేవలం 11 సీట్లను తన ఖాతాలో వేసుకుంది. ఫార్వర్డ్ బ్లాక్, సీపీఐ, ఆర్‌ఎస్పీకి ఒక్క సీటు కూడా దక్కలేదు. కాంగ్రెస్ పార్టీ టిక్కెట్‌పై 13 మంది పోటీ చేయగా, ముగ్గురు విజయం సాధించారు. టౌన్ బార్డోవాలీ స్థానంలో పోటీ చేసిన మాణిక్ సాహా తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి ఆశిష్‌కుమార్ సాహాపై 1,257 ఓట్ల తేడాతో గెలుపొందారు.


**మిస్టర్ క్లీన్‌కే మళ్లీ కిరీటం!**

త్రిపురలో మిస్టర్ క్లీన్‌గా గుర్తింపు పొందిన సాహా వరుసగా రెండోసారి ముఖ్యమంత్రిగా గద్దెనెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. 10 నెలల క్రితం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని విజయపథంలో నడిపించారు. దంత వైద్యుడైన సాహా గతంలో కాంగ్రెస్‌లో పనిచేశారు. 2016లో బీజేపీలో చేరారు. 2020లో త్రిపుర బీజేపీ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టారు. 2022 ఏప్రిల్ 3 నుంచి జూలై 4 దాకా రాజ్యసభ సభ్యుడిగా సేవలందించారు. గత ఏడాది జరిగిన టౌన్ బార్డోవాలీ నియోజకవర్గం ఉప ఎన్నికలో ఎమ్మెల్యేగా గెలిచారు. బీజేపీ విప్లవ్ దేవ్ స్థానంలో ఆయనను సీఎంగా నియమించింది. మాణిక్ సాహా నిజాతీయపరుడిగా, కష్టపడి పనిచేసే నాయకుడిగా ప్రజల మనసులు గెలుచుకున్నారు.




## నాగాలాండ్‌లో ఎన్‌డీపీపీ–బీజేపీ హవా

నాగాలాండ్‌లో అధికార నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ(ఎన్‌డీపీపీ)–బీజేపీ కూటమి మళ్లీ అధికార పీఠం దక్కించుకుంది. 60 స్థానాలున్న అసెంబ్లీలో 37 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. కూటమిలోని ఎన్‌డీపీపీకి 25, బీజేపీకి 12 సీట్లు దక్కాయి. ఇతర పార్టీలేవీ రెండంకెల సీట్లు సాధించలేకపోయాయి. ఎన్సీపీ 7, నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) 5 సీట్లు గెలుచుకున్నాయి. ఎల్‌జేపీ(రామ్‌విలాస్ పాశ్వాన్) 2, ఆర్‌పీఐ(అథవాలే) 2, ఎన్‌పీఎఫ్ 2 సీట్లలో గెలుపొందాయి. జేడీ(యూ) ఒక స్థానంలో విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీకి ఒక్కటంటే ఒక్కటి కూడా దక్కలేదు. నలుగురు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన అన్ని పార్టీల అభ్యర్థులకు ఎన్‌డీపీపీ నేత, సీఎం రియో అభినందనలు తెలిపారు.





**చరిత్ర సృష్టించిన మహిళా ఎమ్మెల్యేలు**

60 ఏళ్ల నాగాలాండ్ చరిత్రలో తొలిసారిగా ఇద్దరు మహిళలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అధికార ఎన్‌డీపీపీ టిక్కెట్‌పై పశ్చిమ అంగామీ స్థానం నుంచి హెకాని జకాలు, దిమాపూర్–3 స్థానం నుంచి సల్‌హోటనో క్రుసె విజయం సాధించారు. వారిద్దరూ సిట్టింగ్ ఎమ్మెల్యేలను ఓడించడం విశేషం.

★ వీరిపై ప్రత్యేక కథనం ఫ్యామిలీలో..

## మేఘాలయలో హంగ్!

మేఘాలయ శాసనసభ ఎన్నికల్లో ఓటర్లు ఏ పార్టీకీ స్పష్టమైన తీర్పు ఇవ్వలేదు. రాష్ట్రంలో హంగ్ పరిస్థితులు నెలకొన్నాయి. మేఘలయలో మొత్తం 60 అసెంబ్లీ స్థానాలుండగా, 59 స్థానాల్లో ఎన్నికలు నిర్వహించారు. సోహియోంగ్ నియోజకవర్గంలో యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ(యూడీపీ) అభ్యర్థి డొంకుపర్ రాయ్ లింగ్డో ఫిబ్రవరి 20న మృతిచెందడంతో పోలింగ్ వాయిదా పడింది. ఈ ఎన్నికల్లో 26 సీట్లు గెలుచుకున్న అధికార నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) అతిపెద్ద పార్టీగా అవతరించింది. మెజార్టీకి కొద్దిదూరంలోనే ఆగిపోయింది. కాన్రాడ్ సంగ్మా ప్రభుత్వంలో ఎన్‌పీపీ మిత్రపక్షంగా వ్యవహరించిన యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ(యూడీపీ) 11 స్థానాల్లో నెగ్గింది. కాంగ్రెస్ 5, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ 5 సీట్లు గెలుచుకున్నాయి. ఒంటరిగా పోటీ చేసిన జాతీయ పార్టీ బీజేపీ కేవలం రెండు సీట్లకే పరిమితమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, బీజేపీ అధినేత జేపీ నడ్డా వంటి అగ్రనేతలు ప్రచారంలో పాల్గొనప్పటికీ ఆశించిన ఫలితందక్కలేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఎన్‌పీపీ నేత, ముఖ్యమంత్రి కాన్రాడ్ కే సంగ్మా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మద్దతును కోరుతున్నారని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ వ్యాఖ్యానించడం ఆసక్తికరంగా మారింది. మేఘాలయలో ప్రభుత్వ ఏర్పాటుకు ఎన్‌పీపీకి సహకరించాలంటూ తమ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సూచించారని హిమంత బిశ్వ శర్మ వ్యాఖ్యానించారు. నూతన ప్రభుత్వ ఏర్పాటుకు వీలుగా ఎన్‌పీపీకి మద్దతు తెలియజేస్తూ లేఖ ఇవ్వబోతున్నామని మేఘాలయ బీజేపీ అధ్యక్షుడు ఎర్నెస్ట్ మారీ చెప్పారు. ముఖ్యమంత్రి సంగ్మా దక్షిణ తురా స్థానంలో గెలిచారు.




# త్రిసభ్య కమిటీ సిఫార్సుతోనే..

**ఎన్నికల కమిషనర్ల నియామకంపై సుప్రీం**

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ), ఎన్నికల కమిషనర్(ఈసీ)ల నియామకాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన వ్యక్తులను నియమిస్తోందనే తీవ్ర ఆరోపణల నడుమ సర్వోన్నత న్యాయస్థానం సంచలనాత్మక తీర్పును వెలువరిచింది. ఇన్నాళ్లూ కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు ఎన్నికల సంఘంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఎలక్షన్ కమిషనర్లను రాష్ట్రపతి నియమిస్తున్నారు. ఇకపై ఈ వ్యవస్థను రద్దుచేస్తున్నట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది. ప్రధాన మంత్రి, లోక్‌సభలో విపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉండే త్రిసభ్య కమిటీ సిఫార్సు మేరకు రాష్ట్రపతి కేంద్ర ఎన్నికల సంఘంలో నియామకాలు జరపాలని జస్టిస్ కేఎం జోసెఫ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం చరిత్రాత్మక తీర్పు చెప్పింది.

**అది ప్రజాస్వామ్యానికి సమాధి కడుతుంది**

'శక్తివంతమైన తుపాకీ కంటే బ్యాలెట్ మరింత శక్తిమయం. ఎన్నికల ప్రక్రియ అతిగా దుర్వినియోగానికి గురైందంటే అది చివరకు ప్రజాస్వామ్యానికి




సమాధి కడుతుంది. అధికారం ముందు సాగిలపడే వ్యక్తి ఎన్నికల కమిషనర్‌గా ఎన్నికకాకూడదు. ఇంకొకరి ఆదేశాలను శిరసావహించే వ్యక్తి ప్రజాస్వామ్య తలరాతను మార్చే హోదాలో ఉండకూడదు. ఎన్నికల ప్రక్రియ స్వతంత్రతను మరింతగా ఇనుమడింపజేసేందుకే ఈ ఆదేశాలు ఇస్తున్నాం. స్వచ్ఛత తగ్గిపోతే వినాశక పరిణామాలు సంభవిస్తాయి. పార్లమెంట్‌లో కొత్త చట్టం వచ్చేవరకు నూతన నియామక ప్రక్రియ అమలులో ఉంటుంది' అని ధర్మాసనం పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఇన్నాళ్లూ కేంద్రప్రభుత్వం రాష్ట్రపతికి కొత్త సీఈసీ, ఈసీల కోసం సిఫార్సుచేసేది. సిఫార్సులమేరకు రాష్ట్రపతి వారిని నియమించేవారు. ఇకపై కొత్త ప్రక్రియ ప్రకారం లోక్‌సభలో విపక్షనేత లేని సందర్భంలో లోక్‌సభలో సంఖ్యాపరంగా అతిపెద్ద విపక్ష పార్టీ నేత త్రిసభ్య కమిటీలో సభ్యునిగా ఉంటారు. సీఈసీ, ఈసీల నియామకం కోసం కొలీజియం తరహా వ్యవస్థను ఏర్పాటు చేయాలంటూ పలు పిటిషన్లు సుప్రీంకోర్టులో గతంలో దాఖలైన నేపథ్యంలో వాటిని విచారించిన కోర్టు గురువారం ఈ తీర్పు చెప్పింది. రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ అజయ్ రస్తోగీ, జస్టిస్ అనురుద్ధ బోస్, జస్టిస్ హ్రిషికేశ్ రాయ్, జస్టిస్ సీటీ రవికుమార్‌లు సభ్యులుగా ఉన్నారు.

**తీర్పును స్వాగతించిన విపక్షాలు**

'ప్రభుత్వ ప్రమేయం, ప్రభావం బారిన పడకుండా ఈసీని కాపాడుతూ ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు కోర్టు తీర్పు బాటలు పరిచింది' అని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. తీర్పును ప్రజాస్వామ్యం సాధించిన విజయంగా తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ అభివర్ణించారు. 'ఇంత కాలం ప్రధాని ఎన్నికల ర్యాలీలు, ప్రభుత్వ పథకాల ప్రకటనలకు అనుగుణంగా ఎన్నికల తేదీలను ఈసీ నిర్ణయించేది. ఇకపై ఎన్నికల సంఘంలో ఎవరు ఉంటారనే త్రిసభ్య కమిటీ చూసుకుంటుంది' అని ఆప్ నేత సంజయ్ సింగ్ ఆశాభావం వ్యక్తంచేశారు.

## కాంగ్రెస్‌కు ఊరట

న్యూఢిల్లీ: ఉప ఎన్నికల ఫలితాలు గురువారం కాంగ్రెస్‌కు కాస్త ఊరటనిచ్చాయి. మహారాష్ట్ర, బెంగాల్‌లలో అధికార బీజేపీ, టీఎంసీల సిట్టింగ్ స్థానాలను గెలుచుకున్న కాంగ్రెస్..తమిళనాడులో సిట్టింగ్ సీటును నిలబెట్టుకుంది. పశ్చిమబెంగాల్ అసెంబ్లీలోని సాగర్‌దిఘి స్థానంలో అధికార టీఎంసీ అనూహ్యంగా ఓటమి పాలైంది. ఇక్కడ వామపక్షాల మద్దతుతో బరిలో నిలిచిన కాంగ్రెస్‌కు చెందిన బేరన్ బిశ్వాసం సుమారు 23 వేల ఓట్ల మెజారిటీతో టీఎంసీ అభ్యర్థిపై గెలుపు సాధించారు. ఇక్కడ బీజేపీ మూడో స్థానంలో నిలిచింది. ఈ గెలుపుతో కాంగ్రెస్ పార్టీ ఏకైక ఎమ్మెల్యేతో బెంగాల్ అసెంబ్లీలోకి అడుగుపెట్టనుంది. మహారాష్ట్రలోని కస్బాపేత్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు చెందిన రవీంద్ర దంగేకర్ కాషాయ పార్టీ అభ్యర్థిపై విజయం సాధించారు. బీజేపీ గత 28 ఏళ్లుగా ఈ స్థానాన్ని గెలుచుకుంటూ వస్తోంది. అయితే, ఇదే రాష్ట్రంలోని చించ్‌వాడీ నియోజకవర్గాన్ని బీజేపీ నిలబెట్టుకుంది. తమిళనాడులోని ఈరోడ్ వెస్ట్ సీటుకు జరిగిన ఉప ఎన్నికలో డీఎంకే బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి ఈవీకేఎస్ ఎలంగోవన్ భారీ విజయం సాధించారు. జార్ఖండ్‌లోని రామగఢ్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ మద్దతుతో బరిలో నిలిచిన ఏజేఎస్‌యూ అభ్యర్థి గెలిచారు.

## 'అదానీ'పై సుప్రీం నిపుణుల కమిటీ

న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత దేశంలో 140 బిలియన్ డాలర్లకుపైగా సంపద ఆవిరైన నేపథ్యంలో మదుపర్ల ప్రయోజనాల పరిరక్షణ కోసం సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. అదానీ–హిండెన్‌బర్గ్ వ్యవహారంపై విచారణ జరపడంతోపాటు మదుపర్ల ప్రయోజనాలను కాపాడేలా చర్యలను సిఫార్సు చేయడానికి ఆరుగురు సభ్యులతో నిపుణుల కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే నేతృత్వం వహించే ఈ కమిటీలో ఎస్‌బీఐ మాజీ చైర్మన్ ఓ.పి.భట్, బాంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జె.పి.దేవధర్, బ్రిక్స్ న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు, ఇన్ఫోసిస్ లిమిటెడ్ మాజీ అధినేత కె.వి.కామత్, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) మాజీ అధినేత నందన్ నీలేకని, న్యాయవాది సోమశేఖర్ సుందరేశన్ సభ్యులుగా ఉంటారని తెలియజేసింది. స్టాక్ ధరల్లో అదానీ గ్రూప్ అవకతవకలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై కొనసాగిస్తున్న విచారణను రెండు నెలల్లోగా పూర్తి చేసి, నివేదికను సీల్డ్ కవర్‌లో సమర్పించాలని సెబీని ఆదేశించింది. హిండెన్‌బర్గ్ నివేదిక, అదానీ గ్రూప్ అక్రమాలపై దాఖలైన వివిధ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దివాలాల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల వల్ల మదుపరులు భారీగా నష్టపోయారని, మార్కెట్ ఒడిదొడుకుల కారణంగా వారు నష్టపోకుండా నియంత్రణ సంస్థలను బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించడానికి ఆరుగురు సభ్యులతో నిపుణుల కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. పెట్టుబడిదారులను చైతన్యవంతంచేయడానికి చేపట్టాల్సిన చర్యలను సైతం సిఫార్సు చేయాలని కమిటీకి స్పష్టంచేసింది. కమిటీ సభ్యులకు గౌరవ వేతనం చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అదానీ గ్రూప్ వ్యవహారాలపై దర్యాప్తునకు కమిటీని నియమించడానికి తమకు అభ్యంతరం లేదంటూ గత విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను సుప్రీంకోర్టు ధర్మాసనం తిరస్కరించినసంగతి తెలిసిందే. కేసు దర్యాప్తు పూర్తి పారదర్శకంగా జరగాలని కోరుకుంటున్నామని, తామే నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామని ధర్మాసనం ఇప్పటికే తేల్చిచెప్పింది. కాగా, కోర్టు నిర్ణయంపై గౌతమ్ అదానీ స్పందించారు. నిర్దిష్ట గడువులోగా ఈ వ్యవహారమంతా ఒక కొలిక్కి వస్తుందని భావిస్తున్నామని వెల్లడించారు. సత్యం గెలుస్తుంది అని పేర్కొన్నారు.

## బెదిరిస్తున్నారా ? బయటికెళ్లండి

న్యూఢిల్లీ: న్యాయవాదుల చాంబర్ల కోసం సుప్రీంకోర్టు ప్రాంగణంలోని కొంత స్థలం కేటాయింపు విషయంలో సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్(ఎస్‌సీబీఏ) అధ్యక్షుడు వికాస్ సింగ్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దివాలాల ధర్మాసనం ఎదుట సంబంధిత కేసు విషయమై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ తన వాదనలు వినిపించారు. ' అప్పు ఘర్ స్థలం ఎస్‌ఈబీఏ పిటిషన్ కారణంగానే సుప్రీంకోర్టు చేతికొచ్చింది. కానీ అందులో కేవలం ఒక్క బ్లాక్ మాత్రమే ఎస్‌ఈబీఏ, బార్‌కు కేటాయించారు. సంబంధిత కేసు ఆరునెలలైనా విచారణకు నోచుకోవట్లేదు' అని వికాస్ గట్టిగా మాట్లాడారు. దీంతో సీజేఐ ఆగ్రహంగా.. ' 'సీజేఐనే బెదిరిస్తున్నారా ? ఇలాగేనా ప్రవర్తించేది ? కోర్టు హాల్ నుంచి వెళ్లిపోండి. మార్చి 17న విచారిస్తాం' అని సీజేఐ ఆగ్రహంగా మాట్లాడారు. 2000 మార్చి 29వ తేదీ నుంచి ఇక్కడే ఉన్నాను. 22 ఏళ్లుగా ఇదే వృత్తిలో కొనసాగుతున్నా. ఎప్పుడూ ఇలా ఎవరితో ఇంతగా ఇబ్బంది పడలేదు' అని సీజేఐ వ్యాఖ్యానించారు.

## సరిహద్దులో శాంతిపైనే చర్చ

న్యూఢిల్లీ: జీ20 విదేశాంగ మంత్రుల సమావేశం కోసం ఢిల్లీకి చేరుకున్న చైనా విదేశాంగ మంత్రి క్విన్ గాంగ్‌తో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ భేటీ అయ్యారు. ఇరుదేశాల సరిహద్దు వెంట బలగాల మొహరింపు, ఉద్రిక్తతల నేపథ్యంలో శాంతి నెలకొల్పడంపైనే చర్చలో ప్రధానంగా దృష్టిపెట్టినట్లు జైశంకర్ గురువారం చెప్పారు. ద్వైపాక్షిక భాగస్వామ్యానికి సవాళ్లుగా నిలుస్తున్న సమస్యలు భేటీలో చర్చకొచ్చినట్లు ఆయన ఆ తర్వాత ట్వీట్‌చేశారు. డిసెంబర్‌లో చైనా విదేశాంగ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న క్విన్‌తో జైశంకర్ భేటీ కావడం ఇదే తొలిసారి. జీ20 విదేశాంగ మంత్రుల సమావేశం ఎజెండాపైనా క్విన్‌తో మాట్లాడారు. గతంలో చివరిసారిగా నాటి చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో బాలిలో జీ20 సదస్సు సందర్భంగా జైశంకర్ మాట్లాడారు. తూర్పు లద్దాఖ్‌లో ప్రతిష్టంభనను తొలగించాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు.

# ఏకాభిప్రాయం సాధిద్దాం

## జీ20 విదేశాంగ మంత్రుల భేటీలో ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ: భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు జీ–20లో సహకారంపై ప్రభావం చూపనీయరాదని, ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు ఏకాభిప్రాయానికి రావాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఉక్రెయిన్ సంక్షోభంపై దేశాల మధ్య విభేదాలు పొడచూపిన నేపథ్యంలో గురువారం జీ–20 దేశాల విదేశాంగ మంత్రులకు ఈ మేరకు ఆయన ఒక వీడియో సందేశం పంపారు. 'మహాత్మాగాంధీ, గౌతమబుద్ధుడి నేలపై కలుసుకున్న మీరు, భారతదేశ నాగరికత, తాత్వికతల నుంచి ప్రేరణ పొందాలని, మనల్ని విభజించే వాటిపై కాకుండా, మనల్ని ఐక్యంగా ఉంచే అంశాలపై దృష్టిపెట్టాలి'అని సూచించారు. 'అభివృద్ధి, ఆర్థిక స్థిరత్వం, అంతర్జాతీయ నేరాలు, అవినీతి, ఉగ్రవాదం, ఆహారం, ఇంధన భద్రత'వంటి అంశాల్లో పరిష్కారం కోసం ప్రపంచం జీ–20 వైపు చూస్తోంది. ఈ విషయంలో ఏకాభిప్రాయం సాధించి, ఫలితాలను రాబట్టే సామర్థ్యం జీ–20కి ఉంది'అని ఆయన చెప్పారు. అంతర్జాతీయ సమాజంలో తీవ్ర విభేదాలు తలెత్తిన సమయంలో మనం కలుసుకున్నాం. మన మధ్య జరిగే చర్చలు భౌగోళిక రాజకీయాల ప్రభావం ఉండటం సహజం. అయితే, ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలున్న దేశాల ప్రతినిధులుగా ఇక్కడ లేని వారి పట్ల కూడా మనం బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది'అని ప్రధాని పేర్కొన్నారు.

**వ్యవస్థలు విఫలం**

'గత కొద్ది సంవత్సరాల్లో ఆర్థిక సంక్షోభం, వాతావరణ మార్పులు, కరోనా మహమ్మారి, ఉగ్రవాదం, యుద్ధాలు..వంటి వాటిని ఎదుర్కొన్న విధానం చూస్తే అంతర్జాతీయ వ్యవస్థలు ఎలా దారుణంగా విఫలమయ్యాయో స్పష్టమవుతోంది. ఈ వైఫల్యం విషాదకరకర పరిణామాలను అభివృద్ధి చెందుతున్న దేశాలే ఎక్కువగా ఎదుర్కొన్నాయనే విషయం మనం అంగీకరించాలి. ఏళ్లపాటు సాధించుకున్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు తిరోగమించే ప్రమాదం ఉంది'అని ప్రధాని హెచ్చరించారు. అభివృద్ధి చెందుతున్న చాలా దేశాలు తమ ప్రజానీకానికి ఇంధన, ఆహార భద్రతను అందించే క్రమంలో తీవ్రమైన రుణ భారంతో అవస్థలు పడుతున్నాయన్నారు. ధనిక దేశాల కారణంగా వచ్చిన గ్లోబల్ వార్మింగ్ తోనూ ఆయా దేశాలు ప్రభావితమయ్యాయని చెప్పారు. తమ నిర్ణయాల వల్ల ఎక్కువగా ప్రభావితమైన వారి మాట వినకుండా ఏ వర్గం కూడా తమదే ప్రపంచ నాయకత్వమంటూ చాటుకోలేదని మోదీ అన్నారు. విదేశాంగ మంత్రి జై శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అమెరికా, రష్యా, చైనా, యూకేల విదేశాంగ మంత్రులు వరుసగా ఆంటోనీ బ్లింకెన్, లావ్రోవ్, క్విన్, క్లెవెర్లీతోపాటు ఈయా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ఇటలీ ప్రధానితో చర్చలు



భారత్, ఇటలీలు రక్షణ సహకారంలో కొత్త అధ్యాయానికి తెరతీస్తూ తమ ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. గురువారం ఢిల్లీకి చేరుకున్న ఇటలీ ప్రధాని జియోర్జియా మెలోనీతో వివిధ అంశాలపై ఆయన విస్తృతంగా చర్చలు జరిపారు. అనంతరం మెలోనీతో కలిసి మోదీ మీడియాతో మాట్లాడారు. సంయుక్త భాగస్వామ్యం, సంయుక్త అభివృద్ధి రంగాల్లో భారత్‌లో నూతన అవకాశాలకు దారులు తెరుచుకున్నాయన్నారు. ఈ బంధం ఉభయతారకమని చెప్పారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం అంశాలపై రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయన్నారు.

## 'హథ్రాస్' నిందితుడికి జీవిత ఖైదు

హథ్రాస్(యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని హథ్రాస్‌లో 2020లో దళిత యువతి(20)పై అత్యాచారం, హత్య కేసులో ప్రధాన నిందితుడు సందీప్(20)కు ప్రత్యేక కోర్టు యావజ్జీవ జైలు శిక్ష విధించింది. సందీప్‌పై సెక్షన్ 304తోపాటు, ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసుల్లో దోషిగా కోర్టు నిర్ధారించింది. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు రవి(35), లవ్‌కుష్(23), రాము(26)లను కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. దళిత యువతిని అగ్రవర్ణాలకు చెందిన వారు సామూహిక అత్యాచారం చేసి, క్రూరంగా చంపారనే వార్తలతో అప్పట్లో ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి.

## అమెరికా, రష్యా, యూఏఈల వ్యోమగాములతో.. ఐఎస్‌ఎస్‌కు వెళ్లిన స్పేస్ ఎక్స్ రాకెట్

కేప్ కెనవెరాల్: అరబ్ దేశాల నుంచి మొట్టమొదటి వ్యోమగామి సహా మూడు దేశాలకు చెందిన నలుగురు వ్యోమగాములతో స్పేస్‌ఎక్స్ రాకెట్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్‌ఎస్)కు చేరుకుంది. ఆరు నెలల ఈ మిషన్‌లో యూఏఈ రెండో వ్యోమగామి సుల్తాన్ అల్–నెయాడీ పాలుపంచుకుంటున్నారు. నెయాడీతోపాటు అమెరికాకు చెందిన స్టీఫెన్ బోవెన్, వారెన్ హొబర్గ్, రష్యాకు చెందిన అంద్రీ ఫెడ్యాయెవ్ ఉన్నారు. వీరు అక్కడికి చేరుకున్నాక ఐఎస్‌ఎస్‌లో గత ఏడాది అక్టోబర్ నుంచి ఉంటున్న అమెరికా, రష్యా, జపాన్ వ్యోమగాములు భూమిపైకి చేరుకోవాల్సి ఉంది.

## గ్రేటర్ తిప్రాల్యాండ్ డిమాండ్ నెరవేర్చలేం : బీజేపీ

అగర్తాలా: రాష్ట్రంలో తమ ప్రభుత్వానికి కొత్తగా వచ్చిన తిప్రా మోథా పార్టీ మద్దతు ఇవ్వాలనుకుంటే ఆ పార్టీ చేసే డిమాండ్‌లలో ప్రత్యేక రాష్ట్రం గ్రేటర్ తిప్రాలాండ్ డిమాండ్ మినహా మిగతావన్నీ నెరవేరుస్తామని బీజేపీ స్పష్టం చేసింది. ప్రద్యోత్ డెబ్బార్మా నేతృత్వంలోని తొలిసారిగా ఎన్నికల్లో పోటీ చేసిన తిప్రా మోథా 13 స్థానాల్లో విజయం సాధించింది. 60 స్థానాలున్న అసెంబ్లీలో బీజేపీ మేజిక్ ఫిగర్ దాటి 33 స్థానాల్లో గెలిచింది.



## రెండోరోజు పవిత్రోత్సవాలు

కొండగట్టు: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలో రెండోరోజు పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి హోమం నిర్వహించారు.



## అంజన్నకు రూ.కోటి ఆదాయం

కొండగట్టు: అంజన్న హుండీని లెక్కించారు. 63 రోజులకు గాను 1,01,73,995 ఆదాయం వచ్చింది. 92గ్రాముల బంగారం, 3.700కిలో గ్రాముల మిశ్రమ వెండి, విదేశీనోట్లు వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
34.0/18.0

## వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### వైఎస్సార్ విగ్రహాన్ని కూల్చడం సిగ్గుమాలిన పని



విద్యానగర్(కరీంనగర్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, దివంగత డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని కూల్చడం సిగ్గుమాలిన పని అని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.నగేశ్ అన్నారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించిన గొప్ప నాయకుడని, విగ్రహాన్ని కూల్చినంత మాత్రాన ఆయన స్థానం ఎప్పటికీ చెరిగిపోదని పేర్కొన్నారు. తమ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల వాగ్ధాటిని తట్టుకోలేకనే బీఆర్‌ఎస్ నాయకులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఎండీ.ఆరిఫ్, హజారుద్దీన్, ప్రసాద్‌రావు, శ్రీనివాస్, లక్ష్మణ్ పార్టీలో చేరగా కండువాలు కప్పి, ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు శివరాం, రాచమల్ల నర్సయ్య, వెన్నం రజితారెడ్డి, ఊకంటి రవీందర్‌రెడ్డి, సునీల్‌కుమార్, శ్రీనివాస్,అజయ్,సంపత్ పాల్గొన్నారు.

### ఎస్సారార్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



ప్రవీణ

శాతవాహన యూనివర్సిటీ(కరీంనగర్): కరీంనగర్ ఎస్సారార్ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న చిలువేరి ప్రవీణకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఆమె ఓయూ ప్రొఫెసర్ లక్ష్మి పర్యవేక్షణలో ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ త్రూ ఎంట్రెప్రెన్యూర్‌షిప్ ఏ కేస్ స్టడీ ఇన్ హైదరాబాద్ అనే అంశంపై పరిశోధన చేశారు. దీనికిగాను గురువారం డాక్టరేట్ ప్రకటించారు. ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు ప్రవీణను అభినందించారు.

### క్వింటాల్ పత్తి రూ.7,700

జమ్మికుంట(హుజూరాబాద్): స్థానిక వ్యవసాయ పత్తి మార్కెట్‌లో గురువారం క్వింటాల్ పత్తి ధర గరిష్ఠంగా రూ.7,700 పలికింది. 102 వాహనాల్లో 1,278 క్వింటాళ్ల పత్తిని రైతులు విక్రయానికి తీసుకురాగా మోడల్ ధర రూ.7,500, కనిష్ట ధర రూ.7,000ను వ్యాపారులు చెల్లించారు. గన్నీ సంచుల్లో 14 మంది రైతులు 22 క్వింటాళ్ల పత్తిని తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,600, మోడల్ ధర రూ.7300, కనిష్ట ధర రూ.6,000కు కొనుగోలు చేశారు. మార్కెట్‌లో క్రయవిక్రయాలను కార్యదర్శి రెడ్డి నాయక్ పర్యవేక్షించారు.

### ఆర్టీసీ బస్సులో చెలరేగిన మంటలు

హుజూరాబాద్‌రూరల్: ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఒక్కసారిగా ఇంజిన్ నుంచి మంటలు చెలరేగాయి. దీంతో డ్రైవర్ చాకచక్యంగా బస్సు పక్కకు ఆపి ప్రయాణికులను రక్షించాడు. గురువారం హుజూరాబాద్ డిపోకు చెందిన బస్సు జమ్మికుంట నుంచి హుజూరాబాద్ వైపు ప్రయాణికులతో వెళ్తోంది. శాలపల్లి-ఇందిరానగర్ వద్దకు రాగానే ఇంజిన్‌లో నుంచి మంటలు వచ్చాయి. వెంటనే డ్రైవర్ బస్సునుపాపి ప్రయాణికులను కిందకు దింపాడు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

### ధర్మపురి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు

విద్యానగర్(కరీంనగర్): నేటి నుంచి ఈ నెల 15వ తేదీ వరకు ధర్మపురిలోని లక్ష్మీనృసింహ స్వామి దేవాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. భక్తుల కోసం కరీంనగర్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు కరీంనగర్-2 డిపో మేనేజర్ టి. మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని సూచించారు.

# ఆందోళనబాటలో రేషన్ డీలర్లు

- రెండు నెలల కమీషన్ కోసం పడిగాపులు
- రావాల్సిన మొత్తం రూ.1.5కోట్లు
- భారంగా దుకాణ నిర్వహణ
- సహాయకులకు వేతనం ఇవ్వలేని దుస్థితి



రేషన్ పంపిణీ చేస్తున్న డీలరు

| |
|---|
| జిల్లాలో గ్రామ పంచాయతీలు: 313 |
| మునిసిపాలిటీలు: 5 |
| మొత్తం రేషన్ డీలర్లు: 487 |
| కార్డుదారులు: 2,70,201 |
| రావాల్సిన బకాయి: రూ.1.5కోట్లు |

కరీంనగర్ అర్బన్: కమీషన్ కోసం కదం తొక్కేందుకు రేషన్ డీలర్లు సన్నద్ధమవుతున్నారు. డిసెంబర్, జనవరి కమీషన్ రాకపోగా ఫిబ్రవరి మాసం కమీషన్ కూడా రావాల్సిఉంది. కాగా కమీషన్ కోసం జిల్లా అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం నిరాశగా వెనుదిరగడం తప్పా ప్రయోజనం శూన్యమన్నది డీలర్ల వాదన. ప్రతి నెల ఠంచన్‌గా డబ్బులు వచ్చిన దాఖలాలే లేకపోగా నిరీక్షణే ఎదురవుతోంది. జిల్లామొత్తంగా బకాయి రూ.1.5కోట్లు ఉండగా రేషన్ దుకాణాన్ని నిర్వహించడం తలకుమించిన భారమవుతోందని డీలర్లు వాపోతున్నారు. గతంలో జిల్లా అధికారులే డీలర్ల ఖాతాలో కమీషన్ వేయగా గత నెల నుంచి కమిషనరేట్ నుంచి కమీషన్ పంపిస్తున్నారు. అయినా జాప్యం జరుగుతోంది.

**487మంది రేషన్ డీలర్లు.. బకాయి రూ.1.5కోట్లు**

జిల్లాలో మొత్తం 487 రేషన్ దుకాణాలున్నాయి. వాటి ద్వారా జిల్లాలో 2.70లక్షల కార్డుదారులకు ప్రతీనెలా బియ్యం పంపిణీ చేస్తున్నారు. క్వింటాకు డీలర్‌కు రూ.70 చొప్పున ప్రభుత్వం కమీషన్ ఇస్తోంది. కార్డులోని ప్రతి వ్యక్తికి 6 కిలోల చొప్పున ఉచిత బియ్యాన్ని ఇస్తున్నారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఒక్కో వ్యక్తికి 10కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయగా సదరు సమయంలో కమీషన్ ఎక్కువగా వచ్చేది. క్రమేణా యూనిట్‌కు 6కిలోలు మాత్రమే ఇస్తుండటంతో వచ్చే కమీషన్ తగ్గింది. జిల్లాలో కరీంనగర్, చొప్పదండి, జమ్మికుంట, హుజూరాబాద్ ఎంఎల్‌ఎస్ పాయింట్ల ద్వారా రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేస్తున్నారు. ఒక్కోసారి మూమెంట్ ఆలస్యం కావడంతో కార్డుదారులు బియ్యం తీసుకోకపోవడంతో కమీషన్‌పై ప్రభావం చూపుతోంది.

**దుకాణాల నిర్వహణ భారం**

రేషన్ డీలర్లకు ఇచ్చే కమీషన్ అంతంతమాత్రమే. ప్రతీ నెలా దుకాణానికి అయ్యే ఖర్చును భరించలేక అవస్థలు పడుతున్నారు. సరుకులు రాగానే వాటిని అన్‌లోడ్‌చేసేందుకు హమాలీ పేరిట క్వింటాల్‌కు రూ.8, లారీ డ్రైవర్‌కు రూ.200, విద్యుత్ బిల్లు సుమారు రూ.500, గది లేదా షట్టర్ కిరాయి రూ.2వేలు ఖర్చవుతోంది. ఈ- పోస్ మిషన్ రీచార్జికి రూ.200, సహాయకులకు రూ.2 వేలకు పైగా ఇవ్వాల్సి ఉంటుందని డీలర్లు వివరించారు. నెలకు రూ.5వేల నుంచి 6వేల వరకు ఖర్చు. డీలరు వంద క్వింటాళ్లు పంపిణీ చేస్తే వచ్చే కమీషన్ రూ.7వేలు. ఇందులో ఖర్చులు పోనూ మిగిలేది రూ.వెయ్యి నుంచి రెండు వేలు. కుటుంబపోషణ భారంగా మారడంతో కొందరు డీలర్లు చేసిన అప్పులు తీర్చలేక చిరు వ్యాపారాలు వెతుక్కుంటున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనైతే వ్యవసాయం లేదా నిత్యం కూలీకి వెళ్తున్నారు.

**రెండు నెలలుగా నిరీక్షణ**

రెండు నెలల నుంచి డీలర్లకు కమీషన్ అందడం లేదు. డిసెంబర్, జనవరి నెలల కమీషన్ రావాల్సి ఉండగా ఫిబ్రవరి 25తో రేషన్ పంపిణీ ముగిసింది. ఇప్పుడు ఫిబ్రవరి కమీషన్ కూడా రావాల్సి ఉంది. మొత్తంగా మూడు నెలల కమీషన్ అంటే డీలర్లకు మోయలేని భారమే. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా ఉంది. డిసెంబర్ నుంచి 6కిలోలు మాత్రమే పేదలకు పంపిణీ చేశారు. ప్రతి నెలా 21.800ల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేశారు. వీటికి సంబంధించి డీలర్లకు రూ.1.5కోట్ల కమీషన్ బకాయిలు రావాల్సి ఉంది.

**త్వరలోనే కార్యాచరణ**



కేవలం కమీషన్ ఆధారంగానే మా కుటుంబాలను పోషించుకుంటున్నాం. నెలల తరబడి కమీషన్ పెండింగ్‌లో పెడితే మా పరిస్థితి ఏంటి. మూడు నెలలుగా కమీషన్ అందలేదు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన సమయంలో డీలర్లకు కమీషన్ పెంచుతామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇప్పటివరకు పెంచలేదు. డీలర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మా సంఘం తరపున సీఎంకు విజ్ఞప్తి చేశాం. సమస్యలపై రెండు,మూడు రోజుల్లో సంఘం తరపున ఆందోళన చేపడుతాం.

– రొడ్డ శ్రీనివాస్, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

# జ్ఞాన సంపదను భావితరాలకు అందించేది పుస్తకం



పుస్తకాలను పరిశీలిస్తున్న మంత్రి గంగుల కమలాకర్, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ తదితరులు

- కవులు, కళాకారులకు పుట్టినిల్లు కరీంనగర్
- మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్‌కల్చరల్: సాంకేతికత ఎంత అభివృద్ధి చెందిన గూగుల్ వంటివి ఇప్పటికీ పుస్తకాల ద్వారానే సమాచారం సేకరిస్తున్నాయని, ఎంతటి వారినైనా ప్రభావితులను చేసి మహోన్నత వ్యక్తులుగా మార్చే శక్తి పుస్తకాలకే ఉందని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జ్యోతిబా పూలే పార్క్‌లో ఏర్పాటుచేసిన బుక్ ఫేయిర్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఒక పుస్తకాన్ని చదవడం ద్వారా మన జీవన విధానాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుకోగలుగుతామని అన్నారు. కవులు, కళాకారులకు పుట్టినిల్లు కరీంనగర్ అని, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణ రెడ్డి, పద్మశ్రీ శ్రీభాష్యం విజయసారథి, నలిమెల భాస్కర్ వంటి గొప్ప సాహితీవేత్తలను, రచయితలను అందించిన జిల్లా మనదని అన్నారు. జెడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ మాట్లాడుతూ.. విద్యార్థులు పుస్తకాలు చదివి జ్ఞానవంతులు కావాలన్నారు. కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ మాట్లాడుతూ.. పుస్తక పఠనం పాఠశాల స్థాయి నుంచే అలవాటు చేసుకోవాలన్నారు. తెలంగాణ సాహితీ అకాడమీ చైర్మన్ జూలూరి గౌరిశంకర్ మాట్లాడుతూ.. సమాజంలో మంచి మనుషులు, మహనీయులుగా ఎదగడంలో ప్రధానంగా నిలిచేవి పుస్తకాలేనని పేర్కొన్నారు.సీపీ సుబ్బారాయుడు, రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్యామ్ ప్రసాద్ లాల్, ట్రైనీ కలెక్టర్ లెనిన్, మేయర్ వై.సునీల్ రావు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### పుస్తకాలను ప్రతి ఒక్కరూ చదవాలి



పురస్కారం అందిస్తున్న జిల్లా జడ్జి బి.ప్రతిమ

కరీంనగర్ కల్చరల్: మన సంస్కృతిని ప్రతిబింబించే పుస్తకాలను ప్రతి ఒక్కరూ తప్పక చదవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ సూచించారు. గురువారం జ్యోతిబాపూలే పార్క్‌లో నిర్వహించిన సాహిత్య సమాలోచన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. భాష ప్రధానం కాదని.. చిన్నతనం నుండే తాను తెలుగు, ఇంగ్లిష్ పత్రికలు, నవలలు చదివినా సంస్కృతిని తెలిపే పుస్తకాలు చదవలేకపోయానన్నారు. జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ స్టాల్ ప్రారంభించారు. అనంతరం ప్రాంగణంలోని ఇతర స్టాళ్లను పరిశీలించారు. అంతకుముందు జిల్లా జడ్జిని కలెక్టర్ సన్మానించారు. వానమామలై జగన్నాథచార్యుల పేరుతో రూపొందించిన పురస్కారంతోపాటు రూ.10 వేల నగదును కవి అన్నవరం దేవేందర్ అందజేశారు.

# నిఘా నీడలో గ్రామాలు

- సీపీ సుబ్బారాయుడు



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీపీ, ఎమ్మెల్యే

చిగురుమామిడి: జిల్లాలోని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే నిఘానీడలో ఉంటాయని సీపీ ఎల్.సుబ్బారాయుడు అన్నారు. చిన్నములుకనూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాలను గురువారం ఆయన హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. సీపీ మాట్లాడుతూ గ్రామాల్లో దొంగతనాలు, అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు నిందితులను పట్టుకునేందుకు కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంపై ఎస్సై దాస సుధాకర్‌ను అభినందించారు. ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అమలయ్యాక పట్టణాలకు దీటుగా గ్రామాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.గ్రామస్తులు సీపీ, ఎమ్మెల్యే, కెమెరాలకు విరాళాలు ఇచ్చిన దాతలను సన్మానించారు. రూరల్ ఏసీపీ కరుణాకర్, తిమ్మాపూర్ సీఐ పి.రమేశ్, ఎంపీపీ కొత్త వినీత, జెడ్పీటీసీ రవీందర్, సర్పంచ్ వెంకటనర్సింహారెడ్డి, ఎంపీటీసీ జమున, తదితరులు ఉన్నారు.

### పోటీ పరీక్షల అభ్యర్థులకు అవగాహన



కరీంనగర్ కల్చరల్: తెలంగాణ సాహితీ అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి, శాతవాహన విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ మల్లేశ్, ఉస్మానియా ప్రొఫెసర్ చెన్న బసవయ్య గురువారం కరీంనగర్ జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించారు. అభ్యర్థులతో పోటీ పరీక్షలపై చర్చించారు. వారికి పలు సూచనలు చేశారు. వివిధ రంగాల్లో వారికి ఉన్న సందేహాలను ప్రశ్నల రూపంలో అడగగా సమాధానాలు ఇచ్చారు. ఏ పరీక్షకు ఎలా సన్నద్ధమైతే గమ్యాన్ని చేరుకుంటారో తెలిపారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ వారిని సత్కరించారు. గ్రంథాలయ సెక్రటరీ సరిత తదితరులు పాల్గొన్నారు.

# దొరల కుట్రకు సర్వాయి పాపన్న బలయ్యారు

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



పాపన్నకు నివాళి అర్పిస్తున్న రేవంత్‌రెడ్డి

సైదాపూర్:బహుజనులను ఆనాటి దొరలు, పెత్తందారులు దోచుకుంటుంటే.. పేదల పక్షాన నిలబడ్డ గొప్ప మనిషి సర్దార్ సర్వాయి పాపన్న అని టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి కొనియాడారు. గురువారం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని సర్వాయిపేటలోని సర్దార్ సర్వాయి పాపన్న గుట్టపై పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బహుజనుల రాజైన సర్దార్ సర్వాయి పాపన్నను దొరలు కుట్ర చేసి అంతమొందించారన్నారు. నాటి రాచరిక దొరల పాలన నేడు తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతోందన్నారు. సర్వాయి పాపన్న సర్వాయి పేట గొలుసుకట్టు గుట్టల నుంచి పరిపాలన చేసిన ఆనవాళ్లు లేకుండా చేయడానికి గుట్టలను క్వారీలకు ఇచ్చే కుట్రను నాటి ఎంపీ పొన్నం ప్రభాకర్ అడ్డుకున్నారని పేర్కొన్నారు. కొంత మంది దొరలు ఈ ప్రాంత వనరులను దోచుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జాతీయ స్థాయిలో పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేస్తామన్నారు. పాపన్న చరిత్రను భావితరాలకు అందించేందుకు విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశంగా చేర్చుతామన్నారు. గ్యాస్ ధరలు పెంచడంలో కేసీఆర్ పాప ముందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును సీఎం కుర్చీ వేసుకొని నిర్మిస్తానని, వందల ఎకరాల్లో ఫామ్ హౌస్ కట్టుకున్నాడని విమర్శించారు. యాత్ర తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెంకు చేరుకోగా.. రేవంత్‌రెడ్డి రాత్రి అక్కడే బస చేశారు. మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, అంజన్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, కేడం లింగమూర్తి, శివయ్య, శ్రీనివాస్, రవీందర్‌రావు, రాఘవులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కొత్తపల్లి(కరీంనగర్): తమ పెండింగ్ సమస్యలపై సీఎం కేసీఆర్ చొరవ చూపి, పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో కరీంనగర్‌లోని విద్యుత్ భవన్ ఆవరణలో విద్యుత్ జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల యాజమాన్యాలు మొండి వైఖరి వీడేలా ముఖ్యమంత్రి ఆదేశాలివ్వాలని కోరారు. బంగారు తెలంగాణలో చాలా మంది ఉద్యోగులకు రివర్షన్ ఇస్తూ, బలి పశువులను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యాలు స్పందించకపోతే రాబోయే వారం రోజుల్లో రిలే నిరాహార దీక్షలు, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్డకొండ గంగాధర్, డీఈలు, ఏడీఈలు, ఏఈలు, అన్ని స్థాయిల ఉద్యోగులతోపాటు నాయకులు ఎస్.అంజయ్య, సీహెచ్.భాస్కర్, కె.శ్రీనివాస్, సీహెచ్.సంపత్ కుమార్, వి.కిరణ్ కుమార్, ఎస్.స్వామి తదితరులు పాల్గొన్నారు.

### నేడు 48 ప్రాంతాల్లో కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో శుక్రవారం 48 ప్రాంతాల్లో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి జువేరియా ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ పట్టణంలోని 1, 4, 10, 13, 16, 28, 30, 31, 32, 40, 53, 56వ డివిజన్లలో, హుజూరాబాద్ పట్టణంలోని 8, 14వ వార్డుల్లో, మండలంలోని ధర్మరాజుపల్లి, కనుకులగిద్ద, జమ్మికుంట పట్టణంలోని 8, 29వ వార్డుల్లో, మండలంలోని తనుగుల, వీణవంక మండలంలోని మామిడాలపల్లి, బ్రాహ్మణపల్లి, బేతికల్, చిగురుమామిడి మండలంలోని రేకొండ, ముదిమాణిక్యం, చొప్పదండి మండలంలోని 9వ వార్డు, వెదురుగట్టు, గుమ్లాపూర్, ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి, లక్ష్మాజిపల్లి, గంగాధర మండలంలోని గర్శకుర్తి, నారాయణపూర్, కురిక్యాల, రామడుగు మండలంలోని కొరటపల్లి, కొక్కెరకుంట, కొత్తపల్లి పట్టణంలోని 6వ వార్డు, మండలంలోని బొమ్మకల్, కరీంనగర్ రూరల్ మండలంలోని చెర్లభూత్కూర్, గోపాల్‌పూర్, మానకొండూరు మండలంలోని మానకొండూర్, గంగిపల్లి, పచ్చునూర్, సైదాపూర్ మండలంలోని సోమారం, గొడిశాల, కేశపట్నం మండలంలోని తాడికల్, మెట్‌పల్లి, తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్, మన్నెంపల్లి, గన్నేరువరం మండలంలోని జంగపల్లిల్లో కంటి వెలుగు బృందాలు పని చేస్తున్నాయని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# సామాన్యుల నడ్డివిరుస్తున్న బీజేపీని తరిమికొట్టాలి

- బడాబాబులకు రాయితీలు.. పేదలకు పన్నుపోట్లా?
- దేశసంపద అదానీకి ధారదత్తం
- పెంచిన ధరలను తగ్గించే వరకూ పోరాటం
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: సంపన్నులకు వేలాది కోట్ల రాయితీలు ఇస్తూ.. పేద ప్రజల నడ్డివిరుస్తున్న బీజేపీని తరిమికొట్టాల్సిన అవసరం ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ తెలంగాణ చౌక్‌లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామక్రిష్ణారావు, మేయర్ వై.సునీల్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వంటావార్పు నిర్వహించారు. ఖాళీ సిలిండర్లను ప్రదర్శిస్తూ కట్టెల పొయ్యిలే దిక్కు అంటూ బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశానికి మోదీ ప్రధాని కావడం మన దురదృష్టకరమని, మూడు రాష్ట్రాల్లో ఎన్నికలు పూర్తి కావడంతో మరోసారి సామాన్యులపై ఊహించని భారాన్ని మోపిందన్నారు. మోదీ మిత్రుడు అదానీకి జరిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకే ఈ ధరల పెంపు అని మంత్రి ఆరోపించారు. ఎనిమిది సంవత్సరాల క్రితం రూ.400 ఉన్న సిలిండర్ ధర.. ఇప్పుడు రూ.1200లకు చేరుకుందని అన్నారు. తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉండాలని సీఎం కేసీఆర్ ఆసరా పింఛన్లు, కళ్యాణ లక్ష్మి తదితర సంక్షేమ కార్యక్రమాలు చేస్తుంటే.. ప్రధాని మోదీ పెట్రోల్, గ్యాస్, నిత్యావసర ధరలు పెంచి ప్రజల రక్తాన్ని పీలుస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి, బీఆర్‌ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణచౌక్‌లో నిరసన తెలుపుతున్న మంత్రి కమలాకర్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు

## క్లుప్తంగా

### 'కాంగ్రెస్‌ ఉనికి కోసమే పాదయాత్ర'


మాట్లాడుతున్న సంపత్‌రావు

జమ్మికుంట(హుజూరాబాద్‌): కాంగ్రెస్‌ కనుమరుగవుతోందని, రేవంత్‌రెడ్డి ఆ పార్టీ ఉనికి కోసమే పాదయాత్ర చేస్తున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు ఆరోపించారు. ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌పై ఆరోపణలు అర్థరహితమన్నారు. గురువారం జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రజల మద్దతు కూడగట్టుకొని, బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదుగుతోందని తెలిపారు. తమను నేరుగా ఎదుర్కోలేక రేవంత్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు వెనక నుంచి సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన హుజూరాబాద్‌లో ప్రజాసమస్యలపై మాట్లాడకుండా ఈటలపై ఆరోపణలకే ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. ఎమ్మెల్యే రాజేందర్‌ పౌల్ట్రీ వ్యాపారంతో అభివృద్ధి చెందారని, రేవంత్‌రెడ్డిలా బ్లాక్‌ మెయిల్‌ చేసి, కాదన్నారు. అసత్యపు ఆరోపణలు మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేశ్‌, నియోజకవర్గ కన్వీనర్‌ మాడ గౌతమ్‌రెడ్డి, మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ శీలం శ్రీనివాస్‌, జిల్లా అధికార ప్రతినిధి మాసాడి ముత్యంరావు తదితరులు పాల్గొన్నారు.

### ఖగోళ, వాస్తు శాస్త్ర సదస్సులో జయపాల్‌రెడ్డి


మోహన్‌ భగవత్‌తో జయపాల్‌రెడ్డి

గంగాధర(చొప్పదండి): మహారాష్ట్రలోని నాగపూర్‌ జిల్లా చౌకి గ్రామంలోని బృహస్పతి, శని దేవాలయాల్లో గురువారం ఖగోళ, వాస్తు శాస్త్ర సదస్సు నిర్వహించారు. ఇందులో గంగాధర సహకార సంఘం మాజీ చైర్మన్‌, మైత్రి గ్రూప్‌ చైర్మన్‌ కొత్త జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌ చీఫ్‌ మోహన్‌ భగవత్‌ సైతం హాజరయ్యారు.

### తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

రామడుగు(చొప్పదండి): మండలంలోని చిప్పకుర్తి గ్రామానికి చెందిన బుర్ర వీరయ్యగౌడ్‌ (76) అనే గీత కార్మికుడు తాటి చెట్టు పైనుంచి పడి, మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. వీరయ్యగౌడ్‌ గురువారం ఉదయం తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా, ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను గ్రామస్తులు 108 వాహనంలో కరీంనగర్‌ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

### తప్పుడు ప్రచారం చేస్తున్నాడని ఫిర్యాదు

హుజూరాబాద్‌రూరల్‌: మండలంలోని శాలపల్లి–ఇంద్రనగర్‌ గ్రామ సర్పంచ్‌ కొడిగూటి శారద తనపై ఓ వ్యక్తి తప్పుడు ప్రచారం చేస్తున్నాడని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలోని పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో అంబులెన్స్‌ ఏర్పాటు చేశానన్నారు. ఆ వాహనంపై సీఎం కేసీఆర్‌, మంత్రి తన్నీరు హరీశ్‌రావు, తన ఫొటోలను అతికిస్తే మంచిర్యాల జిల్లాకు చెందిన చల్లాడి శ్రవణ్‌కుమార్‌ సోషల్‌ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నాడని పేర్కొన్నారు. విచారణ జరిపి, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# 'పది'లో ఉత్తమ ఫలితాలే లక్ష్యం

- విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- పర్యవేక్షణకు రాష్ట్ర, జిల్లాస్థాయి బృందాల ఏర్పాటు
- జిల్లాలో పరీక్షలు రాయనున్న 4,247 మంది


కరీంనగర్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈవో జనార్దన్‌రావు

కరీంనగర్‌: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా చదువులో వెనకబడిన విద్యార్థులపై జిల్లా విద్యాశాఖ ప్రత్యేక దృష్టిసారించింది. వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు ప్రణాళికలు రూపొందించింది. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. కొంతమంది ఉపాధ్యాయులు సరిగా బోధించడం లేదనే ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పర్యవేక్షణకు రాష్ట్ర, జిల్లాస్థాయి బృందాలను నియమించింది. ఇవి వారానికి రెండుసార్లు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసి, వివరాలను ఉన్నతాధికారులకు అందిస్తాయి. కరీంనగర్‌ జిల్లాలో 150 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 4,247 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. వీరికి స్నాక్స్‌ అందిస్తూ, ప్రీఫైనల్‌ పరీక్షలను నిర్వహిస్తూ విషయ నిపుణులతో రూపొందించిన అభ్యాస దీపికలను విద్యాశాఖ అధికారులు పంపిణీ చేశారు.

**సభ్యులుగా ప్రధానోపాధ్యాయులు..**

కరీంనగర్‌ జిల్లాకు నియమించిన రెండు రాష్ట్రస్థాయి బృందాల్లో ప్రధానోపాధ్యాయులు సభ్యులుగా ఉంటారు. పదోతరగతి సిలబస్‌ పూర్తయ్యిందా.. లేదా?, ప్రత్యేక తరగతుల వివరాలు, చదువులో వెనకబడిన విద్యార్థులపై ఏ విధంగా దృష్టిసారించారు.. విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారా.. లేదా? అనే విషయాలపై ఆరా తీస్తారు. డీఈవోతోపాటు రాష్ట్రస్థాయి అధికారులకు నివేదికలు అందజేస్తారు. జిల్లాస్థాయిలో ఐదు బృందాలు ఏర్పాటు చేశారు. ఒక్కో బృందం వారానికి రెండుసార్లు పాఠశాలలను తనిఖీ చేస్తుంది. వీటిలో నలుగురు సభ్యుల చొప్పున ఉంటారు. ఇద్దరు ఉన్నత పాఠశాలలు, మరో ఇద్దరు ప్రాథమిక స్థాయిలో జరుగుతున్న తొలిమెట్టు కార్యక్రమాన్ని పరిశీలిస్తారు. ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారా.. పాఠశాలలకు సక్రమంగా వస్తున్నారా అనే విషయాలను తెలుసుకుంటారు.

**తల్లిదండ్రులతో సమావేశాలు..**

విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రాత్రివేళ పిల్లలు చదువుతున్నారా.. లేదా అనే విషయాలు తెలుసుకుంటారు. తరచూ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని, పిల్లలకు వారి తోడ్పాటునందించేలా చూడాలని కోరతారు. విద్యార్థులను ఉదయం 5 గంటల నుంచి 6 గంటల మధ్యలో నిద్రలేపి, చదివించాలని సూచిస్తారు. టీ–శాట్‌ ద్వారా వచ్చే పాఠాలను వారు చూసేలా చర్యలు తీసుకోవాలని చెప్తారు. ప్రత్యేక బృందాలు పిల్లల అభ్యాసన సామర్థ్యాల పెంపుపై సలహాలు, సూచనలను అందిస్తాయి.

**విద్యార్థులపై దృష్టిసారిస్తున్నాం..**



పదోతరగతి ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణతా శాతం సాధించడమే లక్ష్యంగా ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థులపై దృష్టిసారిస్తున్నాం. విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించడమే లక్ష్యంగా టీచర్లకు పలు సూచనలు చేశాం. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్‌ స్కూళ్ల విద్యార్థుల ఉత్తీర్ణతపై, వివిధ కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు బృందాల ద్వారా వివరాలు సేకరిస్తున్నాం.

– జనార్దన్‌రావు, డీఈవో, కరీంనగర్‌

# పథకాలు పేదలకు వరంగా మారాలి

- కలెక్టర్‌ ఆర్‌వీ కర్ణన్‌
- తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పథకాలు అనే అంశంపై సమావేశం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌ కర్ణన్‌, వీసీ మల్లేశ్‌ తదితరులు

శాతవాహన యూనివర్సిటీ(కరీంనగర్‌): ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు వరంగా మారాలని కలెక్టర్‌ ఆర్‌వీ కర్ణన్‌ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పథకాలు అనే అంశంపై గురువారం శాతవాహన విశ్వవిద్యాలయం బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌ శాఖ, సెంటర్‌ ఫర్‌ రూరల్‌ స్టడీస్‌ సంయుక్తంగా వర్సిటీలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మన రాష్ట్రం దేశంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన పథకాలను ప్రవేశపెడుతూ ప్రగతి పథంలో దూసుకుపోతుందని పేర్కొన్నారు. వీటి వల్ల సామాన్యుల ఆర్థిక, సామాజిక పరిస్థితులు మెరుగవుతున్నాయని తెలిపారు. ఆచార్య గంటా చక్రపాణి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు తమ రాష్ట్రాల్లోని ప్రజలకు మౌలిక వసతులు కల్పనకు, వారి సమస్యలు పరిష్కారంలో భాగంగా కొత్త పథకాలు ప్రవేశపెట్టడానికి మేధోమథనం అవసరమన్నారు. రాజకీయ ప్రతినిధులు, మేధావులు, సామాజికవేత్తలు కలిసి, పథకాల ఆవశ్యకతపై, వాటి వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలపై చర్చించాల్సి అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆచార్య చెన్నబసవయ్య మాట్లాడుతూ.. ప్రజా పథకాలను కొన్ని సూత్రాలు, ప్రణాళికలతో తయారు చేయాలని పేర్కొన్నారు. వీసీ ఆచార్య సంకశాల మల్లేశ్‌ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు రాష్ట్ర ఆవిర్భావంతో మొదలై ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవనంలో మార్పులు తెచ్చాయని తెలిపారు. ఆచార్య వరప్రసాద్‌ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలన్నీ ప్రజల జీవనశైలిని మార్చడానికి తోడ్పడాలని, ఇలాంటి సదస్సులు ముందు ముందు ఇంకా నిర్వహించాలని కోరారు. అనంతరం సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సదస్సు నిర్వాహకుడు శ్రీరంగప్రసాద్‌, వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పరిశోధకులు, అధ్యాపకులు, సదస్సు కో–కన్వీనర్‌ మనోహర్‌, ఆర్ట్స్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌ జాఫర్‌, సైన్స్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌ జయంతి, ఆచార్య భరత్‌, ఆచార్య సాయిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 'ఉపాధిహామీ' నిర్వీర్యానికి కేంద్రం కుట్ర



మాట్లాడుతున్న వెంకటస్వామి

కరీంనగర్‌: ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆరోపించారు. గురువారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో బోయిని అశోక్‌ అధ్యక్షతన నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో పోరాడి సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎత్తివేయాలని చూస్తోందన్నారు. అందులో భాగంగానే కేంద్ర బడ్జెట్‌ కేటాయింపుల్లో ఏటా కోత పెడుతూ కూలీలకు పని దొరకకుండా చేస్తోందని మండిపడ్డారు. ఉపాధి కూలీల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వారు శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు గ్యారెంటీ పని చట్టం తీసుకురావాలని డిమాండ్‌ చేశారు. కూలి రూ.600కు, పని దినాలను 200 రోజులకు పెంచాలని, వారికి ఇళ్లు ఇవ్వాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడ సృజన్‌ కుమార్‌, ఉపాధ్యక్షుడు బత్తుల బాబు, విలాసాగరం అంజయ్య, సహాయ కార్యదర్శులు కూన రవి, దరిపెల్లి అంకుస్‌, నాయకులు వెంకట్‌, కొమురయ్య, బీర్ల పద్మ, లక్ష్మీ, రాజవ్వ, మల్లక్క తదితరులు పాల్గొన్నారు.

# గౌరవెల్లి ప్రాజెక్టును అడ్డుకుంటోంది కాంగ్రెస్సే

- దెయ్యాలు వేదాలు వల్లించినట్లు రేవంత్‌ రెడ్డి మాటలు
- హుస్నాబాద్‌ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌

చిగురుమామిడి: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఓ తుపాకీ రాముడని, ఆయన మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లున్నాయని హుస్నాబాద్‌ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌ అన్నారు. గురువారం చిగురుమామిడి మండల పరిషత్‌ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్‌ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తికాకుండా కాంగ్రెస్సే అడ్డుకుంటోందని ఆరోపించారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డిలు పదవుల్లో ఉన్నప్పుడు ఏం చేశారని ప్రశ్నించారు. త్వరలోనే గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి, నీటితో నింపుతామన్నారు. గండిపల్లి ప్రాజెక్టు పనులను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. అతిత్వరలో 1.07 లక్షల ఎకరాలను సాగునీరు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి, ఎస్టీలకు కార్పొరేషన్‌ ద్వారా రూ.8 లక్షల పరిహారం ఇప్పిస్తామన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టులో ప్రభుత్వ భూములు లేవని తెలిపారు. ప్రతీ నిర్వాసిత కుటుంబానికి రూ.17 లక్షల పరిహారం అందించామని చెప్పారు. ఎంపీపీ కొత్త వినీత, జెడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్‌, వైస్‌ఎంపీపీ రాజిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్‌ జంగ వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమాచారి, పెద్దపల్లి రవీందర్‌, బోయిని మనోజ్‌ తదితరులు పాల్గొన్నారు.

# ఈశాన్య రాష్ట్రాల్లో గెలుపుపై బీజేపీ సంబరాలు


టపాసులు పేల్చుతున్న నాయకులు

హుజూరాబాద్‌రూరల్‌: ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, నాగాలాండ్‌ ఎన్నికల్లో బీజేపీ గెలుపుపై ఆ పార్టీ హుజూరాబాద్‌ పట్టణశాఖ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్‌ చౌరస్తాలో నాయకులు గురువారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. దేశ ప్రజలంతా ప్రధాని మోదీ పాలనలో సంతోషంగా ఉన్నారని తెలిపారు. అందుకే అనేక ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తున్నారని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌ జోడోయాత్ర తర్వాత కాంగ్రెస్‌ పరిస్థితి మరింత అధ్వానంగా మారిందని అన్నారు. కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ పార్టీలు ఒకే గూటి పక్షులని ప్రజలకు అర్థమవుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలోనూ కమలం వికసిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, నాయకులు దేవేందర్‌రావు, అనురాగ్‌, సుమన్‌, వేణు, ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రేత అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీపీ సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: అడ్డదారిలో డబ్బు సులువుగా సంపాదించాలని గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని కరీంనగర్‌ త్రీటౌన్‌ పోలీసులు అరెస్టు చేశారు. సీపీ ఎల్‌.సుబ్బారాయుడు కమిషనరేట్‌ కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పోతారం గ్రామానికి చెందిన గండికోట దేవరాజుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. స్వగ్రామంలో ఉపాధి లేక కుటుంబాన్ని పోషించుకోవడానికి పదేళ్లు సౌదీ అరేబియాలో డ్రైవర్‌గా పని చేశాడు. ఆ సంపాదన సరిపోక తిరిగి వచ్చాడు. పెట్టుబడి లేకుండా సులువుగా డబ్బు సంపాదించాలంటే ఏం చేయాలని ఆలోచించాడు. గతంలో కొంతకాలం ఒడిశా రాష్ట్ర సరిహద్దులో ట్రాక్టర్‌ డ్రైవర్‌గా పని చేశాడు. అక్కడ గంజాయి సాగు, విక్రయాలపై ఉన్న అవగాహనతో ఈ పనే చేయాలని నిర్ణయించుకున్నాడు. కరీంనగర్‌ జిల్లాలోనూ గంజాయి విక్రయించడం మొదలు పెట్టాడు. అతని కదలికలపై త్రీటౌన్‌ పోలీసులు నిఘా పెట్టారు. ఇంటి నుంచి తరచూ బైక్‌పై వెళ్లి, రెండు రోజుల తర్వాత వస్తున్నట్లు గుర్తించారు. దేవరాజు ఒడిశా సరిహద్దులోకి వెళ్లి, గంజాయి ప్యాకెట్లు తెచ్చి, ఇక్కడ విక్రయిస్తున్నట్లు నిర్ధారించారు. ఈ క్రమంలో గురువారం గంజాయి తీసుకువస్తుండగా పోలీసులు కరీంనగర్‌లో పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.లక్ష విలువైన 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దేవరాజును పట్టుకున్న త్రీటౌన్‌ సీఐ పి.దామోదర్‌రెడ్డి, ఎస్‌ఐ పి.శ్రీనివాసరావు, సిబ్బంది కృష్ణ, విజయ్‌, మనోహర్‌, లక్ష్మీనర్సయ్య, వి.దామోదర్‌లను సీపీ అభినందించారు.

### మాజీ స్పీకర్‌ శ్రీపాదరావుకు నివాళి



కరీంనగర్‌టౌన్‌: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ మాజీ స్పీకర్‌ దుద్దిళ్ల శ్రీపాదరావు 86వ జయంతిని కరీంనగర్‌ నగర కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి, బస్టాండ్‌ కూడలి వద్ద గల విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. నగర శాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. నాయకులు వైద్యుల అంజన్‌ కుమార్‌, గుండాటి శ్రీనివాస్‌ రెడ్డి, శ్రవణ్‌ నాయక్‌, అక్బర్‌ అలీ, కుర్ర పోచయ్య, సయ్యద్‌ అఖిల్‌, విక్టర్‌, కమ్రుద్దీన్‌, షహన్నా, దన్న సింగ్‌, మామిడి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్‌ చౌర్యం కేసులో ఒకరికి జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్‌): విద్యుత్‌ చౌర్యం కేసులో మానకొండూర్‌ మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన గొల్లెన రాజయ్యకు రూ.9,648 జరిమానా విధిస్తూ జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్రీవాణి తీర్పు చెప్పారు. విద్యుత్‌ శాఖ విజిలెన్స్‌ ఇన్‌స్పెక్టర్‌ కె.స్వామి వివరాల ప్రకారం.. 2018లో విద్యుత్‌ చౌర్యం చేస్తూ రాజయ్య పట్టుబడగా మొదటి తప్పుగా భావించి రూ.వెయ్యి జరిమానా విధించారు. అదే ఏడాది మరోసారి విద్యుత్‌ చౌర్యానికి పాల్పడగా కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో నిందితుడు రూ.9,648 చెల్లించాలని, లేదంటే రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి గురువారం తీర్పు వెలువరించారు.

### ఒకరిపై అట్రాసిటీ కేసు

జమ్మికుంట(హుజూరాబాద్‌): కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్‌ సీఐ రామచందర్‌రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్‌ పరిధిలోని హరితనగర్‌ కాలనీకి చెందిన మోరె శేఖర్‌ వద్ద బోర్ల కార్తీక్‌ దళిత బంధు పథకం కింద యూనిట్‌ మంజూరు చేయిస్తానని డబ్బులు తీసుకున్నాడు. యూనిట్‌ ఇప్పించకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. ఈ క్రమంలో గురువారం అతన్ని పట్టుకొని, డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే శేఖర్‌ను కులం పేరుతో దూషించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిపై అట్రాసిటీ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

# ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

- గత నెల 24న వెంకటాయిపల్లిలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..
- మృతుడు తమిళనాడు వాసి

గంగాధర(చొప్పదండి): బోర్‌వెల్‌ లారీ డ్రైవర్‌ ప్రమాదవశాత్తు బావిలో పడి, మృతి చెందాడు. గంగాధర ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రంలోని సేలం జిల్లా ఇడుపుడి తాలుకా అక్కలైపట్టి గ్రామానికి చెందిన ఇళయరాజా అదే రాష్ట్రానికి చెందిన జయకుమార్‌ వద్ద లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత నెల 24న గంగాధర మండలంలోని వెంకటాయిపల్లిలో ఓ రైతు వ్యవసాయ బావిలో సైడ్‌ బోర్లు వేశారు. రాత్రి కావడంతో కూలీలందరూ అక్కడే నిద్రించారు. మరుసటి రోజు ఉదయం ఇళయరాజా కనిపించలేదు. గతంలో అతను ఎవరికీ చెప్పకుండానే ఇంటికి వెళ్లిపోయేవాడు. దీంతో వారు అలాగే వెళ్లిపోయాడేమో అనుకున్నారు. ఈ క్రమంలో ఇళయరాజా ఇంటికి రాలేదని బుధవారం సమాచారం రావడంతో చివరిగా పనిచేసిన వెంకటాయిపల్లి గ్రామంలోని బావిలో చూడగా మృతదేహం కనిపించింది. గురువారం బయటకు తీయగా ఇళయరాజాగా గుర్తించారు. లారీ యజమాని జయకుమార్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# దివ్యాంగ కూతురిని కాలువలో పడేసిన తండ్రి!

- భార్యతో గొడవపడటమే కారణం
- చిన్నారి ఆచూకీ కోసం పోలీసుల గాలింపు


కాలువలో పరిశీలిస్తున్న పోలీసులు

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): కుటుంబ కలహాల కారణంగా దివ్యాంగురాలైన తన కూతురిని కాలువలో పడేసినట్లు ఓ వ్యక్తి తెలిపాడు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. కరీంనగర్‌లోని చంద్రపురికాలనీకి చెందిన కొమిరె మహేందర్‌ బుధవారం రాత్రి తన భార్యతో గొడవ పడ్డాడు. తర్వాత ఆవేశంలో దివ్యాంగురాలైన తన ఆరేళ్ల కూతురు దుర్గాభవానిని తీసుకొని బయటకు వెళ్లిపోయాడు. పాపను తిమ్మాపూర్‌ మండలంలోని అల్గునూర్‌ శివారు కాకతీయ కాలువలో పడేసి, ఇంటికి వెళ్లాడు. కుటుంబసభ్యులు దుర్గాభవాని గురించి ఆరా తీయగా కాలువలో పడేసినట్లు చెప్పాడు. దీంతో గురువారం ఉదయం కరీంనగర్‌ రూరల్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఏసీపీ కరుణాకర్‌రావు ఆధ్వర్యంలో తిమ్మాపూర్‌ సర్కిల్‌ పోలీసులు కాలువ నీటిని నిలిపివేయించి, పాప కోసం గాలిస్తున్నారు. సాయంత్రం వరకూ ఆచూకీ లభించలేదు. అయితే మహేందర్‌కు మతిస్థిమితం సరిగా ఉండదని, అతను నిజంగా పాపను కాలువలో పడేశాడా అని కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు.



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

### 'పేదల పాలిట ప్రధాని మోదీ దెయ్యమయ్యారు..'

కరీంనగర్‌: కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత బీజేపీ ప్రభుత్వం విచ్చలవిడిగా నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ పేదల పాలిట ప్రధాని మోదీ దెయ్యమయ్యారని సీపీఐ నేతలు పేర్కొన్నారు. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినా కేంద్రం మాత్రం ధరలను ఎందుకు పెంచాల్సి వస్తోందో దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్‌ చేశారు. వంటగ్యాస్‌ సిలిండర్‌ ధరల పెంపును నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో కమాన్‌ చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఖాళీ సిలిండర్లను నెత్తిన పెట్టుకొని, కట్టెల మోపు ఎత్తుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌ రెడ్డి మాట్లాడుతూ 2014లో రూ.410 ఉన్న గ్యాస్‌ సిలిండర్‌ ధర 2023 మార్చి 1 నాటికి రూ.1200లకు చేరిందని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌ కుమార్‌, బోయిని అశోక్‌, బత్తుల బాబు, నగర సహాయ కార్యదర్శులు రాజు, పద్మ, జిల్లా కౌన్సిల్‌ సభ్యులు తదితరులున్నారు.



పీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

### సామాన్యులపై కక్షసాధింపు చర్యలు

కరీంనగర్‌: బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు లక్షల కోట్లు రాయితీలిచ్చి ప్రపంచస్థాయి సంపన్నులను చేస్తున్న ప్రధాని మోదీ.. సామాన్య ప్రజలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వంటగ్యాస్‌ సిలిండర్‌పై రూ.50, కమర్షియల్‌ సిలిండరుపై రూ.350.50 పెంచడం సరైంది కాదని అన్నారు. ఈశాన్య రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే ఆర్థికభారం మోపారని విమర్శించారు. పేదలను ఆదుకునే దేవుడు మోదీ అని పదే పదే ప్రచారం చేసుకుంటున్న బీజేపీ నాయకులు.. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పెరిగిన ధరలను వెనక్కి తీసుకునేలా చూడాలని డిమాండ్‌ చేశారు. దేశభక్తి ముసుగులో దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతూ ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి, గీట్ల ముకుంద రెడ్డి, గుడికందుల సత్యం, జిల్లా కమిటీ సభ్యులు రమేశ్‌, రజనీకాంత్‌, నరేశ్‌, నాయకులు పాల్గొన్నారు.

# 'జ్యోతిష్మతి'లో ఫ్రెషర్స్‌ డే హంగామా


మాట్లాడుతున్న చైర్మన్‌ సాగర్‌రావు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ అండ్‌ సైన్స్‌ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్‌ డే నిర్వహించారు. కళాశాల చైర్మన్‌ సాగర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కళాశాలకు అటానమస్‌ హోదా దక్కడం గర్వంగా ఉందన్నారు. సీట్ల కోసం వెంపర్లాడకుండా నాణ్యమైన విద్య మీద దృష్టిసారిస్తూ విద్యార్థులను ప్రపంచ స్థాయి పోటీ తట్టుకునేలా తయారు చేస్తున్నామని తెలిపారు. 25 ఏళ్ల ప్రస్థానంలో ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా ఎదుర్కొన్నామని అన్నారు. న్యాక్‌ ఎ–గ్రేడ్‌, ఎన్‌బీఏ, ఆరు జేఎన్‌టీయూ గోల్డ్‌ మెడల్స్‌, రెండు ఫౌండేషన్‌ గోల్డ్‌ మెడల్స్‌, రీసెర్చ్‌ సెంటర్‌ సాధించడం, ప్రపంచంలోని దిగ్గజ బహుళజాతి కంపెనీల్లో విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం ఇందుకు ఉదాహరణ అన్నారు. ట్రిపుల్‌ఈ, ఈసీఈ, సివిల్‌, మెకానికల్‌ గ్రూపులకు చెందిన ఒక్కో విద్యార్థికి రూ.25 వేల చెక్కులను ఉపకార వేతనంగా అందించారు. కళాశాల సెక్రటరీ జువ్వాడి సుమిత్‌సాయి మాట్లాడుతూ.. ప్లేస్‌మెంట్స్‌లో విద్యార్థులు అత్యుత్తమ ప్యాకేజీతో ఉద్యోగాలు పొందారని, మేజర్‌ డిగ్రీతోపాటు మైనర్‌ డిగ్రీ చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్‌ కేఎస్‌.రావు, డీన్‌ పీకే వైశాలి, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్



ఆలయ ఆవరణను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లిలో వాగేశ్వరీ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని ఉమామహేశ్వర ఆలయ ఆవరణను వలంటీర్లు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోగొండ లక్ష్మి, శాతవాహన యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మినారాయణ, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, అధ్యాపకులు సత్యనారాయణ, సునీత తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ సంబరాలు



రేకుర్తిలో స్వీట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: త్రిపుర, నాగాలాండ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన సందర్భంగా గురువారం బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆస్పత్రి చౌరస్తాలో స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎడమ సత్యనారాయణరెడ్డి, ఎం.లక్ష్మిరాజం, చంద్రగిరి వేణు, రావుల భాస్కరాచారి, గొల్లె బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**పశ్చిమ జోన్ ఆధ్వర్యంలో..**

బీజేపీ పశ్చిమ జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో గురువారం రాత్రి వివేకానంద జంక్షన్ వద్ద గెలుపు సంబరాలు చేసుకుని మిఠాయిలు పంపిణీ చేశారు. నాయకులు బండ రమణారెడ్డి, మామిడి రమేశ్, చైతన్య, చిట్టారెడ్డి లక్ష్మణరావు, జానపట్ల స్వామి, ఎడమ సత్యనారాయణరెడ్డి, బాలు తదితరులు పాల్గొన్నారు.

### నేత్రాలు సజీవం

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ దుర్శేట్టి నిరంజనాచారి తండ్రి వెంకటస్వామి (93) వృద్ధాప్య సమస్యలతో గురువారం మృతి చెందాడు. నిరంజనాచారి తన తండ్రి నేత్రాలను దానం చేయాలని నిర్ణయించారు. శాతవాహన లయన్స్ క్లబ్ నేతృత్వంలో నేత్రాలు సేకరించి హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి పంపించారు. సేవా గుణం ప్రదర్శించిన నిరంజనాచారిని శాతవాహన లయన్స్ క్లబ్ బాధ్యులు అభినందించారు. నేత్రదాన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాధ్యులు కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, అధ్యక్షుడు మనోహరాచారి, కార్యదర్శి మేకల అరవిందరావు, ఆర్సీ ఇనుగుర్తి రమేశ్, సీహెచ్ రమణాచారి, తుమ్మల రమేశ్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ



కరీంనగర్‌టౌన్: దేశంలోని పేదలకు ఉచితంగా వైద్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం అమలు చేస్తోందని బీజేపీ కార్పొరేటర్ కచ్చు రవి అన్నారు. గురువారం 38వ డివిజన్‌లో ఆయుష్మాన్ భారత్ పథకం కైవేసీ నమోదు, కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకంలో చేరిన వారికి రూ.5లక్షల వరకు ఉచితంగా చికిత్స చేయించుకునే అవకాశం ఉందన్నారు. సీఎం కేసీఆర్ ఇన్నాళ్లు ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు కాకుండా చేశారని, ఆరోగ్యశ్రీ పరిస్థితి దారుణంగా మారడంతో కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### 'కళాశాలను సీజ్ చేయాలి'

సప్తగిరికాలనీ(కరీంనగర్): విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన శ్రీచైతన్య కళాశాలను సీజ్ చేసి, విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధ్యాపకులు, వార్డెన్ సిబ్బంది కొడుతూ ఇబ్బందులకు గురిచేయడాన్ని భరించలేక మంగళవారం రాత్రి తరగతి గదిలోనే ఉరి వేసుకున్నాడని, ప్రాణపాయ స్థితిలో ఉన్నప్పటికీ సిబ్బంది ఆస్పత్రికి తీసుకోకపోవడం విడ్డూరమన్నారు. విద్యా సంస్థలను తెలంగాణ నుంచి నిషేధించాలని, లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# సిబ్బందిపై నియంత్రణ కరువు

- జిల్లా ఆసుపత్రిలో అసలు విధులు మాని ఇతర పనుల్లో ఉద్యోగులు
- పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- ఇన్, ఔట్ పేషెంట్లకు తప్పని ఇబ్బందులు



ఓపీ కోసం బారులు తీరిన జనం

కరీంనగర్‌టౌన్: జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో పనిచేసే సిబ్బందిపై నియంత్రణ కరువైంది. కిందిస్థాయి సిబ్బందితో సక్రమంగా పనులు నిర్వర్తించేలా చూడడంతో పాటు పేషెంట్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో సిబ్బంది ఇష్టారాజ్యం అవుతోంది. అసలు పనులు వదిలి కొసరు పనులు చేస్తూ టైంపాస్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పేషెంట్ కేర్లు, సెక్యూరిటీ, పోస్టుమార్టం, డ్రైవర్లు.. ఇలా పలు విభాగాల సిబ్బంది తమకు కేటాయించిన పనులు చేయకుండా పైరవీలు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. సీజనల్ జ్వరాలు పెరగడంతో ఆసుపత్రికి పేషెంట్ల తాకిడి పెరిగింది. ప్రతిరోజూ 500 వరకు ఉండే ఓపీ, రెండు వారాల నుంచి 750కి చేరింది. పేషెంట్లు పెరుగుతుండడం, సిబ్బంది ఎవరి పనుల్లో వారుండడంతో ఉన్న సిబ్బందితో అందించే సేవలు సరిపోవడం లేదు.

**ఇతర విధుల్లో పేషెంట్ కేర్లు**

పేషెంట్ ఆసుపత్రికి వచ్చినప్పుడు వారు నడవలేని వారైతే వీల్‌చైర్‌లో, కూర్చోలేని పరిస్థితి ఉంటే స్ట్రెచర్‌పై లోనికి తీసుకురావడంతో పాటు డాక్టర్ కన్సల్టేషన్ అయిన తర్వాత ఎక్స్‌రే, ల్యాబ్ పనులతో పాటు వార్డుకు తరలించే వరకు తోడుగా ఉండాల్సి ఉంటుంది. ఇందుకోసం జిల్లా ఆసుపత్రిలో మూడు షిఫ్టుల్లో కలిపి 37 మంది పేషెంట్ కేర్‌లు పనిచేస్తున్నారు. కానీ వీరు తమ విధులను సక్రమంగా నిర్వర్తించరనే ఆరోపణలు ఉన్నాయి. కాగా ఇద్దరు పేషెంట్‌కేర్ పైరవీలు చేసుకొని డాటా ఎంట్రీ ఆపరేటర్లుగా స్థిరపడ్డారు. మరో పేషెంట్ కేర్ ఈసీజీ విభాగంలో పనిచేస్తుండగా, ఇద్దరు ల్యాబ్ పనుల్లో, ముగ్గురు అధికారుల వద్ద సెటిల్ అయ్యారు. పేషెంట్ కేర్‌లుగా జాయిన్ అయిన వీరికి పేషెంట్లతో సంబంధం లేకుండా పోయింది. దీంతో పేషెంట్లకు సేవలు చేసేందుకు పేషెంట్ కేర్‌లు సరిపోక తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

**కానరాని సెక్యూరిటీ**

జిల్లా ఆసుపత్రిలో 24 మంది సెక్యూరిటీ సిబ్బంది మూడు షిఫ్టులలో పనిచేస్తున్నారు. వీరు ఆసుపత్రి బయట మాత్రమే దర్శనమిస్తారు. ఇటు వార్డుల వద్దకానీ, అటు ఓపీ వద్ద కానీ కనబడరు. గురువారం ఆర్థోపెడిక్ సదరం క్యాంపు జరగగా, క్యాంపునకు పెద్ద ఎత్తున వికలాంగ నిర్ధారణ కోసం తరలివచ్చారు. దివ్యాంగులతో పాటు వారి కుటుంబ సభ్యులు ఎక్కువ సంఖ్యలో రావడంతో ఒక దశలో నేను ముందంటే నేను అంటూ తోపులాట కూడా జరిగింది. ఈ సమయంలో కంట్రోల్ చేయాల్సిన సెక్యూరిటీ సిబ్బంది ఆ ప్రాంతంలో కనబడకపోవడం శోచనీయం.

**పోస్టుమార్టం సిబ్బంది కరువు**

జిల్లా ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసేందుకు సిబ్బంది కరువయ్యారు. పోస్టుమార్టం విభాగానికి నలుగురు ఎంఎన్‌వోలను కేటాయించగా, ప్రతిఒక్కరూ మూడు నెలల పాటు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఇందులో ముగ్గురు సిబ్బంది తమ విధులను రెగ్యులర్‌గా నిర్వహిస్తున్నప్పటికీ ఒకరు మాత్రం తన విధులు నిర్వర్తించేందుకు ససేమిరా అంటూ మృతుల బంధువులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మార్చి 1 నుంచి మూడు నెలల పాటు విధులు నిర్వహించేందుకు రొటేషన్ పద్ధతిలో ఓ ఎంఎన్‌వోకు విధులు కేటాయించగా, అతను మొదటి రోజు నుంచి విధులు నిర్వహించేందుకు మొండికేశారు. బుధవారం బెజ్జంకి మండలం నుంచి కాలువలో పడిన ఓ మృతదేహం పోస్టుమార్టం కోసం రాగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోస్టుమార్టం కోసం నిరీక్షించారు. వారి బాధను చూడలేక ఆసుపత్రి అధికారులు చివరకు డ్యూటీలో లేని వ్యక్తిని పిలిపించి పోస్టుమార్టం విధులు నిర్వహించేందుకు పురమాయించారు. గురువారం కూడా అదే పరిస్థితి రిపీట్ అయ్యింది. సదరు ఉద్యోగి వార్డుల్లో డ్యూటీలు కూడా సరిగా చేయడనే ఆరోపణలు ఉన్నాయి.

**అధికారుల చుట్టూ ప్రదక్షిణల్లో డ్రైవర్లు**

ఆసుపత్రిలో ఆరుగురు డ్రైవర్లు విధులు నిర్వహిస్తున్నారు. అయితే వీరు కోరుకున్న విధుల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటారు. అధికారుల సేవల్లో మునిగి తేలుతూ తమ డ్యూటీలు మారకుండా చూసుకోవడమే పనిగా పెట్టుకుంటున్నారు. దీంతో కొందరు ఎవరికి కావాల్సిన పనులు చేసుకుంటుండగా.. మరికొందరు ఏ పనులు లేకుండా సర్టిఫికెట్ల దందా చేసుకుంటూ ఆసుపత్రిలో తిష్టవేశారు. ఇలా అన్ని విభాగాల్లో నియంత్రణ కరువవడంతో పాలన పూర్తిగా గాడితప్పుతోంది. ఈ విషయమై ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రత్నమాలను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా స్పందించలేదు.

## అటెన్షన్ ప్లీజ్: డ్రెయినేజీలో సిల్టు తొలగించాలి



కరీంనగర్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే పార్కు వద్ద ఉన్న డ్రెయినేజీలో పేరుకపోయిన సిల్టు తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఆ ప్రాంతంలో హోటళ్లు ఉండటంతో వాటి వ్యర్థాలు డ్రెయినేజీలోనే వేయడంతో దుర్వాసన వస్తోందని అంటున్నారు. హోటల్ వ్యర్థాలను మున్సిపల్ చెత్త ట్రాక్టర్‌లో వేయాలంటూ అధికారులు వారికి సూచనలు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.
- సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ప్రశ్నించాల్సిన అధికారి : ఇస్లావత్ సేవా, మున్సిపల్ కమిషనర్, కరీంనగర్
సెల్ నంబర్ : 98499 05876

## పక్కా ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న రవీందర్‌సింగ్

కరీంనగర్: పదో తరగతి విద్యార్థులు పక్కా ప్రణాళికలతో చదువుకుంటూ వచ్చే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, డీఈవో జనార్దన్‌రావు అన్నారు. గురువారం నగరంలోని షాదీఖానాలో ఉర్దూమీడియం పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. అనంతరం స్టడీ మెటీరియల్, పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కెప్టెన్ మధుసూదన్‌రెడ్డి, ఇస్తియాక్, హుస్సేన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, దండబోయిన రాము, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంఐఎం ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న గులాం అహ్మద్

విద్యానగర్ (కరీంనగర్): ఏఐఎంఐఎం పార్టీ 65వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం 52, 27వ డివిజన్‌లలోని ముకరంపుర, హుస్సేనిపురలలో పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని జెండాలు ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, జాయింట్ సెక్రెటరీ ఖమరుద్దీన్, కార్పొరేటర్లు అబ్బాస్ సమీ, శర్ఫుద్దీన్, అఖీల్ ఫిరోజ్, ఆతిన, అలిబాబా, నాయకులు ఫసియుద్దీన్ ఖాలీద్, కాజమ్ అలీఖాన్, అన్నెమల్ల సురేశ్, సాజిద్, అజీముల్లాహ్ ఖాన్, షకిలుద్దీన్, అత్తు, ఇస్మాయిల్, ఇలియాజ్, అబ్దుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటుకు మద్దతు తెలపండి



కృష్ణయ్యకు వినతిపత్రం ఇస్తున్న ఈవీ శ్రీనివాస్

కొత్తపల్లి: రాష్ట్రంలో మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటుకు మద్దతు తెలపాలని కోరుతూ హైదరాబాద్‌లో రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను గురువారం ఆల్ ఇండియా మున్నూరుకాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఈవీ శ్రీనివాస్ కలిసి వినతిపత్రం అందజేశారు. జనాభాలో 20 శాతం ఉన్న మున్నూరుకాపులకు కార్పొరేషన్ అత్యవసరమని, కాపులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కార్పొరేషన్ ఏర్పాటు కావల్సిన అవసరమని వివరించారు. రాజకీయ పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులంతా మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ మున్నూరు కాపులకు కార్పొరేషన్ ఏర్పాటుకు తన మద్దతు ఉంటుందని, ఈ విషయమై సీఎం కేసీఆర్‌కు లేఖ రాస్తానని హామీ ఇచ్చారు. హైకోర్టు న్యాయవాది ఎర్ర సత్యనారాయణ, యువజన అవార్డీ ఏ.కిరణ్ కుమార్, టి.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన కంటి వైద్యం



కంటివెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్

కరీంనగర్‌సిటీ: రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు ద్వారా ప్రజలకు మెరుగైన కంటి వైద్యం అందిస్తోందని మేయర్ సునీల్‌రావు అన్నారు. 53వ డివిజన్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని గురువారం సందర్శించారు. డివిజన్ ప్రజలతో పాటు కళాశాల విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్రారంభించారు. పలువురు డివిజన్ ప్రజలకు, విద్యార్థినులకు కంటి పరీక్షలు చేయించి అవసరమైన కళ్ల జోడు అందజేశారు. ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా సీఎం కేసీఆర్ చేపట్టిన గొప్ప కార్యక్రమానికి రోజురోజుకూ ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ స్వరూపరాణి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, లెక్చరర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ నటేశ్

కరీంనగర్: సామాజిక, ఆర్థిక విలువలు సాధించడం విద్యతోనే సాధ్యమని, ఇష్టంగా కష్టపడి చదువుకుంటే భవిష్యత్‌లో ఉన్నతస్థాయిలో ఉద్యోగాన్ని పొందే అవకాశం ఉంటుందని వన్ టౌన్ సీఐ నటేశ్ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఎస్సై, కానిస్టేబుల్ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఉన్నతమైన ఆలోచనలు చేసి వాటి సాకారం కోసం ప్రతిఒక్కరూ కష్టపడి చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారులు రాజా మనోహర్‌రావు, రంగారెడ్డి, కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా.రవి కుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా సీడబ్ల్యూసీ గోదాం వ్యవస్థాపక దినోత్సవం



మాట్లాడుతున్న జి.వెంకన్న

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని సీడబ్ల్యూసీ గోదాం 67వ వ్యవస్థాపక దినోత్సవాన్ని కరీంనగర్ మేనేజర్ జి.వెంకన్న ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1951 మార్చి 2న సీడబ్ల్యూసీ గోదాం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పునాది వేసిందన్నారు. మూడున్నరేళ్లలో కరీంనగర్ శాఖ రూ.22 కోట్లు లాభాలు గడించిందని తెలిపారు. కార్మికులంతా ఐక్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తే మంచి లాభాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎండీ షుకూర్, నిరంజన్, శరత్, ప్రదీప్, ప్రభు, రవికుమార్, శివ, వెంకటేశ్, శ్రీ ఆంజనేయ లేబర్ కాంట్రాక్టు సొసైటీ అధ్యక్షుడు సదయ్య, కార్యదర్శి సత్యనారాయణ, కార్మికులు లక్ష్మిరాజం, రాజవీరు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన ఫ్యామిలీ ఫెస్ట్



తల్లిదండ్రులను సత్కరిస్తున్న తమ పిల్లలు

సప్తగిరికాలనీ(కరీంనగర్): విద్యారణ్యపురిలోని శ్రీచైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్వహించిన ఫ్యామిలీ ఫెస్ట్ అలరించింది. విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదపూజ చేసి శాలువాలతో సత్కరించి తల్లిదండ్రుల మీద ఉన్న ప్రేమను చాటుకున్నారు. విద్యార్థుల్లో విద్యను పెంపొందింప చేయడంతో పాటు వారిలో నైతిక విలువలను పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ ఆచార్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, మధూకర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## జోడో యాత్రలను ప్రజలు విశ్వసించట్లే

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలను ప్రజలు విశ్వసించడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. త్రిపుర, నాగాలాండ్ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఘన విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీపై విషం చిమ్మాలని ప్రయత్నం చేసినప్పటికీ ప్రజలు తిప్పి కొట్టారని, ఇది కాంగ్రెస్‌కు చెంపపెట్టు లాంటి తీర్పని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి హుజురాబాద్‌లో పాదయాత్ర సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌లపై అనవసర వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. లోపాయికారి అవగాహనతో ఇప్పటి నుంచే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు కలిసి పని చేస్తున్నాయని ఆరోపించారు. రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలపై మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు.

## డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

కరీంనగర్‌సిటీ: నగరంలోని అంబేడ్కర్ స్టేడియంలో గల ప్రధాన స్టాం వాటర్ డ్రెయినేజీ బుడుగు సమస్యపై నగర పాలక సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టింది. మేయర్ సునీల్‌రావు ఆదేశాల మేరకు గురువారం కమిషనర్ సేవా ఇస్లావత్, ఇంజినీరింగ్ అధికారులు, స్మార్ట్ సిటీ అధికారులు డ్రెయినేజీ పూడికతీత పనులు ప్రారంభించారు. డ్రెయినేజీలో ఎవరు పడకుండా చుట్టూ కర్రల సహాయంతో తాత్కాలిక భారీకేడ్ నిర్మాణం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సేవా ఇస్లావత్ మాట్లాడుతూ మేయర్ ఆదేశాల మేరకు డ్రెయినేజీలో పేరుకపోయిన చెత్తాచెదారంను యంత్రాల సాయంతో తొలగించి, ప్రజలు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గణేశ్‌నగర్ రోడ్డులో స్టాం వాటర్ డ్రెయినేజీ పనులు కొనసాగుతుండటంతో డ్రెయినేజీ కనెక్షన్‌ను చిన్న మురుగు కాల్వకు అనుసంధానం చేయడంతో ఈ సమస్య తలెత్తిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్, ఎస్ఈ నాగమల్లేశ్వర్‌రావు, డీఈ మసూద్‌అలీ, ఏఈ గంగాధర్, స్మార్ట్‌సిటీ అధికారులు సందీప్ కృష్ణ, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు నైతికత, మానవ విలువలపై పరీక్ష

సప్తగిరికాలనీ(కరీంనగర్), జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, ఇంతకు ముందు ఈ పరీక్షల్లో అర్హత సాధించని విద్యార్థులకు ఈనెల 4న నైతికత, మానవ విలువలపై, 6న పర్యావరణ విద్యపై పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఇంటర్ విద్యాధికారి టి.రాజ్యలక్ష్మి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. జిల్లాలో గల అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్స్ విద్యార్థులందరికీ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.

## ముత్తారంలో బోనాల జాతర



శంకరపట్నం: మండలంలోని ముత్తారంలో గురువారం పెద్దమ్మతల్లి బోనాలు నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనంతో గ్రామంలోని వీధులగుండా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు సమర్పించారు.

## అంబులెన్స్‌లోనే భూ రిజిస్ట్రేషన్



భూమి రిజిస్ట్రేషన్ చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రావు

శంకరపట్నం: మండలంలోని చింతగుట్ట గ్రామానికి చెందిన ఆడెపు సదయ్య రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యం కోసం వ్యవసాయ భూమిని ఆడెపు సరోజన, బాకారపు కుమార్‌కు విక్రయించాడు. భూ రిజిస్ట్రేషన్ కోసం అంబులెన్స్‌లో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోగా నడవలేని స్థితిలో ఉన్న రైతు వద్దకే తహసీల్దార్ శ్రీనివాస్‌రావు వచ్చి అంబులెన్స్‌లోనే భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు.

## పీఎంఈజీపీ లబ్ధిదారుకు సన్మానం



లబ్ధిపొందిన ట్రాన్స్‌జెండర్‌ను సన్మానించిన నాయకులు

కరీంనగర్‌టౌన్: ప్రధానమంత్రి ఉపాధి పథకం (పీఎంఈజీపీ) ద్వారా లబ్ధిపొందిన నగరంలోని సుభాష్‌నగర్‌కు చెందిన ట్రాన్స్‌జెండర్‌ను గురువారం బీజేపీ నాయకులు సన్మానించారు. ఫొటోస్టూడియో ఏర్పాటుకు రూ.5లక్షలు నిధులు పొందిన ట్రాన్స్‌జెండర్ ఇంటికి బీజేపీ పార్లమెంటు కన్వీనర్ ప్రవీణ్‌రావు, మీడియా సెల్ కన్వీనర్ కటకం లోకేశ్, కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ తదితరులు వెళ్లి శుభాకాంక్షలు తెలిపి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రావు మాట్లాడుతూ పీఎంఈజీపీ ఉపాధికి మార్గమని, నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించడమే ఈ పథకం ముఖ్య లక్ష్యమని అన్నారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఇప్పటివరకు దాదాపు 1,285 యూనిట్లకు సుమారు రూ.44 కోట్లు అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నార్త్ జోన్ అధ్యక్షుడు పాదం శివరాజ్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ జ్ఞానచందనీ ప్రఫుల్, నాయకులు తోట అనిల్‌కుమార్, బోయిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మతు చేయాలని బైఠాయింపు

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ గ్రామం ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం బీఎస్పీ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. గుంతల రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఏళ్లు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డును పరిశీలిస్తే బంగారు తెలంగాణ కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా స్పందన రాకపోవడం శోచనీయమన్నారు. ధర్నాలో కొంకటి శేఖర్, ఇరుగురాల రమేశ్, విద్యాసాగర్, అరీఫ్, ఉదయ్, శశికుమార్, నరేందర్ పాల్గొన్నారు.

## చెట్ల తొలగింపుపై ఆందోళన

తిమ్మాపూర్: మహాత్మానగర్ గ్రామ పంచాయతీ పరిధి ఎల్ఎండీ కాలనీలోని ఎస్సారెస్పీ స్థలంలో చెట్లను ఎమ్మెల్యే బాలకిషన్ తొలగింపజేస్తున్నారని ఆరోపిస్తూ బీఎస్పీ, బీజేపీ నాయకులు గురువారం ఆందోళన చేశారు. 6న ఎల్ఎండీ కాలనీలో నిర్వహించే మహిళా దినోత్సవ ఏర్పాట్లలో వృక్షాలు తొలగిస్తుండటంతో నిరసన తెలిపారు. సంఘటన స్థలానికి తిమ్మాపూర్ సీఐ రమేష్, ఎస్సై ప్రమోద్ రెడ్డి చేరుకుని ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. నిరసనలో బీజేపీ మండల అధ్యక్షుడు జగదీశ్వరాచారి, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రం, నాయకులు పాల్గొన్నారు

## క్లుప్తంగా...

### నేటి నుంచి తిరుమలలో తెప్పోత్సవాలు

5 రోజుల పాటు పలు ఆర్జిత సేవల రద్దు

**తిరుమల:** తిరుమలలోని శ్రీవారి పుష్కరిణిలో శుక్రవారం నుంచి 5 రోజులు పాటు తెప్పోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా విద్యుద్దీపాలతో తిరుమల ఆలయం, పరిసరాలను శోభాయమానంగా అలంకరించారు. శ్రీవారి తెప్పోత్సవాల్లో పాల్గొనాలనుకునే భక్తుల కోసం టీటీడీ కరెంట్ బుకింగ్ ద్వారా ప్రతిరోజు 200 టికెట్లను జారీ చేయనుంది. ఈ టికెట్లు ఉన్న భక్తులను టీటీడీ పుష్కరిణిలోకి ప్రత్యేకంగా అనుమతించనుంది. తెప్పోత్సవాల నేపథ్యంలో 5 రోజుల పాటు పలు ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. టైం స్లాట్ దర్శన టికెట్లు కలిగిన వారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 16 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### హ్యాండ్లూమ్ ఎక్స్‌పో 11 నుంచి

**సాక్షి, హైదరాబాద్:** నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఈనెల 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నేషనల్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో–2023ని నిర్వహించనున్నారు. రాష్ట్ర చేనేత ఉత్పత్తుల సంస్థ, జాతీయ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఈ ఎక్స్‌పో నిర్వహిస్తున్నారు. భారతదేశం నలుమూలల నుంచి చేనేత ఏజెన్సీల భాగస్వామ్యం ఉంటుందని పేర్కొన్నారు. ఎక్స్‌పోలో 20 నుంచి 30 శాతం తగ్గింపు ధరలకు ఉత్పత్తులను విక్రయిస్తారని నిర్వాహకులు తెలిపారు.

### విద్యుత్ పీఆర్సీపై 6న చర్చలు

జేఏసీల నేతలను ఆహ్వానించిన యాజమాన్యాలు

**సాక్షి, హైదరాబాద్:** విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణపై సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు విద్యుత్ సౌధలో చర్చలకు రావాలని విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీలను విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ఆహ్వానించాయి. సమావేశంలో తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు, ఉత్తర, దక్షిణ డిస్కంల సీఎండీలు రఘుమారెడ్డి, గోపాల్‌రావు ఉద్యోగ నేతలతో చర్చించనున్నారు. అనంతరం పీఆర్సీ ఫిట్‌మెంట్ శాతాన్ని సిఫారసు చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు యాజమాన్యాలు నివేదిక అందజేయనున్నాయి. త్వరలో సీఎం కేసీఆర్ పీఆర్సీపై ప్రకటన చేసే అవకాశం ఉంది.

# ఈసారి ఇయర్ ఎండింగ్ పేరుతో!

- అకౌంట్ టేకోవర్ బారిన మరో సంస్థ
- 8430 డాలర్లు కాజేసిన సైబర్ నేరగాళ్లు
- సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదు




**సాక్షి, హైదరాబాద్:** అంతర్జాతీయ స్థాయిలో లావాదేవీలు చేసే కంపెనీలను టార్గెట్‌గా చేసుకుంటున్న సైబర్ నేరగాళ్లు అకౌంట్ టేకోవర్ ఫ్రాడ్స్ కొనసాగిస్తున్నారు. సిటీ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్ పరిధిలో వారం రోజుల్లో రెండో కేసు నమోదైంది. బంజారాహిల్స్ కేంద్రంగా పని హెచ్‌బీఎల్ పవర్ సిస్టమ్స్ లిమిటెడ్ సంస్థ నుంచి రూ.1.39 లక్షల డాలర్లు కాజేయగా గత శుక్రవారం... బాగ్ అంబర్‌పేట్ ఏబీఆర్ ఆర్గానిక్స్ లిమిటెడ్ సంస్థ నుంచి 8430 డాలర్లు స్వాహా చేయడంపై గురువారం హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఈసారి సైబర్ నేరగాళ్లు ఫైనాన్షియల్ ఇయర్ ఎండింగ్ కారణంగా చూపి తమ బ్యాంకు ఖాతా వివరాలు ఈ–మెయిల్ చేశారు. ఏబీఆర్ సంస్థ వివిధ రకాలైన రేసిన్ సంబంధిత రసాయనాలకు తయారు చేస్తుంది. దీనికోసం కొన్నాళ్లుకు చైనాకు చెందిన సంస్థ నుంచి ముడి పదార్థాలు దిగుమతి చేసుకుంటోంది. దీనికి సంబంధించిన ఇన్వాయిస్‌లు ఈ–మెయిల్ ద్వారా అందుకున్న వెంటనే ఏబీఆర్ సంస్థ నగదును చెల్లిస్తుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో ఉన్న తమ ఖాతా నుంచి చైనాలోని సదరు సంస్థ ఖాతాలోకి ఈ మొత్తం బదిలీ చేస్తుంటుంది. ఈ లావాదేవీలకు సంబంధించి ఈ రెండు సంస్థల మధ్యా ఈ–మెయిల్స్ ద్వారా సంప్రదింపులు జరుగుతాయి. చైనా సంస్థకు చెందిన ఈ–మెయిల్‌ను హ్యాక్ చేయడం ద్వారా సైబర్ నేరగాళ్లు ఈ సంప్రదింపులను గుర్తించారు. నగదు చెల్లింపు సమయం ఆసన్నమైందని తెలుసుకున్న కేటుగాళ్లు చైనా సంస్థ మాదిరిగా ఏబీఆర్‌కు ఈ–మెయిల్ పంపారు. ఆ సంస్థ పేరుతోనే దీన్ని రూపొందించిన సైబర్ క్రిమినల్స్ చివరలో మాత్రం మెయిల్.కామ్‌ను చేర్చారు. అందులో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో తమ బ్యాంకు ఖాతాలకు సంబంధించిన ఆడిటింగ్ జరుగుతోందని, ఈ నేపథ్యంలోనే గతంలో నగదు పంపే ఖాతాలకు కాకుండా కొత్త దానికి పంపాలంటూ సూచించారు. సైబర్ నేరగాళ్లు దుబాయ్‌లో ఉన్న తమ బ్యాంకు ఖాతా వివరాలు ఈ ఈ–మెయిల్‌లో పొందుపరిచారు. ఈ–మెయిల్ ఐడీలో మార్పులు గమనించని ఏబీఆర్ సంస్థ ఇటీవల వచ్చిన ముడి సరుకునకు సంబంధించిన 8430 డాలర్లు (దాదాపు రూ.7 లక్షలు) దుబాయ్‌లోని బ్యాంక్ ఖాతాలోకి బదిలీ చేశారు. గడిచిన కొన్నాళ్లుగా చైనా సంస్థ నుంచి ఏబీఆర్ సంస్థకు వరుస ఈ–మెయిల్స్ వస్తున్నాయి. అందులో తమకు చెల్లించాల్సి మొత్తం తక్షణం బదిలీ చేయాలంటూ చైనా సంస్థ కోరింది. దీంతో ఏబీఆర్ సంస్థ ప్రతినిధులు ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. సంస్థ ఎండీ ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఆలయ భూముల కబ్జాపై నోటీసులు

వివరాలు తెలియజేయాలని అధికారులకు హైకోర్టు ఆదేశం

**సాక్షి, హైదరాబాద్:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆలయ భూముల కబ్జాపై వివరాలు తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 13కు వాయిదా వేసింది. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పరిధిలోని పలు ఆలయాల భూములను కబ్జా చేసి ఏకంగా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారంటూ ఓ పత్రికలో ప్రచురితమైన వార్త ఆధారంగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన సి.అనిల్‌కుమార్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'జడ్చర్లలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన దాదాపు 63 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. దేవరకద్ర మండలం అప్పంపల్లిలో చినరాజమూరి ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన భూమిలో ప్లాట్లు, లే–అవుట్లు వెలిశాయి. నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని 44 ఎకరాల ఆలయ భూమిలో సగానికి పైగా కబ్జాకు గురైంది. పూర్వం రాజులు, నిజాం నవాబులు పాలమూరులోని పలు ఆలయాలకు పెద్ద ఎత్తున భూములు ఇచ్చారు. ఈ భూముల సాగు ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆలయ నిర్వహణకు వెచ్చించాలన్నది వారి సంకల్పం. అయితే ఇటీవల కొందరు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అధికారులు మిలాఖత్ అయి అందినకాడికి దండుకుని భూములను పంచి పెడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో వందల ఎకరాల ఇనాం భూమి అన్యాక్రాంతమైంది. ఆలయ భూములను కాపాడటమే కాకుండా, ఇకపై కబ్జాకు గురికాకుండా న్యాయపరమైన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలి' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధా న న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్‌భూయాన్, జస్టిస్ తుకారాం జీ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. అధికా రులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను వాయిదా వేసింది.

# దోపిడీ పాలకులను గద్దె దింపాలి


ప్రాగటూరులో వలస కూలీలతో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

**ఉండవెల్లి:** తెలంగాణలో దోపిడీ పాలకులను గద్దె దింపి.. బీఎస్పీని అధికారంలోకి తీసుకొస్తే 10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ఆయన చేపట్టిన బహుజన రాజ్యాధికార యాత్ర గురువారం రాత్రి జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం శేరుపల్లె, ప్రాగటూరు, మారమునగాల–1, 2 గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంతకు ముందు మిర్చి తీయడానికి కేటీదొడ్డి నుంచి ప్రాగటూరుకు వచ్చిన వలస కూలీలతో ఆయన మాట్లాడారు. పూరి గుడిసెల్లో ఉంటూ పిల్లలను ఎందుకు ఆగం చేస్తున్నారని వారిని ప్రశ్నించారు, గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకులాల్లో పిల్లల్ని చేర్చాలని సూచించారు. అనంతరం ప్రాగటూరులో పార్టీ జెండాను ఆవిష్కరించారు.

# రియల్ సార్‌కి రీల్ సార్ యూనిట్ సాయం

రంగయ్య మాస్టారుకి రూ.3లక్షలు అందించిన డైరెక్టర్ వెంకీ అట్లూరి




**సాక్షి, హైదరాబాద్:** తమిళనటుడు ధనుష్, సంయుక్తా మీనన్ జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం 'సార్' (తమిళంలో 'వాత్తి'). గత నెల ఫిబ్రవరి 17న విడుదలైన 'సార్' చిత్రంలో కథరీత్యా సిరిపురం అనే ఊరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు జూనియర్ లెక్చరర్‌గా వెళతాడు బాలగంగాధర తిలక్ (సినిమాలో ధనుష్ పాత్ర..) కానీ అక్కడి విద్యార్థులెవరూ కళాశాలకు రాకపోవడంతో వారిని తిరిగి కళాశాలకు వచ్చేలా చేస్తాడు. విద్య గొప్పతనాన్ని తెలియజేస్తూ, కుల వ్యవస్థపై వారిని చైతన్యవంతులను చేసేందుకు కృషి చేస్తాడు తిలక్. ఇదంతా రీల్‌లో.. కానీ రియల్‌గానూ బాలగంగాధర తిలక్ పాత్రను పోలిన వ్యక్తి ఉన్నారు. ఆయనే కేడర్ల రంగయ్య.

**అచ్చు సినిమాలో మాదిరిగానే..**

కొమురం భీం జిల్లా కెరమెరి మండలం సావర్‌ఖేడలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు కేడర్ల రంగయ్య. ఆయన ప్రధానోపాధ్యాయుడిగా ఉన్నప్పుడు ఆ పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్య 60. కానీ కృషి చేసి విద్యార్థుల సంఖ్యను ఆయన 260కి పెంచారు. తన కుమార్తెను అదే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడమే కాకుండా, సొంత డబ్బుతో పాఠశాలకు మరమ్మత్తులు చేపట్టి ఆ గ్రామస్తుల్లో స్ఫూర్తి నింపారు. ఆయనకు ఉత్తమ ఉపాధ్యాయుడిగా జాతీయ అవార్డు కూడా వచ్చింది. కాగా 'సార్' చిత్రానికి కేడర్ల రంగయ్య జీవితం స్ఫూర్తి కాకపోయినప్పటికీ, ఆయన జీవితం 'సార్'లోని ధనుష్ పాత్ర తిలక్‌కు దగ్గరగా ఉండటంతో ఆయన్ను కలిశారు చిత్రదర్శకుడు వెంకీ అట్లూరి. ''సార్ సినిమా చూస్తున్నప్పుడు కొన్ని సన్నివేశాల్లో నన్నే నేను చూసుకున్నట్లు ఉంది'' అని కేడర్ల రంగయ్య చెప్పడంతో వెంకీ ఎంతో సంతోషించారు. కాగా రంగయ్య చేస్తున్న మంచి పనుల్లో భాగస్వామ్యం కావాలని 'సార్' చిత్రం యూనిట్ రూ.మూడు లక్షలను ఆయనకు ఆర్థిక తోడ్పాటుగా అందించారు. విద్యార్థులు, పాఠశాలల్లోని మెరుగైన సదుపాయాలు, లైబ్రరీ నిర్మాణం వంటి వాటికి ఈ నగదును వినియోగించనున్నారు.

# వేసవిలో నీటి కటకట రావొద్దు

మంత్రి ఎర్రబెల్లి ఆదేశాలు

**సాక్షి, హైదరాబాద్:** వేసవిలో తాగునీటి సరఫరాలో ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాలని, రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశించారు. కరెంటు సమస్యలు వచ్చినా నీటి సరఫరా ఆగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. పంపుల నిర్వహణ సరిగా నిర్వహించి పైప్ లైన్ లీకేజీలు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సారి ఎండలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, నీటి సరఫరాకు ఆటంకాలు లేకుండా, అన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గురువారం ఎండా కాలం సన్నద్ధత పై మిషన్ భగీరథ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో... వేసవిలో నిరాటంకంగా నిర్వర్తించాల్సిన మంచినీటి సరఫరాపై మంత్రి సూచనలు చేశారు. అధికారులు సర్వసన్నద్ధంగా ఉండి, సమన్వయంతో పని చేయాలన్నారు. ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి, సీతు, ఈఈలు, అన్ని జిల్లాల ఎస్‌ఈలు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# అయ్యో.. వినయ్ సాయం చేసే వారే లేరా?


హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వినయ్

- సైన్స్‌ఫేర్‌లో కెమికల్ బాటిల్ తీసుకెళ్తూ గాయపడిన విద్యార్థి
- 25 శాతం కాలిన పొట్ట భాగం.. అనేక చోట్ల గాజుముక్కలు

**సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం:** సైన్స్‌ఫేర్‌లో చోటు చేసుకున్న అపశృతితో ఓ పేద విద్యార్థి తీవ్రంగా గాయపడగా.. సాయం కోసం దాతల చేయూతతో పాటు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. గత నెల 28న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మందలపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో అమ్మోనియం రసాయనం బాటిల్‌ను తీసుకెళ్తూ ఆరో తరగతి విద్యార్థి వినయ్‌కుమార్ అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో బాటిల్ పగిలిపోయి అందులోని రసాయనం వినయ్ శరీరంపై పడింది. ప్రాథమిక చికిత్స తర్వాత మెరుగైన వైద్యం కోసం విద్యార్థి తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. రసాయనం శరీరంపై పడడంతో పొట్ట భాగం 25 శాతం మేర కాలిపోగా, గాజు ముక్కలు శరీరంలోని అనేక భాగాలు కుచ్చుకున్నాయని నిర్ధారించారు. చర్మం కాలిన చోట ప్లాస్టిక్ సర్జరీలు చేయాల్సి ఉంటుందని, ఇందుకు రూ.10 లక్షలు ఖర్చు కావొచ్చని వైద్యులు చెబుతున్నారు. కానీ వ్యవసాయకూలీలైన వినయ్ తల్లిదండ్రులు ఆ ఖర్చును భరించే స్థితిలో లేకపోవడంతో దాతలతో పాటు సర్కారు సాయం కోరుతున్నారు.

# దేవుడి కరుణ ఎవరిపైనో..!

- ఆలయ పాలకమండళ్ల నియామకంపై జాప్యం
- ఉమ్మడి జిల్లాలో 16 ఆలయాలకు పాలక మండళ్ల గడువు పూర్తి
- గత డిసెంబర్ 12న నోటిఫికేషన్
- ఆశావహుల హడావుడి
- నేతల చుట్టూ ప్రదక్షిణ


మంచిర్యాలలోని విశ్వనాథ ఆలయం

**మంచిర్యాలఅర్బన్:** ఆలయాల ఆలనాపాలన చూడడంతో పాటు అభివృద్ధిలో కీలకమైన పాలక మండళ్ల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ కావడంతో ఆశావహుల్లో హడావుడి మొదలైంది. దేవుని సేవల్లో ప్రధాన భాగస్వామ్యం ధర్మకర్తల మండలి సభ్యులదే కావడంతో అధికార పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు ఉవ్విళ్లూరుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు ఆలయాల పాలకమండలి ఏర్పాటుకు గతేడాది డిసెంబర్ 12న నోటిఫికేషన్ జారీ అయ్యింది.

**ఆలయ కమిటీల ఏర్పాటు ఇలా...**

దేవాదాయశాఖ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16 ఆలయాలకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఆలయాల ఆదాయాన్ని బట్టి 6–ఏ, 6–బీ, 6–సీ లుగా విభజించారు. రూ.25 లక్షలకు పైగా ఆదాయం ఉన్న ఆలయాలకు 14 మంది, 2 నుంచి రూ.25లక్షల లోపు ఉన్న ఆలయాలకు ఏడుగురు రూ.2 లక్షలోపు ఉంటే ఐదుగురు సభ్యులతో పాలకమండలి నియామకం చేపట్టనున్నారు.

**ఈ ఆలయాలకే..**

ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లోని లక్ష్మీనారాయణస్వామి, హనుమాన్ ఆలయం, ఆదిలాబాద్ పట్టణంలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి, గోపాల్‌క్రిష్ణస్వామి ఆలయాలు, నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఎల్వత్‌లోని దత్తాత్రేయస్వామి ఆలయం, కుమురం భీం జిల్లా ఈజ్‌గాంలోని కేశవనాథస్వామి, శివమల్లన్నస్వామి ఆలయాలు, మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం వేలాల గట్టుమల్లన్నస్వామి, జన్నారం మండలం చింతగూడలోని శ్రీలక్ష్మీదేవి, చెన్నూర్ మధున పోచమ్మ, కత్తెరసాల మల్లన్నస్వామి, బెల్లంపల్లి పట్టణంలోని శ్రీ కోదండ రామాలయం, కన్నాలలోని బుగ్గ రాజేశ్వరస్వామి, శ్రీరాంపూర్‌లోని శ్రీగణపతి షిర్డీ సాయిబాబా, గౌతమేశ్వరస్వామి ఆలయాలకు నూతన పాలకమండళ్ల నియామకానికి దేవాదాయ ధర్మాదాయశాఖ గతేడాది డిసెంబర్ 12న నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో కొన్ని ఆలయాలకు కమిటీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించినా మిగతా ఆలయాలకు సాంకేతిక, ఇతర కారణాల దృష్ట్యా అమలుకు నోచుకోవడంలేదు.

**రెనోవేషన్ కమిటీ ఏర్పాటు ఇలా..**

ఆలయ పాలకవర్గం అవకాశం లేనిచోట రెనోవేషన్ కమిటీతో సర్దుబాటు చేస్తున్నారు. రూ.25 లక్షలకు పైగా ఆదాయం ఉన్న ఆలయాలపై కోర్టు కేసు ఉండడంతో రెనోవేషన్ కమిటీతో భర్తీ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వరస్వామి, విశ్వనాథస్వామి, మంచిర్యాల, వేలాల మల్లన్నస్వామి ఆలయాలకు రెనోవేషన్ కమిటీని నియామించేందుకు జనవరి 30న నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఆసక్తి కలిగిన అభ్యర్థులు పదిరోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని దేవాదాయశాఖ నోటీసు సూచించింది. కానీ ఇంతవరకూ రెనోవేషన్ కమిటీ నియామకం జరగకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.

**రెనోవేషన్ కమిటీలో సర్దుబాటు**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని విశ్వనాథస్వామి ఆలయ కమిటీ నియామకంపై జాప్యం జరుగుతుండడంతో రెనోవేషన్ కమిటీతో సరిపెడుతున్నారు. జనవరి 3తో గడువు ముగియడంతో రెనోవేషన్ కమిటీలోనైనా చోటు కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. 1991 నుంచి ఇప్పటి వరకు ఆర్యవైశ్యులే ఆలయ పాలక మండలి చైర్మన్ బాధ్యతలు చేపట్టారు. ఈసారి బీసీలతో పాటు ఇతరత్రా సామాజిక వర్గాలకు చెందిన వారు కూడా రెనోవేషన్ కమిటీ చైర్మన్‌పై పట్టుబడుతున్నారు. అంతేకాకుండా గౌతమేశ్వరస్వామి, శ్రీరాంపూర్‌లోని షిర్డీసాయి ఆలయం, సమ్మక్క, సారలమ్మ జాతర కమిటీపై జాప్యం జరుగుతుండడంతో ఆశావహులు నిరాశ చెందుతున్నారు. పదవులు దక్కని రాజకీయ నిరుద్యోగులు ఆలయ కమిటీల్లోనైనా చోటు దక్కకుండా పోతుందా? అనే గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. ఇందుకు నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆలయ పాలకమండలి, రెనోవేషన్ కమిటీలో ఎవరికి చోటు దక్కుతుందో చూడాలి.

# త్వరలో చెత్తతో విద్యుత్ ఉత్పత్తి

- ఎన్టీపీసీ ఈడీ సునిల్‌కుమార్
- వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కు భూమిపూజ


ప్లాంటు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఈడీ సునిల్‌కుమార్

**జ్యోతినగర్(రామగుండం):** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని చెత్తను సేకరించి విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తామని, ఇందుకు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను నిర్మిస్తామని ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునిల్‌కుమార్ అన్నారు. గురువారం ప్రాజెక్టు సమీపంలోని మియావాకి మొక్కల పెంపకం కేంద్రం ఆవరణలో ప్లాంట్ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. రోజుకు మూడు టన్నుల చెత్తను కాలుస్తూ విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ నిర్మిస్తామన్నారు. తద్వారా రామగుండం కార్పొరేషన్ చెత్తరహిత ప్రాంతంగా మారుతుందని తెలిపారు. ఎన్టీపీసీ టౌన్‌షిప్, ప్లాంట్ పరిధిలో వెలువడే చెత్త, గాలికి పడిపోచిన చెట్లు, వివిధ డివిజన్లలో రోజువారీగా వెలుపడే చెత్తను వి నియోగిస్తామని అన్నారు. ప్లాంట్‌ను ఏడాదిలోపు వినియోగంలోకి తెస్తామన్నారు. సీజీఎం ప్రసేంజిత్ పాల్, జీఎంలు లార్డ్, దేశాయ్, పటేల్, ఏజీఎం లక్కిరెడ్డి, నాగరాజు, శ్యాంసుందర్, అధికారుల సంఘం నాయకులు ఎంజే.నాయుడు, సోమ్లా బూక్యా, ఉద్యోగ గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి కొలిపాక మల్లయ్య పాల్గొన్నారు.

# నేటి నుంచి వ్యాయామ ఉపాధ్యాయుల సెమినార్

- వ్యాయామ విద్యపై అవగాహన
- హాజరుకానున్న 250 మంది పీఈటీ, పీడీలు

**కరీంనగర్‌స్పోర్ట్స్:** పెటా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రెండు రోజులపాటు కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో పీఈటీ, పీడీలందరకీ సెమినార్, క్రీడలను నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 250 మందికి పైగా పీఈటీ, పీడీలు ఇందులో పాల్గొననున్నారు. వీరందరికి వ్యాయామ విద్య ఎక్స్‌పర్ట్స్ పలు అంశాలపై అవగాహన కల్పించనున్నారు.

**కొత్త క్రీడలపై క్లినిక్.. క్రీడలపై ప్రక్షాళన**


వ్యాయామ విద్యపై సెమినార్‌ను పలు అంశాల్లో విషయ నిపుణులు నిర్వహిస్తారు. 317 జీవో ప్రకారం జిల్లాలకు మారిన వారు.. గత డీఎస్సీలలో కొత్తగా రిక్రూట్ అయిన వారికి ఇలాంటి సెమినార్లు ఎంతగానో దోహదపడుతాయి. కొత్త క్రీడలపై క్లినిక్‌తో పాటు క్రీడలపై ప్రక్షాళన, కొత్త రూల్స్, కొత్త టెక్నిక్‌లు, ఎస్జీఎఫ్ క్రీడలు తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు. అదే విధంగా ఫిజియోథెరపిపైనా అవగాహన కల్పిస్తారు.

**సద్వినియోగం చేసుకోవాలి..**



వ్యాయామ విద్యపై పీఈటీలకు, పీడీలకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న సెమినార్‌ను సద్వినియోగం చేసుకోవా లి. రెండేళ్ల అనంతరం కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరుగుతోంది. వ్యాయామ ఉపాధ్యాయులకు ఎంతో అవసరం. – అంతడ్పుల శ్రీనివాస్, పెటా సంఘం అధ్యక్షుడు

# ఆర్జీయూకేటీలో కంప్యూటేషనల్ గణితంపై వర్క్‌షాప్


మాట్లాడుతున్న వర్సిటీ డైరెక్టర్ సతీష్‌కుమార్


హాజరైన విద్యార్థులు

**భైంసా:** నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంటు ఆధ్వర్యంలో కంప్యూటేషనల్ మ్యాథమెటిక్స్‌పై గురువారం ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్ మాట్లాడుతూ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ హ్యూమానిటీస్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి ప్రతీ విభాగంలో సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ వర్క్‌షాప్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇంజనీరింగ్ చేస్తున్న ప్రతీ విద్యార్థికి గణిత శాస్త్రం ముఖ్యమైందన్నారు. ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ మాట్లాడుతూ మ్యాథమెటిక్స్ వర్క్‌షాప్‌తో విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. అధ్యాపకులు సునీల్, నగేశ్, ప్రకాశ్, కుమార్ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. వర్క్‌షాప్‌లో పీయూసీ ఫస్ట్, సెకండ్ ఇయర్, ఇంజినీరింగ్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 800 మంది పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందించారు. వర్క్‌షాప్ కోఆర్డినేటర్ డాక్టర్ దత్తుహల్లే, మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంటు హెచ్‌వోడీ మధుసూదన్ ఆడెపు, అధ్యాపకులు తిరుపతిరావు, తారాబాయి, ప్రవీణ్ రావు, సంధ్యారాణి పాల్గొన్నారు.

# హైవే పనులు వేగిరం కావాలి

- ఎల్కతుర్తి– సిద్దిపేట హైవే పనుల పురోగతిపై అధికారులతో సంజయ్ భేటీ
- 26 మైనర్ బ్రిడ్జిల పునర్నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న బండి
- ముల్కనూర్ డెయిరీ వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని సూచన

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ రహదారుల విస్తరణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా తగిన చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ నేషనల్ హైవే అథారిటీ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో చేపడుతున్న ఎల్కతుర్తి– సిద్దిపేట (ఎన్‌హెచ్– 765) విస్తరణ పనుల పురోగతిపై కేంద్ర రోడ్లు, రవాణా శాఖ అధికారులతో గురువారం ఆయన హైదరాబాద్‌లో సమీక్ష జరిపారు. ప్రధాని చేతుల మీదుగా గతేడాది రూ.578.85 కోట్ల అంచనాతో చేపట్టిన ఈ రహదారి పనులు 63.641 కి.మీల మేర పనులు కొనసాగుతున్నట్లు అధికారులు సంజయ్‌కు వివరించారు. సిద్దిపేట జిల్లా రంగధామంపల్లి బ్రిడ్జి నుంచి ఎల్కతుర్తి జంక్షన్ వరకు మిట్టపల్లి, ముండ్రాయి, పల్మాకుల, బద్దిపడగ, బస్వాపురం, సముద్రాల, పందిళ్ల, హుస్నాబాద్, పోతారం (ఎస్), జిల్లెలగడ్డ, ముల్కనూర్, కొత్తపల్లి, ఇందిరానగర్, ఎల్కతుర్తి గ్రామాల మీదుగా రహదారి విస్తరణ పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ పనుల్లో భాగంగా బస్వాపూర్, పందిళ్ల వద్ద నిర్మించబోతున్న మేజర్ బ్రిడ్జి నిర్మాణంతోపాటు 26 మైనర్ బ్రిడ్జిల పునర్నిర్మాణం వివరాలను బండి సంజయ్ అడిగి తెలుసుకున్నారు. ముల్కనూరు డెయిరీ సంస్థకు ఇబ్బంది లేకుండా ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో జాతీయ రహదారుల శాఖ తెలంగాణ రీజనల్ అధికారి కుశ్వాహ, ఈఈ సుబోధ్, ఎస్‌ఈ మోహన్, ఈఈ మనోహర్, సంబంధిత నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ సుమన్ బారువా తదితరులు పాల్గొన్నారు.

### తక్కువ ఖర్చులో విదేశాలకు పార్శిళ్లు

- కరీంనగర్ డివిజన్ పోస్టల్ ఎస్పీ వెంకటేశ్వర్లు

**విద్యానగర్(కరీంనగర్):** విదేశాల్లో ఉన్నవారికి పార్శిళ్లు తక్కువ ఖర్చుతో పంపించేందుకు తపాలా శాఖ డాక్ ఘర్ నిర్యత్ కేంద్రాన్ని(డీఎన్‌కే) ఏర్పాటు చేసిందని కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాలకు వస్తువులు, తినుబండారాలు, మందులు, గిఫ్ట్ ఆర్టికల్స్ ఇతర సామగ్రిని పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఫ్రీ హోం పికప్‌తోపాటు అతి తక్కువ ధరలో పార్శిల్ ప్యాక్ చేయనున్నట్లు తెలిపారు. ఎగుమతిదారులు వారి కార్యాలయంలోనే అన్ని వివరాలను సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయవచ్చని, తద్వారా కస్టమ్స్ చెకింగ్‌లోనూ ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. కరీంనగర్ హెడ్ పోస్టాఫీస్ పరిధిలో డాక్ ఘర్ నిర్యత్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యాపార సంస్థలు, విదేశాలకు వస్తువులు పంపించేవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# యువర్స్

● టెక్.. టాక్



## యూట్యూబ్ మ్యూజిక్‌లో పాడ్‌కాస్ట్

యూట్యూబ్ మ్యూజిక్ త్వరలో తమ ఆడియో అండ్ వీడియో కంటెంట్ లైబ్రరీలో పాడ్‌కాస్ట్‌ను చేర్చనుంది. దీనితో పాటు పాడ్‌కాస్ట్ క్రియేషన్ టూల్స్‌ను కూడా యూట్యూబ్ స్టూడియోకు తీసుకురానుంది. పాడ్‌కాస్ట్ వినాలన్నా, వీడియో ఫార్మట్‌లో చూడాలన్నా వీలవుతుంది. యూజర్లు తమ సొంత రేడియో స్టేషన్‌లను క్రియేట్ చేసుకునే ఫీచర్‌ను 'యూట్యూబ్ మ్యూజిక్' తీసుకువచ్చింది. 30 మంది ఆర్టిస్ట్‌లకు సంబంధించిన పాటలతో యూజర్‌లు సొంత రేడియో క్రియేట్ చేసుకోవచ్చు. దీనిలో 'డిస్కవరీస్' 'చిల్ సాంగ్స్' ఫిల్టర్‌లను ఉపయోగించుకోవచ్చు.



## మోటోరోలా ఎడ్జ్ 30 ఫ్యూజన్

డిస్‌ప్లే: 6.55 అంగుళాలు బ్యాటరీ: 4400 ఎంఏహెచ్
బరువు: 168 గ్రా. రిజల్యూషన్: 1080X2400 పిక్సెల్స్
ర్యామ్: 8జీబి , ఇంటర్నల్ స్టోరేజ్: 128జీబి
ఓఎస్: ఆండ్రాయిడ్ 12 రిఫ్రెష్‌రేట్: 144 హెచ్‌జెడ్
● ట్రిపుల్ కెమెరా సెటప్. కలర్స్: బ్లూ, సోలార్ గోల్డ్, అరోర వైట్





## షావోమి వాచ్ ఎస్1 ప్రో

సైజ్: 1.47 అంగుళాలు (480X480 పిక్సెల్స్)
● హార్ట్‌రేట్ సెన్సర్ ● స్లీప్ ట్రాకింగ్
● సపోర్ట్: 100 ప్లస్ ఫిట్‌నెస్ మోడ్స్
● వాటర్ రెసిస్టెంట్ ● సపోర్ట్ వైర్‌లెస్ ఛార్జింగ్
● బ్యాటరీ లైఫ్: 14 రోజులు
● బ్లూటూత్ 5.2 స్పీకర్ అండ్ మైక్రోఫోన్

● సక్సెస్ స్టోరీ



'కాలం కలిసి రావాలి' అంటూ కాలాన్ని మాత్రమే నమ్ముకునే వారు ఒక రకం.
'కాలం కలిసి రావాలి అంటే కష్ట పడాలి' అనుకునే వారు రెండో రకం.
'రైతుబిడ్డ' విక్రమ్‌సింగ్ రెండో రకానికి చెందిన కుర్రాడు.
తన నాయకత్వ లక్షణాలతో 'ఆఫ్‌బిజినెస్'కు కొత్త వెలుగు తీసుకువచ్చాడు...

## RAW రా రాజు

హరియాణా మహేంద్రగఢ్ జిల్లాలోని మల్రా గ్రామంలో రైతు కుటుంబానికి చెందిన విక్రమ్‌సింగ్ ఖరీదైన స్కూళ్లలో ఎప్పుడూ చదువుకోలేదు. ఆరవతరగతిలో మాత్రమే ఇంగ్లీష్ చదువుకునే అవకాశం వచ్చింది. స్కూల్ పూర్తయిన తరువాత పొలానికి వెళ్లి తండ్రికి సహాయం చేసేవాడు.

'ఏ పనైనా ఇష్టంగా చేయాలి. నాకు వ్యవసాయం అంటే ఇష్టం. నువ్వు కూడా చదువును ఇష్టంగా చదువుకోవాలి. చదువుకోవడం నా వల్ల కాదు అనిపిస్తే నాతో పాటు పనిచెయ్యి' అనే వాడు నాన్న.

మరోవైపు స్నేహితులు...'నువ్వు రెజ్లర్ కాకపోతే జీవితంలో ఏది సాధించలేవు' అనేవారు. ఆ ప్రాంతంలో రెజ్లింగ్ బాగా పాపులర్. ప్రైజ్‌మనీ కూడా భారీగా ఉండేది. స్నేహితుల మాటలతో రెజ్లర్ కావాలనే ఆశ విక్రమ్‌లో మొలకెత్తింది. ఎక్కడ రెజ్లింగ్ పోటీలు జరిగినా వెళ్లేవాడు. ఇది గమనించిన టీచర్ 'నువ్వు చదువులో ముందున్నావు. నీకు మంచి భవిష్యత్ ఉంది. ఇలా రెజ్లింగ్ అంటూ ఊళ్లు తిరిగితే చదువు దెబ్బతింటుంది' అని హెచ్చరించాడు.

ఇక అప్పటి నుంచి తన మనసులో నుంచి 'రెజ్లింగ్'ను డిలిట్ చేశాడు విక్రమ్.

ఇంజినీరింగ్ పూర్తి చేసిన తరువాత దిల్లీలో ఎంబీఏ చేశాడు. ఆ తరువాత కామర్స్ అండ్ ఫిన్‌టెక్ స్టార్టప్ 'ఆఫ్‌బిజినెస్'లో చేరాడు.

మూడు సంవత్సరాల తరువాత విక్రమ్ దశ తిరిగింది. 'ఆఫ్‌బిజినెస్'కు ఉన్న మూడు యూనిట్‌లలో ఒకటైన 'రా మెటీరియల్ బిజినెస్ యూనిట్'కు నాయకత్వ బాధ్యతలు అప్పగించడానికి సరియైన వ్యక్తుల కోసం కంపెనీ పెద్దలు చూస్తున్న సమయంలో వారికి విక్రమ్ పేరు తట్టింది. అలా విక్రమ్ 'రా మెటీరియల్ బిజినెస్ యూనిట్'కు హెడ్ అయ్యాడు.

'రా మెటీరియల్స్ ఎట్ లోయెస్ట్ ప్రైసెస్-గ్యారెంటీడ్' అనే మాటలో మాంత్రికశక్తి లేకపోవచ్చు. అయితే దీన్ని కస్టమర్‌లలోకి బలంగా తీసుకెళ్లడంలో విక్రమ్ విజయం సాధించాడు.

ఫ్రెషర్స్‌తో తనదైన ఒక టీమ్‌ను ఏర్పాటు చేసుకొని, అడుగులో అడుగు వేస్తూ మెల్లగా నడుస్తున్న యూనిట్‌ను పరుగెత్తేలా చేశాడు. కోట్ల టర్నోవర్‌కు చేర్చాడు.

'విక్రమ్‌లో నాయకత్వ లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. మా నమ్మకాన్ని నిలబెట్టాడు' అంటున్నాడు 'ఆఫ్‌బిజినెస్' సీయీవో ఆశీష్ మహాపాత్రో.

'అదృష్టం కష్టం వైపు మొగ్గు చూపుతుంది అంటారు. నేను కష్టాన్నే నమ్ముకున్నాను. రైట్ ప్లేస్‌లో రైట్‌పర్సన్‌గా గుర్తింపు తెచ్చుకున్నప్పుడే విజయం సాధించగలం' అంటున్న 29 సంవత్సరాల విక్రమ్ సింగ్ 'ఫోర్బ్స్ ఇండియా 30 అండర్ 30' జాబితాలో చోటు సంపాదించాడు.

● ఇంగ్లిష్ ఇడియమ్స్




బాధ, నిరాశనిస్పృహ....రకరకాల వికారకర సందర్భాల్లో ఉపయోగించే ఇడియమ్ ఫీల్ బ్లూ. **ఉదా:** ఐ ఫీల్ బ్లూ ఎవ్రీ టైమ్ ఐ థింక్ ఎబౌట్ దట్ టైమ్. ఇట్ మేక్స్ మీ సో ఆంగ్రీ ఆల్‌సో **ఇక దీని మూలాల్లోకి వెళితే...** 1785లో ప్రచురితమైన 'ఏ క్లాసిక్ డిక్షనరీ'లో ఈ ఎక్స్‌ప్రెషన్ కనిపిస్తుంది. కలవరపాటు, అసంతృప్తి, భయం మొదలైన సందర్భాల్లో 'ఫీల్ బ్లూ' అనే మాటను ఆ కాలంలో ఉపయోగించేవారు. అయితే 1800లో దీన్ని వైద్యరంగంలో ఉపయోగించేవారు.పేషెంట్ చనిపోయే స్థితిలో ఉన్నప్పుడు 'బ్లూ' కలర్‌ను ప్రతీకాత్మకంగా ప్రదర్శించేవారు. అలా బ్లూ కలర్ అనేది విషాదానికి సింబల్‌గా మారింది.

● గేమింగ్ : నేడే విడుదల

## టెరిఫిక్ టైగర్

యాక్షన్-రోల్ ప్లేయింగ్ గేమ్ 'వో లాంగ్ ఫాలెన్ డైనెస్టీ' నేడు విడుదల అవుతుంది. గేమ్ ప్రారంభంలో ప్లేయర్స్ అయిదు రకాల క్యారెక్టర్స్ నుంచి తమ సొంత అవతార్‌ను సృష్టించుకోవాలి. ఈ గేమ్‌లో శత్రువులపై చేసే క్లోజ్‌డ్ రేంజ్ ఎటాక్స్ కోసం రెండు ఆప్షన్స్ ఉంటాయి. శత్రువును బలహీన పరచడానికి దైవికశక్తులు ఉన్న రెక్కల గుర్రం, వైట్ టైగర్, డ్రాగన్...మొదలైన జంతువులను ఎంపిక చేసుకోవచ్చు.

ఆయుధాల విషయానికి వస్తే...ఇనుప ఖడ్గం నుంచి అడ్డవిల్లు వరకు పదమూడు రకాల ఆయుధాలలో ఏదో ఒకటి ఎంచుకోవచ్చు. అయితే ఏ ఆయుధాన్ని ఎంచుకున్నాం అనేదానికంటే, ఎలా పోరాడారు అనేదే ముఖ్యం. ఒక్కరుగానే కాదు కోఆపరేటివ్ మల్టీప్లేయర్ మోడ్‌లోనూ ఈ గేమ్ ఆడవచ్చు.

ఒక సైనిక యోధుడు క్రూరమైన రాక్షసులు, జంతువులతో పోరాడడమే మూలకథ. రెక్కల గుర్రంతో, చేతిలో ఖడ్గంతో వీర విహారం చేస్తూ వచ్చిన ట్రైలర్ గేమ్‌పై ఎన్నో అంచనాలు పెంచింది.

**జానర్:** యాక్షన్-రోల్ ప్లేయింగ్ గేమ్/ హ్యాక్ అండ్ స్లాష్ **మోడ్స్:** సింగిల్ ప్లేయర్/ మల్టీ ప్లేయర్. **ప్లాట్‌ఫామ్స్:** ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్/ఎక్స్‌బాక్స్ ఎక్స్/ఎస్.



● యంగ్ టాలెంట్


వర్షిత

థాయ్‌లాండ్‌లో పుట్టిన వర్షిత పదమూడేళ్ల వయసులో తల్లిదండ్రులతో ఇండియాకు వచ్చింది. సంగీతం అంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. చెన్నైలోని 'కేఎం మ్యూజిక్ కన్జర్వేటరీ'లో మ్యూజిక్ కోర్సు చేసింది. 'స్వర్ణభూమి అకాడమీ ఆఫ్ మ్యూజిక్' నిర్వహించిన వర్క్‌షాప్‌కు హాజరైన తరువాత జాజ్ మ్యూజిక్‌పై ఆసక్తి మొదలైంది.

వర్షిత ఫస్ట్ సింగిల్ 'స్టే'కు మంచి స్పందన వచ్చింది. స్పాటిఫై, యూట్యూబ్, సౌండ్‌క్లౌడ్‌లో ఆమె పాటలు ఎంతో ఆదరణ పొందాయి. ఇరవై సంవత్సరాల వయసులో సెవెన్ ఐలాండ్ ఫిల్మ్‌ఫెస్టివల్, కోవ్లాంగ్ పాయింట్ సర్ఫ్ అండ్ మ్యూజిక్ ఫెస్టివల్‌లాంటి ఎన్నో ఫెస్టివల్స్‌లో తన గాత్రాన్ని వినిపించింది వర్షిత. ఏఆర్‌రెహమాన్ మ్యూజిక్ ట్రూప్‌లో భాగంగా దేశవిదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చింది. 22 సంవత్సరాల వర్షిత పాటలు పాడడంలోనే కాదు రాయడంలో కూడా ప్రతిభ చూపుతుంది.


వర్షిత పాటల్లో ఎంత మాధుర్యం ఉంటుందో, మాటల్లో అంత ఆత్మవిశ్వాసం కనిపిస్తుంది. వ్యక్తిత్వ వికాస కోణంలో ఎన్నో కళాశాలల్లో స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసాలు ఇచ్చింది.

● అవును...ఇది నిజమే!



● ప్రాచీన రోమ్‌లో మార్చి నెలతో కొత్త సంవత్సరం మొదలయ్యేది. ఈ నెలలో రోమన్లు 'మార్స్ ఫెస్టివల్'ను ఘనంగా జరుపుకునేవారు. సంగీత కచేరిల నుంచి మల్లయుద్ధాల వరకు రకరకాల కార్యక్రమాలు నిర్వహించేవారు. మార్స్ (అంగారకుడు)ని వ్యవసాయం, యుద్ధానికి సంబంధించిన ఆరాధ్యదైవంగా భావించేవారు. పురవీధుల్లో అంగారకుడి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ఊరేగించేవారు. ● వాల్ట్ డిస్నీ ప్రొడక్షన్ 1812 నాటి జర్మన్ జానపద కథను తీసుకొని 'స్నో వైట్ అండ్ ది సెవెన్ డ్వార్ఫ్స్' (1937) చిత్రాన్ని తీసింది. ఏడుగురు మరుగుజ్జులకు ఒరిజనల్‌లో లేని పేర్లు పెట్టడానికి వందలాంది పేర్లు అనుకున్నారు. చివరికి జంపీ, డెఫీ, చెస్టీ, టుబ్బి, గబ్బి...మొదలైన పేర్లు పెట్టారు.

# సినిమా


● మహేశ్‌బాబు

## ఆర్మ్ డే

గురువారం మహేశ్‌బాబు కొత్త లుక్‌తో ఫ్యాన్స్‌ను సర్‌ప్రైజ్ చేశారు. జిమ్‌లోని తన ఫిటినెస్ ఫొటో షేర్ చేసి, ఫ్యాన్స్‌కి ట్రీట్ ఇచ్చారు. బైసెప్స్ వర్కవుట్ అనంతరం నరాలు కనిపిస్తున్న ఫొటో షేర్ చేసి, 'ఆర్మ్ డే' అని కాప్షన్ ఇచ్చారు మహేశ్. స్టన్నింగ్ న్యూ లుక్‌లో ఉన్న ఆయన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్నారు మహేశ్‌బాబు. ఈ చిత్రం తర్వాత రాజమౌళి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తారాయన. ఈ తాజా మేకోవర్ ఈ రెండు చిత్రాల కోసమే అని ఊహించవచ్చు.


● అల్లు అర్జున్

## రజనీ@170

రజనీకాంత్ 170వ సినిమా ఖరారైంది. రజనీ హీరోగా 'జై భీమ్' ఫేమ్ దర్శకుడు టీజే జ్ఞానవేల్ ఓ సినిమాను తెరకెక్కించనున్నారు. లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ ఈ సినిమాను నిర్మించనున్నారు. గురువారం (మార్చి 2) సుభాస్కరన్ బర్త్ డే సందర్భంగా రజనీ 170వ సినిమాను ప్రకటించారు. '2.ఓ (2018)', 'దర్బార్' (2020) చిత్రాల తర్వాత రజనీకాంత్ హీరోగా లైకా ప్రొడక్షన్స్ సంస్థలో రూపొందనున్న మూడో సినిమా ఇది. వచ్చే ఏడాది ఈ చిత్రం విడుదల కానుంది. ఇక ఇదే సంస్థ రజనీ కుమార్తె ఐశ్వర్య దర్శకత్వంలో నిర్మిస్తున్న 'లాల్ సలామ్'లో రజనీ ఓ కీలక పాత్ర చేస్తున్నారు.


● రజనీకాంత్


## పఠాన్ ఆఫర్


● షారుక్

షారుక్ ఖాన్ టైటిల్ రోల్‌లో రూపొందిన చిత్రం 'పఠాన్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో ఆదిత్యా చోప్రా నిర్మించిన ఈ చిత్రం జనవరి 25న విడుదలైంది. ఈ సినిమా రూ. వెయ్యి కోట్లు సాధించిన విషయం తెలిసిందే. ఈ రికార్డు సాధించే ముందు ప్రేక్షకులను థియేటర్స్‌కు రప్పించడానికి కొన్ని మల్టీప్లెక్స్‌లలో టికెట్ ధరలను తగ్గించింది చిత్ర యూనిట్. తాజాగా మళ్లీ 'పఠాన్' యూనిట్ టికెట్ పరంగా ఓ బంపర్ ఆఫర్ ఇచ్చింది. ''మార్చి 3 నుంచి 5 వరకు 'పఠాన్' టికెట్ ఒకటి కొంటే మరోటి ఉచితం. కొన్ని నియమ నిబంధనలతో ఈ ఆఫర్ ప్రేక్షకులకు అందిస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. కాగా నెట్ షేర్ విషయంలో హిందీ బాక్సాఫీస్ కలెక్షన్స్‌లో టాప్ ప్లేస్‌లో ఉన్న 'బాహుబలి: ది కన్‌క్లూజన్' రికార్డును అధిగమించడానికే 'పఠాన్' యూనిట్ ఇలా టికెట్ తగ్గించే ప్లాన్ వేసిందనే టాక్ వినిపిస్తోంది.

## రానాతో వార్ అంత సులువు కాదు - వెంకటేష్

''సంక్లిష్టమైన పాత్రలు నన్ను ఆకర్షిస్తాయి. 'రానా నాయుడు'లో నేను చేసిన నాగనాయుడు అలాంటి పాత్రే. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నమైన వ్యక్తిత్వం ఉన్న పాత్రను పోషించడం సవాలుగా అనిపించినప్పటికీ సంతృప్తిని ఇచ్చింది'' అని హీరో వెంకటేష్ అన్నారు. కరణ్ అన్షుమాన్- సుపర్ణ్ ఎస్. వర్మ దర్శకత్వం వహించిన 'రానా నాయుడు' వెబ్ సిరీస్‌లో వెంకటేష్, రానా తొలిసారి కలిసి నటించారు. కరణ్ అన్షుమాన్ నిర్మించిన ఈ సిరీస్ ఈ నెల 10 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ- ''వెబ్ సిరీస్‌లో పని చేయడానికి, సినిమాలో చేయడానికి చాలా తేడా ఉంటుంది. వెబ్ సిరీస్‌లో కథ చెప్పే వేగం శైలికి అలవాటు పడటానికి నాకు కొంత సమయం పట్టింది. ఇందులో నెగిటివ్ పాత్రను పోషించడం నావరకూ రిఫ్రెషింగ్ చేంజ్. 'రానా నాయుడు'లో మునుపెన్నడూ చూడని పాత్రలో నన్ను చూస్తారు. రానాకి ఎదురుగా నిలబడి వార్ చేయడం అంత సులువు కాదు.. నటుడిగా నాకిది ఒక సవాల్. నిజ జీవితంలో మేం బాబాయ్ అబ్బాయ్‌లా కాకుండా స్నేహితుల్లా ఉంటాం. కానీ తెరపై ఒకరంటే ఒకరికి పడని తండ్రీ కొడుకులుగా వార్ ఈక్వేషన్ తీసుకురావడం కష్టం అనిపించింది. ఇది కచ్చితంగా మా ఇద్దరికీ కొత్త ప్రయత్నం'' అన్నారు.


● వెంకటేష్

## తగ్గేదే లే

సోషల్ మీడియాలో ఫాలోయర్స్ విషయంలో ఏ మాత్రం తగ్గేదే లే అంటున్నారు అల్లు అర్జున్. ఇన్‌స్టాగ్రామ్‌లో అల్లు అర్జున్ ఫాలోయర్స్ జాబితా 20 మిలియన్స్ (2 కోట్లు)కు చేరింది. దక్షిణాదిన ఈ ఫీట్‌ను సాధించిన తొలి హీరో అల్లు అర్జున్ కావడం విశేషం. అయితే 'పుష్ప' తొలి భాగం రిలీజ్‌కు ముందు అల్లు అర్జున్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో 12 మిలియన్ల ఫాలోయర్లు ఉంటే ఆ సినిమా విడుదల తర్వాత వచ్చిన పాన్ ఇండియా క్రేజ్‌తో 20 మిలియన్స్‌కు చేరుకుందని ఫ్యాన్స్ హ్యాపీ ఫీలవుతున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే... ప్రస్తుతం 'పుష్ప' మలి భాగం 'పుష్ప: ది రూల్'లో నటిస్తున్నారు అల్లు అర్జున్. ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఏప్రిల్ 8న అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా ఈ చిత్రం టీజర్‌ను రిలీజ్ చేసే ఆలోచనలో యూనిట్ ఉందట. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా 2024లో రిలీజ్ కానుంది.

## సమాధానం అక్కడే వెతకాలి!


● సాయిధరమ్

సాయిధరమ్ తేజ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'విరూపాక్ష'. కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సంయుక్తా మీనన్ హీరోయిన్. బాపినీడు .బి సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పీ, సుకుమార్ రైటింగ్స్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఏప్రిల్ 21న రిలీజ్ కానుంది. 'విరూపాక్ష' టీజర్‌ను పవన్ కల్యాణ్ రిలీజ్ చేశారు. 'ప్రశ్న ఎక్కడ మొదలైందో సమాధానం అక్కడే వెతకాలి, ప్రమాదాన్ని దాటడానికే నా ప్రయాణం' అని సాయిధరమ్ చెప్పే డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే: సుకుమార్, కెమెరా: శ్యామ్‌దత్ సైనుద్దీన్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: సతీష్ బీకేఆర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అశోక్ బండ్రెడ్డి.

## బేబీతో ఎంట్రీ


● ఆర్య దయాళ్

మలయాళంలో గాయనిగా మంచి పేరు తెచ్చుకున్న ఆర్య దయాళ్ 'బేబీ' సినిమాతో తెలుగుకి పరిచయమవుతున్నారు. ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'బేబీ'. సాయి రాజేశ్ దర్శకత్వంలో ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమాలోని 'ఓ రెండు ప్రేమ మేఘాలిలా' పాట పాడారు ఆర్య దయాళ్. ''విజయ్ బుల్గానిన్ సంగీతం అందించిన ఈ పాటకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఆర్య పాడిన తొలి తెలుగు పాట ఇదే కావడం విశేషం'' అన్నారు ఎస్‌కేఎన్. ''ఈ పాట ఇప్పటివరకూ అన్ని డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో 2 కోట్ల వ్యూస్ సంపాదించింది'' అన్నారు సాయి రాజేశ్.

## గ్రంథాలయంలో యాక్షన్


● విన్ను, స్మిరిత

విన్ను మద్దిపాటి, స్మిరిత రాణి బోర జంటగా నటించిన చిత్రం 'గ్రంథాలయం'. సాయిశివన్ జంపాన దర్శకత్వంలో ఎస్. వైష్ణవి శ్రీ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా సాయిశివన్ మాట్లాడుతూ- ''సూపర్ యాక్షన్ థ్రిల్లర్‌గా వస్తున్న సినిమా ఇది'' అన్నారు. ''అందరూ కుటుంబంతో కలిసి 'గ్రంథాలయం' చూసి హిట్ చేయాలి'' అని విన్ను మద్దిపాటి అన్నారు. నిర్మాత అయ్యప్ప అల్లంనేని మాట్లాడారు.

## ఫోన్ గేమ్ నేపథ్యంలో...


● సత్య ఎస్‌కే, హేమరాజ్

సత్య ఎస్‌కే, నవీన్ నేని, ప్రణీత పట్నాయక్, చందన రాజ్, ప్రవీణ్ రెడ్డి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'రిచిగాడి పెళ్లి'. కేఎస్ హేమరాజ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శక-నిర్మాత హేమరాజ్ మాట్లాడుతూ- ''ఒక ఫోన్ గేమ్ ఆధారంగా తీసిన ఫీల్ గుడ్ ఎమోషనల్ డ్రామా 'రిచిగాడి పెళ్లి'. మా సినిమా ప్రీమియర్ షోకి చాలా మంచి స్పందన వచ్చింది'' అన్నారు.

## కస్టడీలో రాజు


● అరవింద్ స్వామి

చెరసాలలో ఉన్నారు అరవింద్ స్వామి. ఎందుకంటే 'కస్టడీ' సినిమా కోసం. అక్కినేని నాగచైతన్య, కృతీ శెట్టి జంటగా వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన చిత్రం 'కస్టడీ'. ఈ చిత్రం షూటింగ్ ఇటీవలే పూర్తయింది. సినిమాలోని కీలక తారాగణం లుక్స్‌ని విడుదల చేస్తున్న యూనిట్ గురువారం అరవింద్ స్వామి లుక్‌ని విడుదల చేసింది. ఇందులో రాజు అలియాస్ రాజు అనే పాత్రలో కనిపించనున్నారు అరవింద్ స్వామి. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ మే 12న రిలీజ్ కానుంది.

## రెండు రోజుల క్రితం గుండెపోటు

● ఇప్పుడంతా బాగానే ఉంది


● తండ్రి సుబీర్‌తో సుస్మిత

మాజీ విశ్వసుందరి, నటి సుస్మితా సేన్ గురువారం ఒక షాకింగ్ న్యూస్‌ని బయటపెట్టారు. సోషల్ మీడియా వేదికగా ఈ వార్తను పంచుకున్నారామె. ''నీ హృదయాన్ని ఎప్పుడూ సంతోషంగా, ధైర్యంగా ఉంచు నివ్వు. నీ కష్టకాలంలో, నీకు అవసరమైన సమయంలో అది నీకు అండగా ఉంటుంది' అని మా నాన్న సుబీర్ సేన్ చెప్పిన విలువైన మాటలివి. రెండు రోజుల క్రితం నేను గుండెపోటుకు గురయ్యాను. వైద్యులు యాంజియోప్లాస్టీ చేశారు. స్టంట్ వేశారు. ఇంకో ముఖ్యమైన విషయం ఏంటంటే... నా కార్డియాలజిస్ట్ నా గుండె చాలా గట్టిదన్నట్లుగా చెప్పారు. అలాగే చాలామంది నా ఆరోగ్యం గురించి ఆందోళన చెందారు. ఈ విషయం గురించి మరొక పోస్ట్‌లో ప్రస్తావిస్తాను. ఇక నా ఆరోగ్యం బాగానే ఉందని చెప్పడానికి ఈ విషయాలను షేర్ చేస్తున్నాను. ప్రస్తుతానికి ఆల్ ఈజ్ వెల్. కొత్త జీవితం గడిపేందుకు నాకు అవకాశం లభించింది'' అని ఓ పోస్ట్‌ను షేర్ చేశారు సుస్మితా సేన్. ఈ వార్త తెలియగానే పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు సుస్మిత త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియా వేదికగా స్పందించారు.

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | |
|---|---|
| సెన్సెక్స్ ▽ | నిఫ్టీ ▽ |
| 502 | 129 |
| 58,909 | 17,322 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

| విదేశీ సూచీలు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11.30 గంటలకు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 11,341 | ▽ | 38 |
| డోజోన్స్ | 32,798 | △ | 136 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,944 | △ | 21 |
| డాక్స్ | 15,328 | △ | 23 |
| షాంఘై | 3,311 | ▽ | 1 |
| నికాయ్ | 27,498 | ▽ | 18 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**బులియన్** రూ.లలో — ముంబై

| | | |
|---|---|---|
| బంగారం (24 క్యారెట్) | | |
| 56,087 | ▽ | 53 |
| బంగారం (22 క్యారెట్) | | |
| 55,863 | ▽ | 52 |
| వెండి (కిలో) | | |
| 63,706 | ▽ | 540 |

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఒకటి | 81.82 | 83.40 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఒకటి | 97.60 | 100.88 |
| € | యూరో | ఒకటి | 86.47 | 89.56 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఒకటి | 59.66 | 61.59 |
| AUS$ | ఆస్ట్రేలియా డాలర్ | ఒకటి | 54.65 | 57.00 |
| S$ | సింగపూర్ డాలర్ | ఒకటి | 60.47 | 62.44 |
| SAR | సౌదీ రియాల్ | పదింతలకు | 21.03 | 22.70 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | పదింతలకు | 21.59 | 23.38 |
| ¥ | చైనా యువాన్ | పదింతలకు | 10.84 | 12.91 |

# అర్షద్ వార్సీపై సెబీ నిషేధం

- మరో 44 మంది వ్యక్తులు, సంస్థలకు షాక్
- జాబితాలో మారియా గోరెట్టి



**న్యూఢిల్లీ:** యూట్యూబ్ చానళ్ల ద్వారా రెండు కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా ప్రభావితం చేసిన కేసులో నటుడు అర్షద్ వార్సీసహా 44 మంది వ్యక్తులు, సంస్థలపై క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిషేధ అస్త్రాన్ని ప్రయోగించింది. తప్పుడు వీడియోలను అప్‌లోడ్ చేయడం ద్వారా షేర్ల ధరల అవకతవకలకు పాల్పడిన కేసులో అర్షద్ భార్య మారియా గోరెట్టిసహా ఇతర వ్యక్తులు, సంస్థలను తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకూ క్యాపిటల్ మార్కెట్ల నుంచి నిషేధించింది. దీంతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సెక్యూరిటీల కొనుగోలు, అమ్మకం లేదా ఏ ఇతర లావాదేవీలు చేపట్టేందుకు వీలుండదు. అంతేకాకుండా వీరంతా ఎలాంటి ఆస్తులనూ విక్రయించేందుకు అనుమతించరు. బ్యాంక్ ఖాతాలలోని సొమ్ముసహా ఎలాంటి ఆస్తులనూ వినియోగించేందుకు వీలుండదు. ఎస్క్రో ఖాతాలో నిర్ధారించిన సొమ్మును జమ చేసేందుకు మాత్రమే సెబీ అనుమతిస్తుంది.

**కేసు వివరాలు..:** సాధనా బ్రాడ్‌క్యాస్ట్ లిమిటెడ్, షార్ప్‌లైన్ బ్రాడ్‌క్యాస్ట్ లిమిటెడ్‌లపై యూట్యూబ్ చానళ్లలో తప్పుదారి పట్టించే వీడియోలు అప్‌లోడ్ చేయడంతోపాటు.. షేర్లు కొనుగోలు చేయమంటూ ఇన్వెస్టర్లకు సిఫారసులు చేయడంపై సెబీ కేసులు నమోదు చేసింది. వీటి ద్వారా అక్రమంగా రూ. 54 కోట్లు ఆర్జించినట్లు గుర్తించింది. ఈ కేసులలో అర్షద్, మారియాసహా.. సాధనా బ్రాడ్‌క్యాస్ట్ ప్రమోటర్లలో కొంతమందిపై సైతం నిషేధం విధిస్తూ సెబీ రెండు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. తప్పుదారి పట్టించే వీడియోలు, షేర్ల కొనుగోలుకి అక్రమ సిఫారసులపై ఆరోపణలు రావడంతో సెబీ 2022 ఏప్రిల్– సెప్టెంబర్ మధ్య విచారణను చేపట్టింది. వెరసి 2022 ఏప్రిల్– జూలై మధ్య కాలంలో షేర్ల ధరల కదలికల్లో అక్రమాలను గుర్తించింది.

## చేతక్.. 'ప్రీమియం 2023'

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** వాహన తయారీ దిగ్గజం బజాజ్ ఆటో తాజాగా చేతక్ ప్రీమియం 2023 ఎడిషన్‌ను ఆవిష్కరించింది. హైదరాబాద్ ఎక్స్‌షోరూంలో ధర రూ.1,51,217 ఉంది. మ్యాట్ కరీబియన్ బ్లూ, మ్యాట్ కోర్స్ గ్రే, సాటిన్ బ్లాక్ రంగుల్లో లభిస్తుంది. ఒకసారి చార్జింగ్‌తో 90 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. గరిష్ట వేగం గంటకు 63 కిలోమీటర్లు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మోడల్ ధర రూ.1,21,712 ఉంది.



విడిభాగాల సరఫరా వ్యవస్థను పునర్నిర్మించామని, ముఖ్య విక్రేతలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో గణనీయమైన పురోగతిని సాధించామని కంపెనీ తెలిపింది. దీంతో నెలకు 10,000 యూనిట్లకు పైగా చేతక్ లభ్యతకు హామీ లభించడమేగాక మరింత మంది కస్టమర్లకు అందుబాటులో ఉండేలా ఖర్చులను తగ్గించిందని వెల్లడించింది. బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. డెలివరీలు ఏప్రిల్ నుంచి ఉంటాయి.

# షేర్ల విక్రయంతో అదానీకి నిధులు

- 4 కంపెనీలలో స్వల్ప వాటాలు
- రూ. 15,446 కోట్లు సమీకరణ




**న్యూఢిల్లీ:** లిస్టెడ్ కంపెనీలు నాలుగింటిలో స్వల్పంగా వాటాలు విక్రయించినట్లు ప్రయివేట్ రంగ డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ తాజాగా పేర్కొంది. తద్వారా 1.87 బిలియన్ డాలర్లు(రూ. 15,446 కోట్లు) సమకూర్చుకున్నట్లు వెల్లడించింది. అమెరికా ఈక్విటీ పెట్టుబడుల కంపెనీ జీక్యూజీ పార్టనర్స్‌కు షేర్లను విక్రయించినట్లు తెలియజేసింది. సెకండరీ మార్కెట్లో బ్లాక్ డీల్స్ ద్వారా అదానీ ఎంటర్‌ప్రైజెస్(ఏఈఎల్), అదానీ పోర్ట్స్ అండ్ సెజ్(ఏపీసెజ్), అదానీ గ్రీన్ ఎనర్జీ(ఏజీఈఎల్), అదానీ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్(ఏటీఎల్)లకు చెందిన మైనారిటీ వాటాలను విక్రయించినట్లు అదానీ గ్రూప్ ఒక ప్రకటనలో పేర్కొంది. దేశీ మౌలిక సదుపాయాల రంగ అభివృద్ధి, విస్తరణలో కీలక పెట్టుబడిదారుగా అదానీ గ్రూప్ కంపెనీలలో జీక్యూజీ ఇన్వెస్ట్ చేసినట్లు తెలియజేసింది. రానున్న నెలల్లో 2 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 16,500 కోట్లు) రుణ చెల్లింపులు చేపట్టవలసి ఉన్న నేపథ్యంలో వాటాల విక్రయం ప్రాధాన్యతను సంతరించుకుంది. గ్రూప్ మొత్తం రూ. 2.21 లక్షల కోట్ల రుణ భారాన్ని కలిగి ఉంది. దీనిలో వచ్చే ఆర్థిక సంవత్సరం(2023–24)లోగా 8 శాతం రుణాలను తిరిగి చెల్లించవలసి ఉంది.

**ప్రమోటర్ల వాటా ఇలా**

అదానీ గ్రూప్‌లోని ప్రధాన కంపెనీలు ఏఈఎల్‌లో ప్రమోటర్లకు 72.6 శాతం వాటా ఉంది. దీనిలో తాజాగా 3.39 శాతం వాటాకు సమానమైన 3.8 కోట్ల షేర్లను జీక్యూజీకి విక్రయించింది. తద్వారా రూ. 5,460 కోట్లు లభించాయి. ఇక ఏపీసెజ్‌లో గల 66% వాటాలో 4.1% వాటాను విక్రయించింది. 8.8 కోట్ల షేర్లకుగాను రూ. 5,282 కోట్లు పొందింది. ఈ బాటలో ఏటీఎల్‌లో 73.9% వాటా కలిగిన అదానీ గ్రూప్ 2.5% వాటాకు సమానమైన 2.8 కోట్ల షేర్లను అమ్మింది. రూ. 1,898 కోట్లు అందుకుంది. ఏజీఈఎల్‌లో గల 60.5% వాటాలో 3.5% వాటాను విక్రయించింది. 5.5 కోట్ల షేర్ల ద్వారా రూ. 2,806 కోట్లు లభించాయి. ఈ లావాదేవీలకు జెఫరీస్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ బ్రోకర్‌గా వ్యవహరించింది. కాగా.. అదానీ గ్రూప్ కంపెనీలలో ఇన్వెస్ట్ చేసినందుకు ఉత్సాహపడుతున్నట్లు జీక్యూజీ పార్టనర్స్ చైర్మన్, సీఐవో రాజీవ్ జైన్ తెలిపారు. దేశీయంగా, ప్రపంచవ్యాప్తంగా అదానీ కంపెనీలు భారీస్థాయిలో, కీలక మౌలిక సదుపాయాల ఆస్తులను కలిగి ఉండటంతోపాటు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ ఆయన తరం ఉత్తమ వ్యాపారవేత్తలలో ఒకరిగా గుర్తింపు పొందినట్లు ప్రస్తావించారు.

## అతిపెద్ద 5జీ ఆపరేటర్‌గా జియో!

**బార్సిలోనా:** సరసమైన సేవలతో ప్రపంచంలోనే అతిపెద్ద 5జీ (స్టాండలోన్) నెట్‌వర్క్ ఆపరేటర్‌గా ఈ ఏడాది జియో అవతరిస్తుందని సంస్థ తెలిపింది. రెండవ అర్ధ భాగంగా ఈ ఘనతను సాధిస్తామని రిలయన్స్ జియో ప్రెసిడెంట్ మాథ్యూ ఊమెన్ మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ సందర్భంగా వెల్లడించారు. 'అన్ని అధునాతన సేవలు, సామర్థ్యాలు ప్రజలకు అందుబాటులో ఉండేలా కంపెనీ చూస్తుంది. భారత్‌కు సమ్మిళిత వృద్ధి అవసరం. ఈ విషయంలో జియో మద్దతునిస్తూనే ఉంటుంది' అని చెప్పారు.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 3-3-2023 | |
|---|---|
| విశాఖ | 415–00 |
| చిత్తూరు | 458–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 415–00 |
| విజయవాడ | 415–00 |
| రిటైల్ ధర (డజను) | 66.00 |
| **2-3-2023 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 390–00 |
| వరంగల్ | 392–00 |
| రిటైల్ ధర | 4.50 |

# మార్కెట్‌కు మళ్లీ నష్టాలు

- లాభాలు ఒకరోజుకే పరిమితం
- ట్రేడింగ్ ఆద్యంతం నష్టాలే
- సెన్సెక్స్ నష్టం 502 పాయింట్లు
- ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు




**ముంబై:** స్టాక్ సూచీల లాభాలు ఒకరోజుకు పరిమితమయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, ప్రపంచ మార్కెట్లలోని ప్రతికూలతలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఐటీ, బ్యాంకింగ్, ఆటో, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో సెన్సెక్స్ 502 పాయింట్లు పతనమై 58,909 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 129 పాయింట్లు క్షీణించి 17,322 వద్ద నిలిచింది. నష్టాల మార్కెట్లోనూ ఇంధన, యుటిలిటీ, ఆయిల్‌అండ్‌గ్యాస్, విద్యుత్, రియల్టీ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఉదయం సూచీలు బలహీనంగా మొదలయ్యాయి. ఏ దశలోనూ కొనుగోళ్ల మద్దతు లభించకపోవడంతో ట్రేడింగ్ ఆద్యంతం నష్టాల్లో కదలాడాయి. సెన్సెక్స్ 545 పాయింట్లు నష్టపోయి 59,411 వద్ద, నిఫ్టీ 145 పాయింట్లు క్షీణించి 17,306 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.12,771 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,129 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 11 పైసలు క్షీణించి 82.60 స్థాయి వద్ద స్థిరపడింది. అధిక ద్రవ్యోల్బణం మరి కొంత కాలం కొనసాగొచ్చనే ఆందోళనల మధ్య వడ్డీరేట్లు మరింత పెరుగుతాయనే భయాలతో ప్రపంచ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

''అమెరికాలో ద్రవ్యోల్బణం కొనసాగొచ్చని ఇటీవల విడుదలైన ఆ దేశపు స్థూల ఆర్థిక డేటా సూచించడంతో పదేళ్ల బాండ్లపై రాబడి నాలుగు శాతం మించి నమోదైంది. ఫలితంగా ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లోకి మళ్లాయి. బాండ్లపై రాబడులు పెరగడంతో భారత్ వంటి వర్ధమాన దేశాల నుంచి పెట్టుబడులు తరలిపోతున్నాయి. ఎఫ్ఐఐలు వరుసగా ఆరో ట్రేడింగ్ సెషన్లలో నికర విక్రయదారులుగా నిలిచారు. లార్జ్ క్యాప్ షేర్లతో పోలిస్తే చిన్న, మధ్య తరహా షేర్లలో విక్రయాలు తక్కువగా ఉండటం కలిసొచ్చే అంశంగా ఉంది'' అని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

**అదానీ షేర్లలో రెండోరోజూ ర్యాలీ**

అదానీ గ్రూప్ తన లిస్టెడ్ కంపెనీలు నాలుగింటిలో స్వల్పంగా వాటాలు విక్రయించి రూ.15,446 కోట్లు సమకూర్చుకోవడంతో ఈ గ్రూప్ షేర్లలో రెండోరోజూ ర్యాలీ కొనసాగింది. మరోవైపు హిండెన్‌బర్గ్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కమిటీ నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో అదానీ ట్రాన్స్‌మిషన్, అదానీ గ్రీన్, అదానీ పవర్, అదానీ విల్మార్, ఎన్‌డీటీవీ, అదానీ టోటల్ గ్యాస్ షేర్లు ఐదు శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. అదానీ పోర్ట్స్ 3.5%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 3%, ఏసీసీ సిమెంట్స్ ఒకటిన్నర శాతం పెరిగాయి. గత రెండురోజుల్లో రూ.70,302 కోట్ల సంపద సృష్టి జరిడంతో గ్రూప్ కంపెనీల మొత్తం మార్కెట్ వ్యాల్యుయేషన్ రూ.7.86 లక్షల కోట్లకు చేరింది.

# బీడీఎంఏ టెక్నాలజీ సెంటర్

హెటిరో రూ. కోటి సాయం

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** బల్క్ డ్రగ్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (బీడీఎంఏ) టెక్నాలజీ, ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. హైదరాబాద్ జీడిమెట్ల ఫార్మా క్లస్టర్‌లో 2023 ఏప్రిల్ నుంచి ఈ కేంద్రం కార్యరూపం దాల్చనుంది. టీఎస్ఐఐసీ ఒక ఎకరం స్థలాన్ని దీర్ఘకాలిక లీజు పద్ధతిన సమకూర్చింది. ఈ ఫెసిలిటీ కోసం హెటిరో గ్రూప్ రూ. కోటి ఆర్థిక సాయం అందించింది. ఇతర సంస్థలు సైతం ఆర్థిక సాయానికి ముందుకు వస్తాయని అసోసియేషన్ భావిస్తోంది. ఔషధ రంగంలో పనిచేస్తున్న మానవ వనరులకు నైపుణ్యం పెంపొందించేందుకు ఈ సెంటర్‌లో శిక్షణ ఇస్తారు. అలాగే బీడీఎంఏ సభ్య కంపెనీలు నూతనంగా నియమించుకున్న ఉద్యోగులకు ఇక్కడ ట్రైనింగ్ కల్పిస్తారు. ఆధునిక పరిశోధన, పరీక్షలకు కేంద్ర స్థానంగా ఇది నిలుస్తుందని బీడీఎంఏ తెలిపింది. పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘం ఈ విధంగా సాంకేతిక, శిక్షణ కేంద్రం నెలకొల్పడం దేశంలో తొలిసారి అని పేర్కొంది. ఈ సదుపాయం ప్రపంచ వ్యాప్తంగా ఫార్మా రంగంలో వస్తున్న నూతన పరిశోధనలు, ఆవిష్కరణలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు సామర్థ్యం పెంచుకోవడానికి నాలెడ్జ్ సెంటర్‌గా కూడా పని చేస్తుందని అభిప్రాయపడింది.



హెటిరో గ్రూప్ చైర్మన్ బి.పార్థ సారథి రెడ్డి నుంచి రూ.1 కోటి చెక్‌ను అందుకుంటున్న బీడీఎంఏ ప్రతినిధులు ఆర్.కె.అగ్రవాల్, సీహెచ్ ఏపీ రామేశ్వర రావు

## నాట్కో షేర్ల బైబ్యాక్!

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఔషధ తయారీ సంస్థ నాట్కో ఫార్మా రూ.2 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనను డైరెక్టర్ల బోర్డు పరిశీలిస్తుందని గురువారం తెలిపింది. మార్చి 8న డైరెక్టర్ల బోర్డు ఈ మేరకు సమావేశం కానుందని కంపెనీ వెల్లడించింది. క్రితం ముగింపుతో పోలిస్తే నాట్కో షేరు ధర బీఎస్ఈలో గురువారం 2.78 శాతం ఎగసి రూ.553.60 వద్ద స్థిరపడింది.



## క్వార్టర్స్‌లో సాకేత్-యూకీ జోడీ ఓటమి

దుబాయ్ ఓపెన్ ఏటీపీ–500 టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో సాకేత్ మైనేని–యూకీ బాంబ్రీ (భారత్) జోడీ పోరాటం ముగిసింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాకేత్–యూకీ ద్వయం 2–6, 2–6తో లాయిడ్ గ్లాస్‌పూల్ (బ్రిటన్)–హ్యారీ హెలియోవారా (ఫిన్‌లాండ్) జోడీ చేతిలో పరాజయం పాలైంది. 58 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సాకేత్, యూకీ రెండు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. నాలుగుసార్లు తమ సర్వీస్‌ను కోల్పోయిన భారత జోడీ ప్రత్యర్థి జంట సర్వీస్‌లో మూడుసార్లు బ్రేక్ పాయింట్ అవకాశాలను వదులుకుంది. క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించిన సాకేత్–యూకీ బాంబ్రీలకు 23,660 డాలర్ల (రూ. 19 లక్షల 52 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది. ఇదే టోర్నీలో రామ్‌కుమార్ (భారత్)–ఐజామ్ ఖురేషీ (పాకిస్తాన్) జోడీ తొలి రౌండ్‌లో 4–6, 6–3, 5–10తో సాండెర్ జిలె–విలెజిన్ (బెల్జియం) ద్వయం చేతిలో ఓడిపోయింది.



# 'లయన్' పంజా

మన స్పిన్ కోటలో ప్రత్యర్థి బాగా పాగా వేసింది. మూడో టెస్టులో ఆస్ట్రేలియా పాచిక పారుతుంటే... ఆతిథ్య వేదికపై భారత్ వణుకుతోంది. రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌కంటే కాస్త ఎక్కువ స్కోరు చేసిందేమో కానీ... నాథన్ లయన్ (23.3–1–64–8) గర్జనకు తలవంచింది. వికెట్లు రాలిన తీరుతో భారత శిబిరం బిక్కమొహమేసింది. 76 పరుగుల అత్యల్ప లక్ష్యం ఆసీస్ ముందుండగా... మూడో రోజు తొలి సెషన్‌లోనే మూడో టెస్టు ముగిసే అవకాశముంది. టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇప్పటి వరకు ఏ జట్టూ 76 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగి ఓడిపోయిన దాఖలాలు లేవు.

- 8 వికెట్లతో భారత్‌ను కుప్పకూల్చిన ఆస్ట్రేలియా స్పిన్నర్
- రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా 163 ఆలౌట్
- ఆస్ట్రేలియా విజయలక్ష్యం 76
- మూడు రోజుల్లోనే ముగియనున్న మూడో టెస్ట్



పుజారా




నాథన్ లయన్

**ఇండోర్:** ఈ సిరీస్‌లో స్పిన్‌తో గెలిచిన భారత్ ఇప్పుడదే స్పిన్‌కు ఉక్కిరిబిక్కిరవుతోంది. తిప్పేసే చోటే (పిచ్) బొక్కబోర్లా పడుతోంది. ఒక ఇన్నింగ్స్ అంటే ఏమో అనుకోవచ్చు... రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ మన పిచ్‌పై మన బ్యాటర్లు చేతులెత్తేశారు. దాంతో టీమిండియా పరాజయం అంచున నిలిచింది. మూడో టెస్టు కూడా మూడు రోజుల్లోనే ముగిసేందుకు సిద్ధమైంది. వికెట్ల పతనంలో రెండో రోజు (16 వికెట్లు) మొదటి రోజు (14)ను మించింది. మూడో రోజు పర్యాటక ఆస్ట్రేలియా ముందు కేవలం 76 పరుగుల లక్ష్యమే ముందుండగా... స్పిన్ బంతులు బొంగరంలా తిరుగుతున్న పిచ్‌పై భారత్‌లో ఏ మూలనో ఆశలు రేపుతోంది. 75 పరుగుల్లోపే 10 వికెట్లు తీస్తే మాత్రం ఈ మ్యాచ్‌లో స్పిన్నర్లు కాదు పిచ్‌నే 'టర్నింగ్' విన్నర్ అవుతుంది. రెండో రోజు ఆటలో ముందుగా ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 76.3 ఓవర్లలో 197 పరుగుల వద్ద ముగిసింది. పర్యాటక జట్టుకు 88 పరుగుల ఆధిక్యం లభించగా... రెండో ఇన్నింగ్స్‌లో ఆతిథ్య భారత్ 60.3 ఓవర్లలో 163 పరుగులకే కుప్పకూలింది.

**11 పరుగులు... 6 వికెట్లు...**

ఓవర్‌నైట్ స్కోరు 156/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా ఉదయం గంటకుపైగా బాగానే ఆడింది. హ్యాండ్స్‌కాంబ్ (19; 1 ఫోర్), కామెరాన్ గ్రీన్ (21; 2 ఫోర్లు) జోడీ 17 ఓవర్లపాటు భారత బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంది. ఐదో వికెట్‌కు 40 పరుగులు జోడించడంతో జట్టు స్కోరు 200 పరుగులు దాటేలా కనిపించింది. అయితే 186 పరుగుల వద్ద హ్యాండ్స్‌కాంబ్, మరుసటి ఓవర్లో గ్రీన్ అవుట్ కాగానే ఆసీస్ అనూహ్యంగా 11 పరుగుల వ్యవధిలోనే ఆరు వికెట్లను కోల్పోయింది. పేస్‌తో ఉమేశ్ (3/12), స్పిన్‌తో అశ్విన్ (3/44) రెచ్చిపోయారు.

**లయన్ గర్జన**


ఆస్ట్రేలియాను అద్భుతంగా కట్టడి చేయడంతో ఇక జాగ్రత్తగా ఆడితే ఈ మ్యాచ్‌లో భారత్ గట్టెక్కుతుందని అంతా భావించారు. కానీ భారత్ రెండో ఇన్నింగ్స్‌పై లయన్ గర్జనకు చక్కని ఫీల్డింగ్ కూడా తోడు కావడంతో ఆస్ట్రేలియానే పైచేయి సాధించింది. ఓపెనర్లు రోహిత్ (33 బంతుల్లో 12), శుబ్‌మన్ (15 బంతుల్లో 5)లకు ఒక్క బౌండరీ అయిన కొట్టే అవకాశం ఇవ్వకుండా లయన్ ఇద్దరి పని పట్టాడు. కోహ్లి (26 బంతుల్లో 12; 2 ఫోర్లు) వచ్చి ఫోర్లు కొడుతున్నాడులే అనే ఆనందాన్ని కునెమన్ దూరం చేశాడు. 54 పరుగులకే కీలకమైన 3 వికెట్లు పెవిలియన్‌లో కూర్చున్నాయి. ప్రధాన వికెట్లే లయన్ ఉచ్చులో పడినా... పుజారా (142 బంతుల్లో 59; 5 ఫోర్లు, 1 సిక్స్), అయ్యర్ (27 బంతుల్లో 26; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) జోడీ ఉన్నంత సేపూ జట్టు ధీమాగానే ఉంది. స్టార్క్ బౌలింగ్‌లో ఖాజా కళ్లు చెదిరే క్యాచ్‌కు అయ్యర్ ఆట ముగియగా జట్టు పతనం మొదలైంది. శ్రీకర్ భరత్ (3) మళ్లీ నిరాశపరచగా... స్మిత్ డైవింగ్ క్యాచ్‌కు పుజారా ఇన్నింగ్స్ కూడా ముగిసింది. అశ్విన్ (16; 2 ఫోర్లు), అక్షర్ (15 నాటౌట్; 1 సిక్స్) రెండంకెల స్కోర్లు చేశారు. లయన్ 8, స్టార్క్, కునెమన్ చెరో వికెట్ తీశారు.

**స్కోరు వివరాలు**

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 109; **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** హెడ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జడేజా 9; ఖాజా (సి) గిల్ (బి) జడేజా 60; లబుషేన్ (బి) జడేజా 31; స్మిత్ (సి) భరత్ (బి) జడేజా 26; హ్యాండ్స్‌కాంబ్ (సి) అయ్యర్ (బి) అశ్విన్ 19; గ్రీన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఉమేశ్ 21; క్యారీ (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 3; స్టార్క్ (బి) ఉమేశ్ 1; లయన్ (బి) అశ్విన్ 5; మర్ఫీ (బి) ఉమేశ్ 0; కునెమన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 22; **మొత్తం (76.3 ఓవర్లలో ఆలౌట్) 197. వికెట్ల పతనం:** 1–12, **2–108, 3–125, 4–146, 5–186, 6–188, 7–**192, 8–196, 9–197, 10–197. **బౌలింగ్:** అశ్విన్ 20.3–4–44–3, జడేజా 32–8–78–4, అక్షర్ 13–1–33–0, ఉమేశ్ 5–0–12–3, సిరాజ్ 6–1–13–0. **భారత్ రెండో ఇన్నింగ్స్:** రోహిత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) లయన్ 12; గిల్ (బి) లయన్ 5; పుజారా (సి) స్మిత్ (బి) లయన్ 59; కోహ్లి (ఎల్బీడబ్ల్యూ) (బి) కునెమన్ 13; జడేజా (ఎల్బీడబ్ల్యూ) (బి) లయన్ 7; అయ్యర్ (సి) ఖాజా (బి) స్టార్క్ 26; భరత్ (బి) లయన్ 3; అశ్విన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) లయన్ 16; అక్షర్ (నాటౌట్) 15; ఉమేశ్ (సి) గ్రీన్ (బి) లయన్ 0; సిరాజ్ (బి) లయన్ 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (60.3 ఓవర్లలో ఆలౌట్) 163. వికెట్ల పతనం:** 1–15, 2–32, 3–54, 4–78, 5–113, 6–118, 7–140, 8–155, 9–155, 10–163. **బౌలింగ్:** స్టార్క్ 7–1–14–1, కునెమన్ 16–2–60–1, నాథన్ లయన్ 23.3–1–64–8, మర్ఫీ 14–6–18–0.

## ఉత్తమ మహిళా చెస్ జట్టుగా భారత్

ఆసియా చెస్ సమాఖ్య అవార్డులు



**అబుదాబి:** ఆసియా చెస్ సమాఖ్య (ఏసీఎఫ్) 2022 వార్షిక అవార్డులను ప్రకటించారు. ఉత్తమ మహిళా చెస్ జట్టుగా భారత్‌కు పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలి, తానియా సచ్‌దేవ్, భక్తి కులకర్ణిలతో కూడిన భారత జట్టు గత ఏడాది సొంతగడ్డపై తొలిసారి జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో మహిళల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించింది. ఈ ప్రదర్శనకుగాను ఏసీఎఫ్ ఉత్తమ జట్టు అవార్డు హంపి బృందానికి దక్కింది. భారత్‌కే చెందిన యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారం గెల్చుకున్నాడు. గత చెస్ ఒలింపియాడ్‌లో తమిళనాడుకు చెందిన గుకేశ్ అత్యధికంగా తొమ్మిది పాయింట్లు స్కోరు చేసి స్వర్ణ పతకాన్ని సాధించాడు. గత ఏడాది మార్చిలో గుకేశ్ 2700 ఎలో రేటింగ్‌ను దాటి ఈ ఘనత సాధించిన ఆరో భారతీయ చెస్ ప్లేయర్‌గా నిలిచాడు.

## ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా మెగ్ లానింగ్



**ముంబై:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఆస్ట్రేలియా క్రికెటర్ మెగ్ లానింగ్ కెప్టెన్‌గా... భారత జట్టు సభ్యురాలు జెమీమా రోడ్రిగ్స్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. ముంబై వేదికగా డబ్ల్యూపీఎల్ తొలి సీజన్ రేపు ప్రారంభంకానుంది. 30 ఏళ్ల మెగ్ లానింగ్ తన సారథ్యంలో గతవారం దక్షిణాఫ్రికాలో జరిగిన మహిళల టి20 ప్రపంచ కప్‌లో ఆస్ట్రేలియాను విశ్వవిజేతగా నిలబెట్టింది. ఐదు జట్లతో కూడిన డబ్ల్యూపీఎల్‌లో మూడు జట్లకు (గుజరాత్ జెయింట్స్–బెత్ మూనీ; యూపీ వారియర్స్–అలీసా హీలీ; ఢిల్లీ క్యాపిటల్స్–మెగ్ లానింగ్) ఆస్ట్రేలియా క్రికెటర్లు... రెండు జట్లకు భారత క్రికెటర్లు (ముంబై ఇండియన్స్–హర్మన్‌ప్రీత్ కౌర్; రాయల్ చాలెంజర్స్ బెంగళూరు–స్మృతి మంధాన) కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు.

## దక్షిణాఫ్రికా విజయం



రబడ

**సెంచూరియన్:** వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో దక్షిణాఫ్రికా జట్టు 87 పరుగుల తేడాతో గెలిచి రెండు టెస్టుల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మ్యాచ్ మూడో రోజు 247 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 41 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబడ (6/50) విండీస్‌ను దెబ్బ తీశాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 49/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 28 ఓవర్లలో 116 పరుగులకే కుప్పకూలింది. కీమర్ రోచ్ (5/47), అల్జారి జోసెఫ్ (2/30), జేసన్ హోల్డర్ (2/7) దక్షిణాఫ్రికాను కట్టడి చేశారు. మూడో రోజు మొత్తం 16 వికెట్లు పడ్డాయి.

## రెస్ట్ ఆఫ్ ఇండియా 484

**గ్వాలియర్:** రంజీ చాంపియన్ మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న ఇరానీ కప్ మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 121.3 ఓవర్లలో 484 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 381/3తో రెండో రోజు ఆట కొనసాగించిన రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు మరో 103 పరుగులు జోడించి మిగతా ఏడు వికెట్లు కోల్పోయింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన మధ్యప్రదేశ్ ఆట ముగిసే సమయానికి 3 వికెట్లకు 112 పరుగులు చేసింది.

## మహిళలకూ ప్రొ కబడ్డీ లీగ్!

**న్యూఢిల్లీ:** పురుషుల ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సక్సెస్ నేపథ్యంలో... త్వరలోనే మహిళా కబడ్డీ క్రీడాకారిణిలకూ ప్రొ లీగ్‌ను నిర్వహించాలని నిర్వాహకులు భావిస్తున్నారు. 2016లో మూడు జట్లతో మహిళల చాలెంజ్ కబడ్డీ టోర్నీని నిర్వహించారు. ఈసారి ప్రత్యేక లీగ్ ఏర్పాటు చేస్తామని, అతి త్వరలో ఇది కార్యరూపం దాలుస్తుందని పీకేఎల్ కమిషనర్ అనుపమ్ గోస్వామి తెలిపారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. 